www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 250 | గురువారం | 1 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

అతిలోక సుందరికి కన్నీటి వీడ్కోలు

ఏడు కిలోమీటర్ల పొడవున శ్రీదేవి అంతిమయాత్ర

మహారాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు

హాజరైన చిరంజీవి, వెంకటేష్, కమల్ హాసన్, రజనీకాంత్, అమితాబ్, షారూఖ్ తదితర ప్రముఖులు



ముంబయి: లక్షలాది మంది అభిమానుల అశ్రు నివాళులు, బహుభాషా చిత్ర ప్రముఖుల కడసారి వీడ్కోళ్లు, కోట్లాది మంది దూరతీరాల అశేష జనం మౌన ఆరాధనల తరువాయి 6లో

జయేంద్ర సరస్వతి శివైక్యం

శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ అంతిమ శ్వాస

ప్రముఖుల సంతాపం, నేడు అంత్యక్రియలు



కాంచీపురం (తమిళనాడు): శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి (82) కన్నుమూశారు. కొంత కాలంగా శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయనకు మంగళవారం రాత్రి అది మరింత తీవ్రం కావడంతో శిష్యులు కంచిలోని శంకర మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనను కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో బుధవారం నాడు ఉదయం 9 గంటలకు జయేంద్ర పరమపదించారు. ఆదిశంకరాచార్యులు స్థాపించిన కంచి తరువాయి 6లో

గ్రూప్-2 ఓఎంఆర్ షీట్లపై కమిటీ



పై 5 వేల షీట్ల పరిశీలనకు ముగ్గురు సీనియర్ న్యాయవాదులతో నియామకం

వైట్‌నర్, జంబ్లింగ్ ఆరోపణ కేసులో హైకోర్టు ఆదేశాలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సర్కార్ నిర్వహించిన గ్రూప్–2 పరీక్షల్లో వైట్‌నర్, జంబ్లింగ్ వినియోగంపై ఆరోపణలు వచ్చిన దృష్ట్యా ఆ పరీక్షల్లో అగ్రస్థానంలోని 5 వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలించాలని హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. ఇందుకోసం ముగ్గురు సీనియర్ లాయర్లతో కమిటీని ఏర్పాటు చేస్తూ బుధవారం హైకోర్టు న్యాయమూర్తి పి.నవీన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ వచ్చే నెల 19కి వాయిదా వేశారు. ఓఎంఆర్ షీట్లలో తప్పులున్నా, కొట్టివేతలున్నా, వైట్‌నర్ వాడినా, కిందివైపున పేర్లు రాసినా వారిని అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన చరణ్‌దాస్ గోస్వామి మరో 20 మంది, రామచంద్రారెడ్డి మరో 14 మంది పలు వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఇదే సమయంలో వైట్‌నర్ వాడిన అభ్యర్థులు చాలా తక్కువని, వారి కోసం పరీక్షలపై స్టే ఇస్తే పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నష్టపోతారంటూ కూడా రిట్లు దాఖలయ్యాయి. వీటిని బుధవారం హైకోర్టు మరోసారి విచారణ జరిపి న్యాయవాదులతో కమిటీ ఏర్పాటు చేసి అగ్రస్థానంలో ఉన్న ఐదు వేల ఓఎంఆర్ షీట్లను పరిశీలించాలని ఆదేశించారు. సీనియర్ లాయర్లు నిరంజన్‌రెడ్డి, రఘునందన్‌రావు, రఘురామ్‌లు కమిటీలో ఉంటారని, ఈ కమిటీ శని, ఆది వారాల్లో 5 వేల తరువాయి 6లో

కార్తీ చిదంబరం అరెస్టు 10

హిజ్రా చట్టాన్ని సవరించే విషయం యోచించండి

- నిజాం కాలం నాటి చట్టాన్ని కొట్టివేయక ముందే తగు చర్య తీసుకోండి : హైకోర్టు ఆదేశం

మన తెలంగాణ/ హైదరాబాద్: నిజాం పాలనలో 1919లో హిజ్రాల కోసం తెచ్చిన తెలంగాణ యూనక్స్ (నపుంసక) చట్ట నిబంధనలు ఘోరంగా ఉన్నాయని, ఈ చట్ట సవరణపై ప్రభుత్వం ఆలోచన చేయాలని హైకోర్టు సూచించింది. తాము చట్టాన్ని కొట్టేయక తరువాయి 6లో

2 **5 రోజుల పాటు ఎపికి నీటి విడుదలకు రాష్ట్రం అంగీకారం**

దళిత బాలికపై అత్యాచారం, హత్యాయత్నం 7

- ప్రాణాపాయ స్థితిలో బాలిక, మంచిర్యాల జిల్లాలో దారుణం

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వం అం దిస్తున్న సంక్షేమ పథకాలను యువత సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నా రు. ఆధునిక శిక్షణ పూర్తి చేసుకున్న నాయీ బ్రాహ్మణ యువతీ యువకులకు ఆయన బుధవారం సంక్షేమ భవన్‌లో కిట్లను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలానికి అనుగుణంగా యువత అభిరుచులు మారుతున్నాయని, దానికనుగుణంగా వారి హెయిర్ స్టైల్ తో పాటు బ్యూటిఫికేషన్‌లలో మార్పులు వచ్చాయన్నారు. ఆధునికంగా వచ్చిన మార్పులకు అనుగుణంగా నాయీ బ్రాహ్మణ యువత సాంకేతికంగా అభివృద్ధిలోకి వచ్చే విధంగా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ద్వారా 31 జిల్లాల నుండి 650 మంది నాయి బ్రాహ్మణ యువతీ యువకులను ఎంపిక చేసి వారికి ఆరు సంస్థల ద్వారా ఆధునిక శిక్షణ కల్పించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో మోడరన్ హెయిర్ స్టైల్, బ్యూటిఫికేషన్‌పై 15 రోజుల పాటు శిక్షణ లభించిందన్నారు. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు. తెలంగాణ రజక ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ లోని సుమంగళి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక లాండ్రీ యంత్రాలు, కెమికల్స్ వాడకంపై స్టార్ వైట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేసిన ప్రదర్శన, శిబిరాన్ని బుర్రా వెంకటేశం ప్రారంభించారు.



యుఎఫ్‌ఒ, ఎగ్జిబిటర్ల సమస్యను పరిష్కరిస్తాం : మంత్రి తలసాని

మన తెలంగాణ/హైదరాబాద్ : ధరల చెల్లింపులో క్యూబ్/ యూఎఫ్‌ఒ సంస్థ నిర్వాహకులు, సినీ ఎగ్జిబిటర్ల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని సినిమాటోగ్రాఫి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీనిచ్చారు. ఎఫ్‌డిసి ఛైర్మన్ రాంమోహన్‌రావు ఆధ్వర్యంలో దక్షిణ భారత ఫిలిం ఛాంబర్, తెలుగు ఫిలిం ఛాంబర్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ప్రతినిధులు సచివాలయంలో బుదవారం మంత్రిని కలిసి ప్రస్తుతం థియేటర్లలో సినిమాలను ప్రదర్శిస్తున్న క్యూబ్/యూఎఫ్‌ఒ సంస్థల ధరలను పెంచడానికి నిరసనగా మార్చి 2వ తేదీ నుంచి దక్షిణ భారతదేశంలో సినిమాల ప్రదర్శనను నిలిపివేయనున్నట్లు వివరించారు. హాలీవుడ్ చిత్రాలకు, తెలుగు, హిందీ చిత్రాలకు ఒక్కో రకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ధరల పెంపు వలన ఎగ్జిబిటర్లకు, తమకు తీరని నష్టం వాటిల్లుతుందని వారు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఎగ్జిబిటర్లకు,క్యూబ్ ఆపరేటర్లకు మధ్య ఏర్పడిన వివాద పరిష్కారానికి త్వరలోనే ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఫిలిం ఛాంబర్స్ అధ్యక్షులు మురళీమోహన్, సౌత్ ఇండియా నిర్మాతల సంఘం కార్యదర్శి సి.కళ్యాణ్, తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు జెమినికిరణ్, దామోదర్ ప్రసాద్ పాల్గొన్నారు.

FORM IV

(See Rule 8)

Statement of ownership and other particulars pertaining to MANA TELANGANA

1. Place of publication : **HYDERABAD**
2. Periodicity of its publication : Daily
3. RNI Registration No. : TELTEL/2012/42234
4. Printer's Name : **K.Sreenivas Reddy**
   Nationality : Indian
   Address : H.No.3-6-67 & 68, Flat No.A6, B.N.Reddy Towers, Hyderguda, Hyderabad-500029, Telangana
5. Publisher's Name : **K.Sreenivas Reddy**
   Nationality : Indian
   Address : H.No.3-6-67 & 68, Flat No.A6, B.N.Reddy Towers, Hyderguda, Hyderabad-500029, Telangana
6. Editor's Name : **K.Sreenivas Reddy**
   Nationality : Indian
   Address : H.No.3-6-67 & 68, Flat No.A6, B.N.Reddy Towers, Hyderguda, Hyderabad-500029, Telangana
7. Name and addresses of individuals who own the newspaper and partner or shareholders holding more than one percent of the total capital. : **M/s. Moveon Media Pvt. Ltd.,** H.No.1-1-60/7A, 4th Floor, Beacon Towers, Street No.13, Jawahar Nagar, Near RTC 'X' Roads, Hyderabad - 500020, Telangana.
   1. **Anjaiah Polisetty,** Flat No:101, Manbhumi, Ashok Pride, H No:1-10-14, Road No:4, Ashoknagar, Hyderabad-500020
   2. **Tumu Mohan Rao,** 7-3-94, Machli Bazar, Hanmkonda, Warangal.
   3. **Dudipala Sridhar Reddy,** H.No:3-6-57 & 66, A-14, Salarjung Lane, Himayath Nagar, Hyderabad-500029
   4. **Goteke Vamsi Krishna Reddy,** H.No:17-1-467, Krishna Nagar, Saidabad, Hyderabad-59
   5. **Deepavali Babu Rao,** 17-1-383/79A, Vinay Nagar Colony, Opp: Axis Bank, Saidabad, Hyderabad.
   6. **Singi Reddy Shailender Reddy,** P.No:13-2, Amarajyothi Colony, New Bowenpally, Secuderabad.
   7. **Kalimekolan Karteek Reddy,** H.No:3-6-67 & 68, A-6, Salarjung Lane, Himayath Nagar, Hyderabad-500029
   8. **Satyanarayana Reddy,** Konthanapally(V), Thipuraram(M), Nalgonda(Dt).
   9. **Jale Bhaskar Reddy,** H.No:7-3-61, Ramachendra Gudem, Miryalaguda, Nalgonda.
   10. **Polisetty Siddartha,** Flat No:101, Manbhumi, Ashok Pride, H No:1-10-14, Road No: 4, Ashoknagar, Hyderabad-500020.
   11. **Varagani Krishna Murthy,** F.No:404, Sri Sai Chandra Sadan, Ashok Nagar, Miryalaguda.
   12. **Pottumuthu Narender,** 13-88, Yadav Nagar, Old Telephone Exchnage, Malkajgiri, Hyderabad-47.
   13. **Palla Rajeswar Reddy,** H.No:8-2-293/82 Ng/32, Nandagiri Hills, Lane-3, Jublihills, Hyderabad.
   14. **Palla Krishna,** H.No:8-2-293/82 Ng/32, Nandagiri Hills, Lane-3, Jublihills, Hyderabad.
   15. **Pamudurthy Prabhakar Reddy,** No:43, Gandhi Nagar, Khb Colony, Bellary.
   16. **Pingali Rajender Reddy,** 8-2-686/Db/19, R.No:12, Banjara Hills, Hyderabad.
   17. **Maddu Subash Reddy,** 1-10-47/1, F.No:301, Indra Residency, R.No:2, Ashok Nagar, Hyderabad.

I, K.Sreenivas Reddy, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 28-02-2018 Sd/- **K.Sreenivas Reddy**
Place : Hyderabad Publisher

విలీనం ప్రసక్తే లేదు

- పొత్తులపై చర్చించాకే ప్రకటన
- కొందరు కుప్పిగంతులేస్తున్నారు
- టిటిడిపి సర్వసభ్య సమావేశంలో చంద్రబాబు



మన తెలంగాణ/హైదరాబాద్ : వచ్చే ఎన్నికలలో తెలంగాణలో టిడిపి పొత్తుల గురించి టిడిపి జాతీయ అధ్యక్షులు, ఎపి ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు సంకేతాలిచ్చారు. " గత ఎన్నికల్లో బిజెపితో కలిసి పోటీ చేస్తే 22 శాతం ఓట్లు వచ్చాయి. ఇప్పుడు వాళ్లు ఏక పక్షంగా టిడిపితో పొత్తు లేదని వారికి వారే స్పష్టం చేశారు. ఇప్పుడు ప్రత్యామ్నాయం చూసుకోవాలి. ఇంకా రెండు పార్టీలు ఉన్నాయి. ఒక పార్టీ విభజన సమయంలో ఎపికి అన్యాయం చేసింది. ఇంకో పార్టీ తెలంగాణ కోసం పోరాడింది. అందరితో మాట్లాడిన తరువాత ఏ నిర్ణయం తీసుకుంటే బాగుంటుందో ఆ రకంగా ముందుకెళ్తామని" ఆయన స్పష్టం చేశారు. ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం టిడిపి రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు సమక్షంలో మహబూబబాద్ మాజీ ఎంఎల్‌ఎ బండి పుల్లయ్య, జనగామ నియోజకవర్గ బిజెపి నేత పత్తుల రాజిరెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకులు గజ్జల ఆనంద్ టిడిపిలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో టిడిపికి రాష్ట్రంలో 22శాతం ఓట్లు వచ్చాయని, ఆ తరువాత కొన్ని పరిణామాల వల్ల కొంత దెబ్బ తిన్నదని, అయినా క్యాడర్ చెక్కు చెదరలేదన్నారు. పొత్తులపై కార్యకర్తలకు న్యాయం చేసే విధంగా నేతలతో చర్చలు జరిపి ప్రకటన చేస్తామన్నారు. నిగూఢంగా ఉన్న ఓటు బ్యాంకును తమకు అనుకూలంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో టిడిపిని టిఆర్‌ఎస్‌లో విలీనం చేయాలని సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో పార్టీని విలీనం చేస్తామనే అధికారం ఎవరికీ లేదని చంద్రబాబు అన్నారు. అలా మాట్లాడే స్వేచ్ఛ, హక్కు ఏ ఒక్కరికి లేదన్నారు. ఒకరిద్దరు నాయకులు అటు ఇటు కుప్పిగంతులు వేస్తుంటారని, వారిని పట్టించుకోవద్దన్నారు. టిడిపిని ఏ పార్టీతో కలిపే పరిస్థితి ఉండదని, అది ఎప్పటికి జరగదన్నారు. తన 40 ఏండ్ల ప్రస్థానంలో అనేక సవాళ్ళను ఎదురుకున్నానని, ఎన్‌టిఆర్ స్ఫూర్తి టిడిపికి ఎప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్రం లో బలమైన క్యాడర్ ఉన్న ఏకైక పార్టీ టిడిపినేన్నారు. తమ పై తప్పుడు కేసులు పెట్టినా, బెదిరింపులు చేసినా నాయకులు తలొగ్గలేదన్నారు. ఒంటేరు ప్రతాప్ రెడ్డికి టిడిపి మద్దతిచ్చిందని, అందుకు తెలంగాణ నాయకత్వాన్ని అభినందించారు.రాజకీయ కక్షల్లో టిడిపి కార్యకర్తలను వేధింపులకు గురిచేసినా కూడా పార్టీని వీడలేదన్నారు. తెలంగాణలో టిడిపిని కాపాడుకునే బాధ్యత తనపై ఉందన్నారు. ఎక్కువ పని ఒత్తిడి వల్ల సమయం కేటాయించడం లేదన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో అన్ని పార్టీలు రోడ్డెక్కుతున్నారని, టిడిపి నేతలు రోడ్ల పైకి వెళ్లాలన్నారు.తెలంగాణకు, ఎపికి కేంద్రం ఉదారంగా సాయం చేయాల్సి ఉందన్నారు. కేంద్రం నుంచి ఇంకా ఎపికి నిధులురావాలని,విభజన హామీలు నేరవేర్చాలన్నారు.

జూనియర్‌కు లేదా భువనేశ్వరికి అప్పగించండి : రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న నాయకత్వం సరిగ్గా పనిచేయడం లేదని, ఇలా అయితే పార్టీ మనుగడ కష్టమేనని కార్యకర్తలు బాబుతో తమ ఆవేదనను పంచుకున్నారు. జూనియన్ ఎన్‌టిఆర్, నారా బ్రహ్మణీ, నారా భువనేశ్వరీలలో ఎవరినైనా ఒకరికి రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ఎన్‌టిఆర్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. దీనికి చంద్రబాబు స్పందిస్తూ కార్యకర్తల్లో నుంచే నాయకత్వం రావాలని, తన కుటుంబం నుంచి కాదన్నారు. కాగా మోత్కుపల్లి నర్సింహులు ఈ సమావేశా నికి హాజరుకాలేదు. కానీ కేంద్రమంత్రి సుజనా చౌదరి కుమారుడి వివాహంలో బాబును కలిసినట్లు తెలిసింది.

తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తు గడువు పొడిగింపు

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డు –2018 కి దరఖాస్తుల దాఖలు చేయడానికి గడువును మార్చి 3 వరకు పొడిగించారు. వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న పౌర అధికారులు (సివిల్ సర్వెంట్స్) విశిష్ట సేవలను గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డుని 2017లో ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే 2018 అవార్డు కోసం దరఖాస్తులను నాన్ యూనిఫాం సివిల్ సర్వెంట్స్ నుండి ఫిబ్రవరి 12 నుండి దరఖాస్తులు స్వీకరిస్తోంది. దీని కోసం ఓ ప్రత్యేక వెబ్‌సైట్‌ను (http: texa.telangana.gov.in)రూపొందించారు. జనరల్, ఇన్నోవేషన్, ఫ్లాగ్‌షిప్ ప్రొగ్రామ్స్ అనే మూడు విభాగాలలో వ్యక్తిగత, సమూహం, సంస్థ అనే మూడు వర్గాలలో సివిల్ సర్వెంట్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వం 2018 సంవత్సరానికి గాను ఆరు ఫ్లాగ్‌షిప్ ప్రొగ్రామ్స్ ఎంపిక చేసింది. వాటిలో బాలికల విద్య పోషణ, పాలనలో ఐటి వినియోగం, కెసిఆర్ కిట్, భూరికార్డుల ప్రక్షాళన, ఘన వ్యర్థాల తొలగింపు, గొర్రెల పంపిణీ ఉన్నాయి. దరఖాస్తులు తప్పనిసరిగా నాన్‌యూని ఫాం సివిల్ సర్వెంట్స్ మాత్రమే సమర్పించాలి. ఒక సివిల్ సర్వెంట్ ఏదేని ఒక ప్రాజెక్టును ఒక విభాగం, ఒక వర్గంలోనే సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఒక సివిల్ సర్వెంట్ ఎన్ని ప్రాజెక్టులనైనా, ఎన్ని విభాగాలలోనైనా, వర్గాలలోనైనా ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. అవార్డు కోసం సమర్పించే దరఖాస్తులను ఎడిట్ చేసుకునే వెసులుబాటు కల్పించబడింది. అభ్యర్థులు తమ దరఖాస్తును సేవ్ చేసుకోవలసి ఉంటుంది. అయితే సేవ్ చేసుకున్న దరఖాస్తులను తప్పనిసరిగా గడువులోగా మార్చి 3న రాత్రి 11:59:59 గం.ల వరకు సబ్‌మిట్ చేయాలి. కేవలం సేవ్ చేసిన దరఖాస్తులు అవార్డుల కై పరిశీలించబడవు. తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డు గ్రూప్–1 నుండి గ్రూప్–4 స్థాయి ఉద్యోగులకు ఉద్దేశించిన తెలంగాణ రాష్ట్ర ఉద్యోగి ప్రోత్సాహక పథకానికి భిన్నమైంది.

ఎపికి సాగర్ నీటి విడుదల

మన తెలంగాణ / హైదరాబాద్ : ఒప్పందంలోని కోటాకంటే ఎక్కువ నీటిని వాడుకున్నట్లు స్వయంగా కృష్ణా యాజమాన్య బోర్డు గణాంకాల ద్వారా వివరించిన తర్వాత కూడా అదనపు నీటికి ఆ రాష్ట్రం పట్టుబట్టింది. ఐదు రోజుల పాటు రెండు వేల క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేయాల్సిందిగా కృష్ణా బోర్డును కోరినట్లు సభ్య కార్యదర్శి పరమేశం తెలంగాణ ఇఎన్‌సికి బుధవారం రాసిన లేఖలో తెలియజేశారు. రెండు వేల క్యూసెక్కుల వంతున ఐదురోజుల పాటు నీటిని విడుదల చేయాల్సిందిగా ఫోన్‌ద్వారా ఆంధ్రప్రదేశ్ ఇఎన్‌సి కోరారన్న విషయాన్ని తెలంగాణ ఇఎన్‌సికి తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలకు ఐదు రోజుల పాటు నీరు అవసరమవుతుందని వివరించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఇఎన్‌సికి ఏపీ విజ్ఞప్తిని వివరించడంతో నీటి విడుదలకు అంగీకారం తెలిపినట్లు పరమేశం ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో ఐదు రోజుల పాటు నాగార్జున్‌సాగర్ కుడికాల్వ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రెండు వేల క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేయాల్సిందిగా కృష్ణా నది యాజమాన్య బోర్డు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపు బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం : కృష్ణా బేసిన్‌లోని నీటి నిర్వహణపై చర్చించేందుకు రెండు రాష్ట్రాల ఇంజనీర్ ఇన్ ఛీఫ్‌లతో కృష్ణా నది యాజమాన్య బోర్డు శుక్రవారం సమావేశం ఏర్పాటుచేసింది. రెండు రాష్ట్రాల ఇఎన్‌సిలు ఈ సమావేశానికి హాజరయ్యేందుకు సమ్మతి తెలియజేశారని, హైదరాబాద్‌లోనే ఈ సమావేశం జరుగుతుందని బోర్డు సభ్య కార్యదర్శి రెండు రాష్ట్రాల ఇఎన్‌సిలకు బుధవారం రాసిన లేఖలో పేర్కొన్నారు. జలసౌధలోని బోర్డు సభ్య కార్యదర్శి ఛాంబర్‌లో మధ్యాహ్నం 3.00 గంటల నుంచి ఈ సమావేశం జరుగుతుందని 201718 సంవత్సరానికి నీటి నిర్వహణపై చర్చించేందుకే దీన్ని నిర్వహిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ఇఎన్‌సిల ఏకాభిప్రాయం మేరకే ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పరమేశం ఆ లేఖలో స్పష్టం చేశారు.



తెలంగాణ పోలీసులకు 8 పతకాలు

- ఎన్‌సిఆర్‌బి ట్రోఫీని అందుకున్న అదనపు డిజి

మన తెలంగాణ/హైదరాబాద్ : చెన్నైలో జరుగుతున్న ఆల్ ఇండియా పోలీసు డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు ఎనిమిది పతకాలను సాధించారు. పోలీసు ఫోటోగ్రఫీలో కరీంనగర్ 'క్లూస్ టీం'కు చెందిన కానిస్టేబుల్ కె.శ్రీనివాస్, వీడియోగ్రఫీలో హైదరాబాద్ సిసిఎస్ కానిస్టేబుల్ టి.మురళీ మోహన్‌లు వెండి పథకం సాధించారు. ఇక రాచకొండ ఎస్‌ఐ ఎస్.అనీల్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీ నారాయనరెడ్డి (రెండు పతకాలు), కానిస్టేబుల్ జావెద్ పాషా, ఎస్‌ఐ జి.గణేష్, సిఐడికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ పి.సంజీవరావు, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కానిస్టేబుల్ అంజయ్యలు వివిధ అంశాలలో నిర్వహించిన పోటీలో కాంస్య పథకాలు సాధించారు. ఇక ఇటీవల తెలంగాణ పోలీసులకు 'టిఎస్ పోలీసు కాప్' మొబైల్ అప్లికేషన్‌కు వచ్చిన టెక్నాలజీ ట్రోపిని డ్యూటీమీట్‌లో అదనపు డిజి అంజనీ కుమార్ అందుకున్నారు. ఈ ట్రోఫీ రావడం తెలంగాణ పోలీసుల ఘనత దేశ వ్యాప్తంగా చాటినట్లు అయ్యిందని అంజనీకుమార్ పేర్కొన్నారు.

పొరపాట్లు జరుగకుండా పరీక్షలు

- కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం
- పరీక్షల నిర్వహణపై కలెక్టర్‌లు, ఎస్‌పి,డిఇఒలతో మంత్రి కడియం వీడియో కాన్ఫరెన్స్



మనతెలంగాణ/హైదరాబాద్ : పదవ తరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లు లేకుండా పక్కాగా నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. పదవ తరగతి, ఇంటర్ పరీక్షలకు బుధవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు, డిఇఒలు, ఇతర అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. దూరప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బందోబస్తు కల్పించాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలకు ప్రశ్న పత్రాలను, ఆ తర్వాత జవాబు పత్రాలను తీసుకెళ్లే సమయంలో పోలీసు అధికారులు ఎస్కార్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. వేసవి ఇప్పటికే మొదలైందని, కొత్తగూడెంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని, దీనిని దృష్టిలో పెట్టుకుని పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మెడికల్ వసతులు కల్పించాలని తెలిపారు. రవాణాకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాలలో ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్లను అనుమతించవద్దని, పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో ఏమైనా ఫోన్లు వస్తే కలెక్టర్లు, ఎస్‌పిలు, ఇతర ఉన్నతాధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఎ.అశోక్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్, ఇన్‌స్పెక్టర్ జనరల్ శిఖా గోయల్ అధికారులను సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ, పోలీసు, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఘనంగా దీక్షాంత్ పరేడ్‌లు

- ముగించుకున్న 355 మంది పురుష, 224 మంది మహిళా కానిస్టేబుళ్లు





మన తెలంగాణ/హైదరాబాద్: విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు కావాలసిన శక్తి సామర్థ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని హోం శాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది పేర్కొన్నారు. సాయుధ రిజర్వు పోలీసు (ఎఆర్) విభాగానికి ఎంపికైన 355 మంది కానిస్టేబుళ్ల శిక్షణ ముగింపు సందర్భంగా సిటీ ఎఆర్ పోలీసు శిక్షణా కేంద్రంలో ఘనంగా నిర్వహించిన దీక్షాంత్ పరేడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణ ముగించుకుని విధుల్లో చేరుతున్న కానిస్టేబుళ్ల సేవా దృక్పథంతో పనిచేయాలని, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. కష్టపడి ఉద్యోగం సంపాదించడం ఒక ఎత్తయితే దాన్ని కాపాడుకోవడం కూడా విధి నిర్వహణపై ఆధారపడి ఉందన్నారు. తొమ్మిది నెలల్లో అధికారులు నేర్పిన అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. 2017లో నిర్వహించిన పోలీసు రిక్రూట్ మెంట్ ద్వారా ఏఆర్‌కు ఎంపికైన 355 మంది కానిస్టేబుళ్లలో హైదరాబాద్‌కు వారు 272 మంది, రంగారెడ్డి నుంచి 25 మంది, మహబూబ్‌నగర్ నుంచి ఒక్కరు, అదిలాబాద్ నుంచి 27 మంది, కరీంనగర్ నుంచి 30 మంది ఉన్నారు. వీరిలో 57 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు కాగా 186 మంది గ్రాడ్యుయేట్లు, 79 మంది ఇంజనీర్ గ్రాడ్యుయేట్లు, మిగిలిన 33 మంది ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగినవారున్నారు. శిక్షణ పొందిన వీరందరికి సాంకేతిక నైపుణ్యం ఇవ్వడానికి ప్రతి ఒక్కరికి లాప్‌టాప్‌లు ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. శిక్షణ ముగించుకొని కవాతు ప్రదర్శనలో పాల్గొన్న పోలీసులకు సిటీ కాలేజీ లెర్నింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ బి.ఎస్.వి.రవికుమార్ ప్రతిజ్ఞ చేయించారు. పోలీసు కమిషనర్ వి.వి.శ్రీనివాస్‌రావు,అదనపు పోలీసు కమిషనర్లు స్వాతిలక్రా, ఎం. శివప్రసాద్,జాయింట్ పోలీసు కమిషనర్ డాక్టర్ రవిందర్,డిసి పిలుసత్యనారాయణ, బాబురావులు పాల్గొన్నారు.

16కి.మీ నడిచి వచ్చిన రాజీవ్ త్రివేది : దీక్షాంత్ పరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావడానికి హోం శాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది 16 కి.మీ దూరం నడిచి వచ్చారు. త్రివేదికి ప్రతి రోజు వాకింగ్ చేయ డం అలవాటు. పేట్లబుర్జులో ఈ కార్యక్రమానికి ఉదయ మే హాజరు కావాల్సి ఉండడంతో వాకింగ్‌ను ఇటు వైపు మళ్లించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి పరేడ్ గ్రౌండ్ వరకు ఆయన నడుచుకుంటూనే రావడం గమనార్హం.

ఘనంగా మహిళా కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ : రాజ్‌బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీలో కానిస్టేబుల్ శిక్షణ పొందిన 224 మందితో బుధవారం దీక్షాంత్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామక్రిష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధినిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. 2017 పోలీసు రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన 224 మంది మహిళా కానిస్టేబుళ్లలో 144 మంది సివిల్ విభాగానికి ఎంపికకాగా, 80 మంది ఏఆర్‌కు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పోలీసు అకాడమీ డైరెక్టర్ జితేందర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



క్రిస్టియన్ల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

మనతెలంగాణ/హైదరాబాద్: క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సచివాలయంలో బుధవారం మంత్రి తలసాని సమక్షంలో సనత్‌నగర్‌లోని వివిధ చర్చీల కమిటీ సభ్యులతో క్రిస్టియన్ మైనార్టీ అధికారులు సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ స్టీఫెన్ సన్, రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్‌ఛైర్మన్ శంకర్ లూక్, మైనార్టీ వెల్ఫేర్ పరిపాలనా అధికారి సామ్యూల్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఖాసీం, డిసి శైలజ, ఎస్.మోహన్‌సింగ్, ఈఈ సురేష్, నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ చర్చీలు, స్మశానవాటికలు, బోర్‌వెల్స్ తదితర పనుల నిమిత్తం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నిధులను విడుదల చేస్తున్నట్లు వివరించారు. గతంలో ఏ ప్రభుత్వమూ క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై చర్చిలకు వచ్చే వారిలో చైతన్యం పెంచాలన్నారు. కాగా తమ కమిటీకి మంత్రి తలసాని సలహాదారునిగా ఉండాలని చర్చీల కమిటీ సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో కార్పొరేటర్ నామన శేషుకుమారి, అతెల్లి అరుణ గౌడ్, ఆకుల రూప, ఉప్పల తరుణి తదితరులు పాల్గొన్నారు.



బలవంతంగా బస్సుయాత్రకు జనాల తరలింపు

మన తెలంగాణ/ హైదరాబాద్ : కాంగ్రెస్ బస్సుయాత్రను ప్రజలు పట్టించుకోవడం లేదని, బలవంతంగా జనాలను బస్సు యాత్రకు తరలిస్తున్నారని టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి ప్రభుత్వ విప్ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. టిఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ బస్సు యాత్ర పాత కాలపు రాజకీయాలను తలపిస్తోందన్నారు. ఆ యాత్ర ఎలా జరుగుతుందో కాంగ్రెస్ ఇంఛార్జ్ కుంతియా , ఆ పార్టీ నేత డి.కె.అరుణలను అడిగితే తెలుస్తుందన్నారు.ఎన్నికల వచ్చే ముందే ప్రజల్లోకి రావడం కాంగ్రెస్ నేతలకు అలవాటు అని, అందుకే బస్సు యాత్ర పేరుతో తిరుగుతూ ప్రభుత్వంపై సంస్కారహీనమైన భాషలో దూషిస్తున్నారని అన్నారు. రౌడీ రాజకీయాలు చేయడంలో కాంగ్రెస్‌ది అందవేసిన చెయ్యి అని, అందుకే రైతు సమితులను రౌడీ సమన్వయ సమితిలంటూ మాట్లాడతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం రైతులకు రూ4వేల పంట పెట్టుబడి ఇచ్చి చేతులు దులుపుకోవడం లేదన్నారు. గత ఎన్నికల్లో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ చెప్పినా ప్రజలు నమ్మలేదన్నారు. గతం లో రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోని చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, నాలుగు గంటల విద్యుత్ కూడా ఇవ్వకుండా యువ రైతులను చంపిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు.

మహిళా దినోత్సవానికి నిధులు

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు



మన తెలంగాణ / హైదరాబాద్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ఉత్సవాలను నిర్వహించడానికి నిధులు విడుదల చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా దినోత్సవ ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో మంత్రి తుమ్మల అధ్యక్షతన ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం జరిగింది. వేడుకలకు వేదిక ఎక్కడ ఏర్పాటు చేయాలన్న అంశంతో పాటు గతేడాది వినియోగించిన లలితకళా తోరణాన్ని మరోమారు పరిశీలించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాలను రాత్రి 8 గం.ల లోపు ముగించాలని, వచ్చిన మహిళలందరికీ కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన మహిళామణులను గుర్తించే బాధ్యతను రమణాచారి, రసమయి బాలకిషన్ (ఎంఎల్ఎ), మామిడి హరిక్రిష్ణకు అప్పగించారు. మార్చి 2న ఈ ఉత్సవ కమిటీ మరో మారు భేటీ కానుంది. బేటి బచావో, బేటి పడావో కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి కేంద్రం నుంచి ప్రశంసలు పొందిన హైదరాబాద్ జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. ఈ సమీక్షా సమావేశంలో డా.కెవి రమణాచారి, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, మామిడి హరికృష్ణ, తెలుగు యూనివర్సిటి ప్రొఫెసర్ సువర్చల, సురభి వాణి, రేవతి, అఖిలేశ్వరి, సూర్య ధనంజయ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఇంటర్ పరీక్షలకు 20,844 మంది గైర్హాజరు

మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ప్రథమ సంవత్సరం పేపర్ –1 సెకండ్ లాంగ్వేజ్ (తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, అరబిక్, ఫ్రెంచ్, కన్నడ, మరాఠి) పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 4,82,360 మంది హాజరుకావాల్సి ఉండగా 4,61,516 మంది హాజరయ్యారు. 20,844(4.32 శాతం) మంది గైర్హాజరయ్యారని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఎ.అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సెట్ బి ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వికారాబాద్‌లో ఒకటి, కరీంనగర్‌లో ఒకటి, సూర్యాపేటలో ఒకటి, మొత్తం మూడు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్లు తెలిపారు.

రేపు యథాతదంగా పరీక్ష : మార్చి 2న జరుగనున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం లాంగ్వేజ్ పరీక్ష యథాతథంగా జరుగుతుందని బోర్డ్ స్పష్టం చేసింది. ద్వితీయ సంవత్సరం పరీక్షల టైం టేబుల్‌లో ఎలాంటి మార్పులు ఉండవని తెలిపింది.

కెసిఆర్‌ది ప్రచార ఆర్భాటమే : సిపిఐ



మన తెలంగాణ/హైదరాబాద్ : సిఎం కెసిఆర్ సింగరేణి పర్యటనలో ప్రచారార్భాటమే తప్ప సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కాదని స్పష్టమైందని, హామీల అమలు విషయంలో కెసిఆర్ వైఖరి 'ఏరు దాటిన తరువాత బోడ మల్లన్న' అనే చందంగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కాకపోతే త్వరలోనే కార్మిక ఉద్యమాలు ఎదురవ్వక తప్పదని హెచ్చరించారు. సింగరేణి ఎన్నికలలో కార్మికులకు ఇచ్చిన హామీలను సిఎం కెసిఆర్ తన సింగరేణి పర్యటన సందర్భంగా ప్రస్తావించకపోవడం దారుణమని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా వారసత్వ ఉద్యోగాల నియామకాలకు బదులుగా కారుణ్య ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, వాటి గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడంతో కార్మికులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. సొంత ఇళ్ళు కట్టిస్తామని, వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తామని సిఎం ఇచ్చిన పలు హామీలను మర్చిపోవడం దుర్మార్గమన్నారు. వేరే (అలియాస్) పేర్లతో పనిచేస్తున్న కార్మికులకు సొంత పేర్లుగా మార్పు చేస్తామని సింగరేణి గుర్తింపు ఎన్నికల సందర్భంగా కార్మికులు ఇచ్చిన మాట మరిచిపోయారన్నారు.

వేసవి జాగ్రత్తలపై యాక్షన్ ప్లాన్

మనతెలంగాణ/హైదరాబాద్: ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విపత్తు నిర్వహణ శాఖ కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ మేరకు చర్యలు తీసుకోవాల్సిందిగా స్పష్టం చేసింది. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులకు సూచనలు జారీ చేసింది. గత వేసవిలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం అవి పునరావృతం కాకుండా ముందుగానే వేసవి అక్షన్ ప్లాన్ (హీట్ వేవ్ అక్షన్ ప్లాన్) తయారు చేసుకోవాలని స్పష్టం ఆ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. జిల్లాల్లోని నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా ఈ యాక్షన్ ప్లాన్‌ను మార్గదర్శకాలకు అనుగుణంగా తయారు చేసుకోవాలని విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి చంద్రవదన్ ఆ సర్క్యులర్‌లో స్పష్టం చేశారు. వేసవిలో తీసుకోవాల్సిన ముందస్తు ఏర్పాట్లపై శనివారం ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించనున్నారు.

అన్ని సేవలకూ ఒకే యాప్

- 'టి యాప్ ఫోలియో'ను ఆవిష్కరించిన మంత్రి కెటిఆర్



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వ పథకాల ఫలాలు, వినియోగ సేవలు ప్రజలకు సత్వరం సులభతరంగా అందించడం కోసం 'ఇ గవర్నెన్స్'కు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పుడు మొబైల్ ఫోన్ల వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని వేర్వేరు యాప్‌ల ద్వారా అందుతున్న సేవలను 'టి యాప్ ఫోలియో' అనే కొత్త యాప్‌కి అనుసంధానించామని మంత్రి కెటిఆర్ తెలిపారు. ఒక్కో సేవకు ఒక్కో యాప్‌ను వినియోగించాల్సిన అవసరం లేకుండా ఒకే యాప్ ద్వారా అన్నింటినీ పొందేందుకు వీలుగానే ఈ కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. నూతన యాప్‌ను నగరంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెటిఆర్ ప్రసంగిస్తూ, జిహెచ్ఎంసి, ఆర్‌టిఎ, మీ సేవ, రేషన్ దుకాణాలు, ఫీజుల చెల్లింపు, విద్యుత్ నీటి బిల్లుల చెల్లింపులు... ఇలా ఒక్కో అవసరానికి ఒక్కో యాప్‌ను ప్రస్తుతం వాడుతున్నామని, ఇకపైన 'టి యాప్ ఫోలియో' ద్వారానే వీటన్నింటినీ వినియోగించుకోవచ్చునని తెలిపారు. అన్ని యాప్‌ల సమీకృతమే ఈ నూతన యాప్ అని, ప్రభుత్వం నుంచి పౌరులకు సేవలందించడమే కాకుండా వాణిజ్య సంస్థల నుంచి కూడా సేవలను ఈ యాప్ ద్వారా అందించే వీలు కలుగుతోందని తెలిపారు. తొలి దశలో ఈ ఒక్క యాప్‌లోనే 150 కంటే ఎక్కువ యాప్‌ల (సేవలు)ను అనుసంధానించామని, రానున్న ఏడాది కాలంలో మరికొన్నింటిని చేరుస్తామని తెలిపారు. 'ఎం గవర్నెన్స్' (మొబైల్ గవర్నెన్స్) ద్వారా పౌరులకు మెరుగైన సేవలందించడంలోతెలంగాణ రాష్ట్రం దేశంలోనే రెండవ స్థానంలో ఉందని తెలిపారు. డిజిటల్ లావాదేవీల్లో దేశంలోనే తొలి స్థానంలో ఉందని, రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి గతేడాది డిసెంబరు 31వ తేదీ వరకు జరిగిన డిజిటల్ లావాదేవీల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, ప్రతి వెయ్యి మంది వినియోగిస్తున్న లావాదేవీలు మరే రాష్ట్రంకంటే ఎక్కువగా ఉన్నట్లు కెటిఆర్ వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖల సేవలను ఈ నూతన యాప్‌కి అనుసంధానించామని, ఒకే పాస్‌వర్డ్‌తో అనేక సేవలను పొందే వీలు కలుగుతుందని తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్ ద్వారా పోలీసు శాఖను కూడా సంప్రదించవచ్చునని తెలిపారు. 'ఇ గవర్నెన్స్'కు తోడుగా ఇప్పుడు 'ఎం గవర్నెన్స్' రావడంతో పౌరులకు ఉత్తమ సేవలు సకాలంలో తక్కువ ఖర్చుతో లభ్యమవుతాయని తెలిపారు. ఈ నూతన యాప్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపి బూర నర్సయ్యగౌడ్, డిజిపి మహేందర్‌రెడ్డి, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, టిఎస్‌టిఎస్ ఎండి జిటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర కాదు కుర్చీల కొట్లాట

మన తెలంగాణ/హైదరాబాద్ : కాంగ్రెస్ నేతలది బస్సు యాత్ర కాదని, కుర్చీల కొట్లాట అని శాసనమండలి ప్రభుత్వ ఛీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి అన్నారు. బస్సు యాత్ర లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తర కుమారుడిలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. టిఆర్ఎస్ ఎల్‌పి కార్యాయంలో విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎంఎల్‌ఏలు చింతా మోహన్, భూపాల్‌రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం కెసిఆర్‌ను ఉద్దేశించి సీనియర్ నేత జైపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని ఖండించారు. సిపిఎస్ నుండి ఉద్యోగులకు వెసులబాటు కల్పిస్తామని, ముదిరాజ్‌లను బిసి–ఎలో చేరుస్తామని కాంగ్రెస్ నేతలు అనడం హాస్యాస్పదంగా ఉనదని, ఆ పార్టీ అధికారంలో ఉండగా ఆ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.వచ్చే ఎన్నికల్లో టిఆర్ఎస్‌కు 110 సీట్లు ఖాయమని, కాంగ్రెస్ ఇలాగే మాట్లాడితే ఒక్కసీటు కూడా రాదన్నారు. రైతులకు రూ.4 వేల పెట్టుబడి ని ఉత్తమ్ ఓట్ల కొనుగోలు పథకం గా వర్ణించడం రైతులను అవమానించడమేనని విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. దీనిపై ఉత్తమ్ రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సమన్వయం లేని కమిషనర్లు

- మద్యం షాప్‌ల బంద్ నేపథ్యంలో.. పొంతనలేని ముగ్గురి నోటిఫికేషన్‌లు



మన తెలంగాణ/హైదరాబాద్: నేరాల నివారణ, నేరస్తుల కట్టడి విషయంలో దేశ వ్యాప్తంగా ఠాణాలు సమన్వయంతో పనిచేస్తుండగా..హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు మధ్య సమన్వయం లేకుండా పోయింది. హోళి పండుగ సందర్భంగా మద్యం దుకాణాల బంద్‌పై ముగ్గురు కమిషనర్లు వి.వి.శ్రీనివాస్‌రావు, సందీప్‌శాండిల్యా, మహేష్ భగవత్‌లు మంగళవారం వేరు వేరుగా నోటిఫికేషన్లు జారీ చేయడమే ఇందుకు కారణం. ఈ మూడు కమిషనర్ల పరిధి ఒకదానికి ఒకటి ఆనుకుని ఉంటుంది. ఈ నేపథ్యంలో ముగ్గురి నోటిఫికేషన్‌లు కూడా ఒకే పద్ధతిలో ఉంటే ఇబ్బందులు రావు. వారు జారీ చేసిన నోటిఫికేషన్‌లు పరస్పర విరుద్ధంగా ఉండడంతో మద్యం దుకాణాల బంద్‌పై జారీ చేసిన ఉత్వర్వులు నవ్వులపాలవుతుంది. హైదరాబాద్‌లో బుధవారం సాయంత్రం ఆరు గంటల నుంచి శుక్రవారం ఉదయం 11 గంటల వరకు మద్యం షాప్‌లు బంద్ అని రాచకొండ పోలీసు కమిషనర్ మహేష్ భగవత్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దానికి ఆనుకుని ఉన్న హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మాత్రం శుక్రవారం ఉదయం ఆరు గంటల వరకే మద్యం షాప్‌లు బంద్ అంటూ కమిషనర్ వి.వి.శ్రీనివాస్‌రావు జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. అంటే శుక్రవారం ఉదయం ఆరు గంటల తరువాత హైదరాబాద్‌లో వైన్‌షాప్‌లు తెరుస్తారు. ఇదే సమయంలో పక్కనే ఉన్న రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో మాత్రం షాప్‌లు మూసి వేసి ఉంటాయి. ఇక్కడ శుక్రవారం ఉదయం 11 గంటల తరువాత షాప్‌లు తెరుస్తారు. ఇద్దరి మధ్య ఉత్తర్వుల ప్రకారం నాలుగు గంటల తేడాతో మద్యం షాప్‌లు తెరుస్తారు. ఇక సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ విషయానికి వస్తే బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం ఉదయం 11 గంటల వరకు మద్యం షాప్‌లు మూసివేయాలంటూ ఆంక్షలు విధించారు. ఈ లెక్కన సైబరాబాద్‌కు ఆనుకుని ఉన్న హైదరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లలో మాత్రం సైబరాబాద్ కంటే ఒక రోజు ముందుగానే మద్యం షాప్‌లు తెరుస్తున్నారు. ఈ రెండు కమిషనరేట్లలో శుక్రవారం ఉదయం వరకు ఆంక్షలు ఉండగా సైబరాబాద్‌లో మాత్రం శనివారం వరకు ఆంక్షలు ఉన్నాయి. హోళీ పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మూడు కమిషనరేట్లు ఒకదానికొకటి ఆనుకుని ఉండడంతో ఆంక్షలు కూడా ఇంచుమించు ఒకే పద్ధతిలో ఉంటే పోలీసుల లక్ష్యం నెరవేరుతుంది. అయితే ఈ మూడు పోలీసు కమిషనరేట్లలో మద్యం అమ్మకాలపై విధించిన ఆంక్షలు సమయపాలన వేరు వేరుగా ఉండడంతో పోలీసుల లక్ష్యం నీరుగారుతుంది. పక్క పక్క జిల్లాలు, కమిషనరేట్ల పోలీసులు సమన్వయంతో పనిచేయాలని డిజిపి మహేందర్‌రెడ్డి పదే పదే చెబుతున్నా ఈ ముగ్గురు కమిషనర్లు మాత్రం సమన్వయం చేసుకోవడంతో విఫలం చెందుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఉత్తర్వులు జారీ చేసే సమయంలో సమన్వయం చేసుకుని ఉత్తర్వులు జారీ చేస్తే లక్ష్యాలు నెరవేరుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అన్నమే..అయినా భిన్నం

- తిండికి ఒక్కో జిల్లాలో ఒక్కో తీరుగా ఖర్చు
- అధికంగా మాంసం, మసాలాల వినియోగం
- నార్మ్, జయశంకర్ వర్శిటీ సర్వేలో వెల్లడి



మన తెలంగాణ/హైదరాబాద్ : కోటి తిప్పలు పొట్టకూటి కోసమే... మన రాష్ట్రంలో ఎన్ని తిప్పలు పడుతున్నారో తెలీదు కానీ ప్రతీనెలా ఒక్కొక్కరు నెలకు రూ. 2156 తిండి కోసమే ఖర్చు చేస్తున్నారు. అంటే సగటున మన ప్రజలు రోజుకు రూ.70 ఖర్చు అవుతోంది. ఇక హైదరాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఈ ఖర్చు మరింత అధికంగా ఉంది. మంచిర్యాల్ జిల్లాకు వచ్చేసరికి తగ్గింది. ఇంత మొత్తం ఊరికే అవుతుందా.. శాఖహారంతో పోలిస్తే మన రాష్ట్ర ప్రధాన ఆహారమైన అన్నం (బియ్యం)కు తోడుగా అధిక ధరలు ఉండే మాంసం, మసాలలు మనవాళ్లు మంచిగనే తింటున్నారు. ఇదంతా ఎవరో చెప్పింది కాదు.. రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆహార పదార్థాల వినియోగం, వాటిపై చేస్తున్న ఖర్చుపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐకార్ జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ అకాడమీ (నార్మ్) కలిసి నిర్వహించిన సర్వేలో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలో ఏ జిల్లాలో ఎక్కువగా ఏమి తింటున్నారో వాటికి అనుగుణంగా అక్కడే ఆ పంటలు పండించేలా పంట కాలనీలు ఏర్పాటు చేసేలా రైతులను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేయించింది. నెలవారీగా ఒక్కొక్క జిల్లాల్లో, ఒక్కొక్కరు (తలసరిగా) ఏ ఆహారం ఎంత మోతాదులో తీసుకుంటూన్నారనే వివరాలను సర్వేలో సేకరించారు. దీని ప్రకారం మన ప్రధాన ఆహారం అన్నం (బియ్యం) ఉంది. గోధుమ, తృణధాన్యాలు, బియ్యం వంటివి కలిపి నెలకు తలసరిగా 12.5 కిలోలు తింటున్నారు. ఇందు లో అత్యధికంగా నాగర్‌కర్నూల్ , యదాద్రి జిల్లాల్లో 17.5 కిలోలుగా ఉంది. అలాగే మెదక్, మంచిర్యాల్ పట్టణ ప్రాంతాల్లో తలసరిగా 11 కిలోల వినియోగం ఉంది. గోధుమలను 180 సగటున 180 గ్రాములు మాత్రమే తీసుకుంటుండగా, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న ఆదిలాబాద్‌లో అరకిలో పైనే గోధుమల వినియోగం ఉంది. ఆహారానికి ఖర్చు చేసే రూ.2156లో 19 శాతం బియ్యం (అన్నం) కోసమే చేస్తున్నారు. రాష్ట్రంలో నూనె వాడకం తలసరి సగటు 1.22 లీటర్లుగా ఉంది. ఇందులో అత్యధికంగా సన్‌ప్లవర్‌నే వాడుతున్నారు.

మాంసంలో భూపాలపల్లి టాప్



ఇక మాంసం విషయానికోస్తే రాష్ట్ర తలసరి వినియోగం నెలకి 1.38 కిలో గ్రాములుగా ఉంది. అత్యధికంగా భూపాల పల్లిలో 2 కిలోల మాంసం తింటున్నారు. అలాగే మాంసంలో అత్యధికంగా చికెన్40 శాతం తింటున్నారు. దీని రాష్ట్ర తలసరి వినియోగం నెలకి 550 గ్రాములుగా ఉండగా, భూపాల జిల్లాల్లో అత్యధికంగా ఒక్కరు 890 గ్రాములు తినడం గమనార్హం. ఇంట్లో అయినా హోటళ్లో అయినా ఉల్లిగడ్డ, టమాటల కాంబినేషన్ లేకుండా కూరనే ఉండటం లేదు. అందుకేనేమో రాష్ట్రంలో ఉల్లి, టమాటల వినియోగం అధికంగా ఉంది. దాని తరువాతి స్థానంలో ఆలుగడ్డ తీసుకుంది. రాష్ట్రంలో తలసరిగా నెలకు సగటున ఒక కిలోగ్రాము తింటు న్నా రు. ఆలుగడ్డ 510 గ్రాములు తీసుకుంటున్నారు. ఇక పండ్లు విషయాని కోస్తే అరటి పండ్లు సగటున నెలకు 5 తింటున్నారు. ఎక్కువగా నిర్మల్ జిల్లాలో 7 పండ్లు తింటుండగా వికారాబాద్‌లో మూడున్నర అరటి పండ్లు తింటున్నారు.

గణనీయంగా పాల ఉత్పత్తుల వినియోగం



సగటుతలసరి తిండి ఖర్చులో అన్నం తరువాత అధికంగా పాలు, పాల ఉత్పత్తులుకు 15%గా ఖర్చు చేస్తున్నట్లు సర్వేనివేదికలో పేర్కొన్నారు. నెలకి ఒక్కరు 4.6 లీటర్ల పాలు తాగుతున్నారు. గరిష్టంగా సిరిసిల్ల, ఖమ్మం జిల్లాల్లో వరుసగా 6. 27, 5.48లీటర్లు తాగుతున్నారు. అలాగే పాల ఉత్పత్తులైన పెరుగు, మజ్జిగ, నెయ్యి లాంటివి గణనీయంగా వినియోగిస్తున్నారు. రాష్ట్రంలో తలసరిగా నెలకు 750 గ్రాముల పెరుగు తీసుకుంటున్నారు. అలాగే సగటున 37 గ్రాములు నెయ్యి, 39 గ్రాములు వెన్న వాడుతున్నారు.

నిండుగా ఉప్పు.. తీపిగా పంచదార : రాష్ట్రంలో ఉప్పు వినియోగం గరిష్టస్థాయి లో ఉంది. జాతీయ స్థాయి తలసరి సగటు వినియోగం నెలకి 0.25 గ్రాములు కాగా రాష్ట్రంలో మాత్రం 0.64 గ్రాములుగా ఉంది. పంచదార, బెల్లం వినియోగం 890 గ్రాములుగా ఉంది.



హాట్ హాట్‌గా మసాలల వినియోగం

రాష్ట్రంలో మాంసం, మాసాలల వినియోగం అధికంగా ఉంది. మాసాలలు నెలకి తలసరిగా 635 గ్రాములు వినియోగస్తున్నారు. ఇందులో ఎండుకారం, అల్లం, చింతపండు సింహభాగంలో ఉన్నాయి. మసాల వినియోగం భద్రాద్రి జిల్లాల్లో అత్యధికంగా నెలకి 919 గ్రాములు కాగా, తక్కువగా మెదక్ జిల్లాల్లో 440 గ్రాములుగా ఉంది. ఇందులో చింతపండు రాష్ట్ర తలసరి వినియోగం 141 గ్రాములు ఉంది. రాష్ట్రస్థాయిలో అల్లం, ఎండుకారం తలసరి సగటు వరుసగా 146 గ్రాములు, 96 గ్రాములుగా ఉంది. ఇందులో ఎండుకారం పెద్దపల్లిలో అత్యధికంగా నెలకి 215 గ్రాములు వినియోగం ఉంది. వెల్లుల్లి రాష్ట్రవాప్త తలసరి సగటు 85 గ్రాములు కాగా, జిలకర్ర సగటున 30 నుంచి 50 గ్రాములు తీసుకుంటున్నారు.

పప్పుల సగటు వినియోగం 1.75 కిలోలు : పప్పు టమాట, పప్పుచారు, మునుగకాయ పప్పు.. ఇలా ఏ పప్పు అయితేనేం రాష్ట్రంలో సగటున నెలకు తలసరి వినియోగం 1.75 కిలోలుగా ఉంది. ఇందులో కంది పప్పు గరిష్టంగా 41 శాతం తింటున్నారు. ఆ తరువాతి స్థానంలో మినపప్పు, పెసర్లు ఉన్నాయి. కొమురం భీం జిల్లాల్లో అధికంగా నెలకు 700 గ్రాములు తీసకుంటుండగా, జోగులాంబలో 170 గ్రాములుగా ఉంది.

'చిరు' పౌష్టికాహారం : చిరుధాన్యాల్లో జొన్నలను వివిధ రూపాల్లో తలసరి సగటున 500 గ్రాములు తీసుకుంటున్నారు. తరువాత స్థానంలో మొక్క జొన్న80, రాగి 70, సజ్జలు 20 గ్రాములు తింటున్నారు.

కుంచెపోటు




మున్సిపాలిటీలుగా 127 గ్రామపంచాయతీలు

- మరి కొన్నింటి విషయంలో వీడని చిక్కుముడులు
- కొత్త జిల్లాల వారీగా జాబితా తయారు
- నిర్ణయం తీసుకోవడంలో మరింత జాప్యం



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో 127 గ్రామ పంచాయతీలు కొత్తగా మున్సిపాల్టీలుగా మారనున్నాయి. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల మేరకు వీటిని మున్సిపాల్టీలుగా అధికారులు ప్రతిపాదించారు. 15 వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామ పంచాయతీలను మున్సిపాల్టీలుగా మార్చాలని నిర్ణయించిన ప్రభుత్వం కొత్త జిల్లాలవారీగా జాబితాను సమర్పించాలని ఆదేశాలు జారీచేసింది. 2011జనాభా లెక్కల వివరాలను ప్రామాణికంగా తీసుకుని మున్సిపాల్టీలుగా మారే పంచాయతీల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. చుట్టుపక్కల గ్రామాలను లేదా చిన్న గ్రామ పంచాయతీలను కలిపి మేజర్ గ్రామపంచాయతీలను లేదా నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చే ప్రతిపాదన విషయంలో కొన్ని పంచాయతీల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనందున ఇంకా కొలిక్కి రాలేదు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని 167 గ్రామాలను వాటి సమీప మేజర్, నగర పంచాయతీల్లో విలీనం చేసి వాటిని మున్సిపాల్టీలుగా మార్చాలని ప్రభుత్వం కచ్చితమైన సూచనలు చేసినప్పటికి స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి అభ్యంతరాలు ఇంకా వ్యక్తమవుతూనే ఉన్నట్లు తెలిసింది. అందువల్ల నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. అభ్యంతరాలు లేని 127 మేజర్ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చే జాబితాను మాత్రం అధికారులు సిద్ధం చేశారు. ఆ ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో 5, భద్రాద్రి కొత్తగూడెంలో 12, జగిత్యాలలో 4, జనగాంలో ఒకటి, జయశంకర్ భూపాలపల్లిలో 4, జోగులాంబ గద్వాలలో 3, కామారెడ్డి జిల్లాలో 7 మేజర్ గ్రామ పంచాయతీలను కొత్త మున్సిపాల్టీల జాబితాలో చేర్చారు. కరీంనగర్ జిల్లాలో 2, ఖమ్మం 3, కొమురంభీం ఆసిఫాబాద్2, మహబూబాబాద్‌లో 3, మహబూబ్‌నగర్‌లో 5, మంచిర్యాలలో 7, మెదక్‌లో 3 మేజర్ గ్రామపంచాయతీలు మున్సిపాల్టీల ప్రతిపాదిత జాబితాలో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 11, నల్గొం డ 7, నిర్మల్ లో 2, నిజామాబాద్‌లో 10, పెద్దపల్లిలో 3, రాజన్న సిరిసిల్లలో 2 మేజర్ గ్రామపంచాయతీలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 5, సంగారెడ్డిలో 9, సిద్దిపేటలోఒకటి, సూర్యాపేటలో 3, వికారాబాద్‌లో 2, వనపర్తిలో 4, వరంగల్ అర్బన్‌లో ఒకటి, యాదాద్రి భువనగిరి జిల్లాలో 6 మేజర్ గ్రామపంచాయతీలను మున్సిపాల్టీలుగా ఎంపిక చేసే జాబితాలో చేర్చారు. వరంగల్ రూరల్, నాగర్ కర్నూల్ జిల్లాల నుంచి ఒక్క పంచాయతీకి కూడా ఈ జాబితాలో చోటు దక్కలేదు.



“ఈ ప్రపంచంలో ద్వేషాన్ని ద్వేషం ద్వారా నిర్మూలించలేం. ప్రేమద్వారా మాత్రమే దాని పరిమార్చగలం.
— గౌతమబుద్ధుడు”

సంపాదకీయం

చలనచిత్ర ధ్రువతార

మొత్తం దేశాన్ని శోకభాండం చేసి కంటతడిపెట్టించిన ఘట్టం — అతిలోక సుందరి, అందరి నటి శ్రీదేవి అకాల హఠాన్మరణం. బాలనటిగా మొదలై ఆబాలగోపాలనటిగా ఆమె సాధించింది ఎంతటి అనితరమైనదో చెప్పనక్కర లేదు. దేవకన్యల నెవరూ ఇంతవరకూ చూసిన జాడ లేదు గానీ వారు ఉంటే సరిగ్గా ఇలాగే ఉంటారని నిరూపించారామె. గత నాలుగు రోజులూ తెలుగు టివి ఛానళ్లు అదేపనిగా అనునిత్యం ఆమెను ముఖానికి అతికించుకున్నాయంటే చనిపోయి కూడా వాటి ప్రేక్షకాకర్షణ ఖాతాలను ఆమె పొంగి పొర్లించారంటే జన హృదయాలలో ఆమె పదిలపరచుకున్న చోటు ఎంతటిదో అవగతమవుతున్నది.

సినిమా అంటేనే ఒక పోటీలేని హృదయోల్లాసరంగం. మనస్సును పట్టి లాగి సకల రసరమ్య లోకాల్లో తేలియాడించే చలన సంచలన రంగస్థలం. దానిని ఎదురులేని రీతిలో ఏలిన మహారాణి శ్రీదేవి. ప్రేక్షక లోకాన్ని తన చీర చెంగున కట్టుకుని స్వప్నసీమలలో విహరింపచేశారామె. వసంత కోకిల ఎగిరి ఎటకో వెళ్లిపోయింది గాని తన కుహూరవం మాత్రం ప్రతి ఒక్క హృదయ కుహరం లోనూ శాశ్వత నివాసమేర్పరచుకున్నది.

54 ఏళ్ల జీవితంలోనూ కేవలం తొలి నాలుగేళ్లే ఆమె తన సొంత జీవితం జీవించింది. మిగతాదంతా తెరకే అంకితం చేసి క్షణక్షణం జనం గుండెవీణలు మీటింది.

దుబాయ్ హోటల్ గదిలో ఆమె హఠాన్మరణానికి దారితీసిన కారణాలపై ఎడతెగని దర్యాప్తు వల్లగాని, అక్కడి చట్టాలలోని సంక్లిష్టత వల్లగాని ఆమె భౌతిక కాయాన్ని తీసుకు రావడానికి జరిగిన అసాధారణ జాప్యం కూడా ఆమె అభిమానులను కొంచెమైనా విసుగెత్తించలేదు. రెప్పవాల్చకుండా అశేష అభిమాన కోటానుకోటి ఎదురుచూసిన తీరు ప్రత్యేకించి గమనించదగినది. బుధవారంనాడు ముంబయిలో ఆమె అంతిమ యాత్ర ఏడు కిలో మీటర్ల నిడివిన సాగడమూ అసమానమే, అపూర్వమే. ప్రఖ్యాత అమెరికన్ గాయని వైట్నీ హూస్టన్ కూడా 2012, ఫిబ్రవరి 11న తన 48వ ఏట బెవర్లీ హిల్స్‌లోని హోటల్ స్నానాల తొట్టెలో ప్రమాద వశాత్తు పడి చనిపోయిందని బాలీవుడ్ సీనియర్‌నటి సిమీ గరేవాల్ ట్వీట్ చేశారు. అరుదైన పోలిక. కానీ శ్రీదేవి అరుదుల్లో అరుదైన సినీ సరసిజ. ప్రత్యేకించి తెలుగువారు గర్వించదగిన నటి. మన తిరుపతి బిడ్డ. తెలుగు, హిందీ తదితర భాషల చలన చిత్ర వినీలాకాశాలలో ఎప్పటికీ ప్రజ్వలించే ధ్రువతార.

బయటి ప్రపంచ, నిజ జీవిత వాస్తవాలనుంచి సుదూర లోకాలకు తీసుకుపోయి వింత అనుభూతులు కలిగించి, కవ్వించి, నవ్వించి, ఏడిపించి, ఈడ్చి ఈడ్చి కొట్టి, కట్టిపడేసేదే సినిమా. అదో ఐంద్రజాలిక మాధ్యమం. దానిమీద తటిల్లతలా మరీమరీ మళ్లీ మళ్లీ మెరిసి ఏ మందూ తీసుకోనవసరం లేకుండానే మత్తెక్కించి, మతిపోగొట్టిన నటి దూరమైందనే కాదు, అకస్మాత్తుగా ఇలా ఈ రీతిలో అంతర్ధానమైందేమిటా అనేదే అందరినీ వేధించే బాధ. ‘అంగులీయకం మరిచిపోయి భూలోకంలో ఉండిపోయిన దేవకన్య’గా కలకాలం అజరామరంగా ప్రేక్షక జన మనోనేత్రాలలో ఆమె నిలిచిపోతుంది.

శ్రీదేవి అంతటి నటి మరణిస్తే ఆమె భౌతిక కాయం దుబాయి నుంచి ముంబయికి రావడానికి మూడున్నర రోజులు పట్టడం ఈ ఆధునిక కాలంలో అత్యంత బాధ కలిగించే అంశం. అక్కడి చట్టాలు ఎంతటి క్లిష్టమైనవైనా, మరెంతటి దీర్ఘ ప్రక్రియతో కూడుకున్నవైనా గతించిన ఒక ప్రముఖ నటి దేహం స్వదేశానికి చేరుకోవడానికి ఇంతకాలం పట్టడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. గల్ఫ్ దేశాలకు పొట్టచేతపట్టుకుని వెళ్లి అక్కడ సరైన ఉపాధులు దొరకక ఏజంట్ల మోసాలకి గురయిపోయి తిరిగి ఇక్కడికి చేరుకోవడానికి అవసరమైన ఛార్జీ డబ్బులు చేతిలో లేక అక్కడే ఆత్మహత్యలకు పాల్పడుతున్న మన నిరుపేద శ్రామికులు, కార్మికులు ఎంతోమంది ఉన్నారు. వారి దయనీయ గాథలు అనుదినం వార్తలలో వస్తూనే ఉన్నాయి. అక్కడి మార్చురీలలో అటువంటి వారి భౌతిక కాయాలు రోజులు, నెలల తరబడి పడి ఉంటున్న సందర్భాలు ఉన్నాయి. మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టిని సారించి అటువంటి వారి పార్థివ దేహాలను మరణించిన వెంటనే రప్పించే మార్గాలను అన్వేషించి అమలులోకి వచ్చేలా చూడాలి. దూరాలు తరిగిపోయి, కరిగిపోయి ప్రపంచం కుగ్రామమయిపోయిందని జబ్బలు చరుచుకోవడం నిష్ప్రయోజకం మరణానంతరం భౌతిక కాయాలకు కూడా సత్వర విమోచన లభించకపోవడంలోని విషాదం అంతా ఇంతా కాదు.


బ్యాంకు మోసాల ఊబిలో బిజెపి

చూపు

నీరవ్ మోడీ బ్యాంక్ కుంభకోణం వంటివి కేంద్రంలో అధికారంలో గల భారతీయ జనతాపార్టీ(బిజెపి)ని ప్రస్తుతం ఉద్యోగ కల్పనలో వైఫల్యం, కుల–మత పరమైన హింసాకాండ వంటి సమస్యలను మించి తీవ్ర ఆందోళనలకు గురిచేస్తున్నాయి. కుల, మత, వర్గ వైషమ్యాలను అధిగమించి ఎన్నికలలో నెగ్గుకు రావాలంటే అవినీతి ఉదంతాలపై ప్రచారాలే ఉపయోగపడతాయని దేశంలోని రాజకీయ నాయకులు ప్రస్తుతం గాఢంగా నమ్ముతున్నారు. అందుచేతనే వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, అతని మేనమామ చోక్సీలకు అక్రమంగా రుణాలిచ్చింది మీరంటే మీరని కాంగ్రెస్, బిజెపిలు రెండూ ఒకదానిపై ఒకటి ఆరోపణలు చేసుకుంటున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) నుండి రూ.11,400 కోట్ల రూపాయల రుణాలను పొందిన నీరవ్ ఆ బకాయిలను ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయాడు. అంతకుముందు విజయ్‌మాల్యా, దానికంటే ముందు లలిత్ మోడీ కూడా బ్యాంకులను మోసగించి ఎన్‌డిఎ హయాంలోనే దేశం వీడి పరారవడంతో ప్రస్తుతం అవినీతి నింద బిజెపి ఎక్కువగా మోస్తోంది. అయితే కాంగ్రెస్‌ను కూడా రచ్చకీడ్చటానికి అది రుణాలు ఎవరి హయాంలో ఇవ్వడం మొదలైందన్నది ప్రత్యర్థిపై ప్రచారాస్త్రం చేయదలచింది. ఎవరి హయాంలో మోసగాళ్లు అత్యంత సులభంగా విదేశాలకు పలాయనం చిత్తగించారన్నది అసలు విషయమని కాంగ్రెస్ అంటోంది. అధికారంలో ఉన్న ఏ పార్టీ ప్రతిష్ఠనైనా కుంభకోణాలు చెదిరిగొట్టినట్లుగా ఇంకేవీ చేయలేవు.

రైతుల ఆత్మహత్యలు, పట్టణ ప్రాంతాల్లో దిగజారుతున్న పరిస్థితులు తదితర సమస్యలేవీ ఆ సమస్యపై ప్రచారం చేసినంత హానిని అధికార పార్టీకి చేయలేవు. 1987లో బోఫోర్స్ కుంభకోణం చోటు చేసుకున్నప్పుడు దేశంలోని రాజకీయ వర్గాలు ‘అవినీతి’ అనే పదం రాజకీయ విలువ ఎంతో మొదటిసారి తెలుసుకున్నాయి. భారతీయ సైన్యానికి హొవిడ్జర్ తుపాకుల కొనుగోలులో కమిషన్‌లు ముట్టచెప్పారన్న కుంభకోణం అది. దాని ప్రచార ప్రభావంతో రాజీవ్ గాంధీ 1989 లోక్‌సభ ఎన్నికలలో అధికారాన్ని కోల్పోవలసి వచ్చింది. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ బలం ఐదేళ్ల ముందునాటి 404సీట్ల నుండి 197కు పడిపోయింది. అప్పుడే తొలిసారిగా అవినీతి మంత్రం కేంద్రంలో ప్రభుత్వాన్ని మార్చగలదని రాజకీయ వర్గాలలో కొత్త గ్రహింపు కలిగింది. అప్పటినుండి ‘అవినీతి’ ఆరోపణ బలం స్పష్టంగా పుంజుకోవడం మొదలైంది. తరువాత మండల్–మందిర్ రాజకీయాలు ముదిరి సామాజిక పరిస్థితులు మారి, కొత్తగా ప్రాంతీయ పార్టీల హవా బలపడుతూ వచ్చింది.

ఎన్నికలలో మెజారిటీ సాధించాలంటే ఓటర్లు వర్గాలు, కులాలు, మతాల వారీగా చీలిపోయి ఉన్న సమయంలో ‘అవినీతి’పై యుద్ధం వాగ్దానమే బాగా కలిసి వస్తుందని అప్పటినుండి రాజకీయ వర్గాల బుర్రల్లో నాటుకుంది. 1991లో అవినీతి ఆరోపణల ద్వారా అధికారంలోఉన్న పార్టీని కూల్చే ఒక నిఖార్సయిన మార్గం ఖరారైంది. ఆ ఆరోపణలో కోర్టు విచారణల్లో నిరూపణ అయ్యాయా లేదా అన్నది ఇక్కడ సంబంధం లేని విషయం. ఓటర్ల మనస్సుల్లోకి అవినీతి ఆరోపణలతో అధికారపార్టీపై ద్వేషబీజాలు ఎంత బలంగా నాటాం అన్న దానికే ఇక్కడ ప్రాముఖ్యం. రాజకీయ నాయకులతో కుంభకోణాల మోసగాళ్లకు సంబంధాలున్నాయని ఆరోపిస్తూ ప్రచారాలు చేయడం చాలా ముఖ్యం. ఇటీవల దావోస్‌లో నరేంద్రమోడీ సంపన్నదేశాల వ్యాపార సామ్రాట్‌లతో జరిపిన చర్చలలో నీరవ్ మోడీ కూడా పాల్గొన్నారన్న విషయానికి ఎంతో ప్రాముఖ్యత ఈ ఆరోపణల పర్వం కల్పించింది. ఈ వ్యవహారంలో ఆరోపణ చేసిన వారిదే పైచేయి అయింది కూడా. ఒక విడియోలో ప్రధాని మోడీ నీరవ్ మేనమామ జోక్సీని పేరుపెట్టి పిలిచారు. ఆ విడియో కూడా విశేష ప్రాచుర్యం పొందింది.



అదే దారిలో బిజెపి కూడా ఈ కుంభకోణం విషయంలో కాంగ్రెస్‌పై ఆరోపణల యుద్ధాన్ని ప్రారంభించింది. 2013లో నీరవ్ మోడీ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హాజరయ్యారన్నది ఆ ఆరోపణ. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అభిషేక్ సింఘ్వీ భార్య, కుమారుడు ఆ నగల వర్తకుని కార్యాలయానికి వాటాను అద్దెకిచ్చిన కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యులన్నది కూడా ఆరోపణ సారాంశం. పిఎన్‌బి కుంభకోణం బయటపడ్డాక రెండు పార్టీలు ఒకదానినొకటి అవినీతి మయం అని ఆరోపించుకుంటున్నాయి. సామాజిక శాస్త్రవేత్తలు రెండు రకాల లంచాల గురించి చెబుతారు. వేధించే లంచాలు, వేధించనివి అని రెండు రకాలున్నట్లు వారు విశ్లేషిస్తారు.

మొదటి లంచం ప్రజలు ప్రభుత్వంనుంచి సేవలు పొందడానికి చెల్లించేవి కాగా అధికార పార్టీపై వచ్చే ఆరోపణలన్నీ సాధారణంగా వేధింపు కనపడని కేసులవే. నీరవ్ మోడీ–చోక్సీ విషయంలో ఒక ప్రభుత్వ బ్యాంకునుంచి అనేకవేల కోట్ల రూపాయల రుణాలను తీసుకొని ఎగ్గొట్టారన్నది ముఖ్య ఆరోపణ. ఈ అవినీతి సాధారణ ప్రజలు అనుదినం ఎదుర్కొనే రకానిది కాదు. అయినప్పటికీ ప్రజలు ఇటువంటి భారీ కుంభకోణాలపట్ల ఆగ్రహంతో ప్రతిస్పందిస్తారు. ఎందుకంటే ఆ కుంభకోణాల్లో తమ రోజువారీ లంచాల పీడ వారికి గోచరిస్తుంది. ‘ఐపెయిడ్ బ్రైబ్ డాట్ కామ్’ అనే వెబ్‌సైట్ తమ రోజువారీ జీవితంలో ఎలా అధికారులకు లంచాలు ఇచ్చారో సవివరంగా తెలపవచ్చని సాధారణ పౌరులను ఆహ్వానించింది. 2010, ఆగస్టు 15 నుంచి ఈ వెబ్‌సైట్‌కు రూ.2,867.51కోట్లకు సంబంధించిన 1,54,058 లంచాల రిపోర్టులు వచ్చాయి. ఈ లంచాల ఆరోపణల నిజానిజాలు న్యాయస్థానాల్లో తేలడానికి ఏళ్లూపూళ్లూ పడుతుందని ప్రజలకు బాగా ఎరికే. అందుచేత న్యాయవ్యవస్థ పాత్రను ప్రజలే ఇటువంటి సందర్భాల్లో పోషిస్తారు.

2014లో యుపిఎ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేయడం ద్వారానే ప్రస్తుత ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చారు. యుపిఎ హయాం చివరి రెండేళ్లలో జరిగిన అనేక కుంభకోణాలతో విసిగెత్తిపోయిన జనం అవినీతి రహిత పాలన అందిస్తానన్న మోడీ మాటలను నిజంగా నమ్మి ప్రజలు అధికారం అప్పగించారు.. అయితే ఇప్పుడు గత మూడేళ్లుగా లలిత్ మోడీ నుంచి నీరవ్–చోక్సీ దాకా అనేక కుంభకోణాలు బయటపడడంతో మోడీ పాలనపైనే ప్రజాగ్రహం గురిపెట్టే పరిస్థితి వచ్చింది. గతంలో కాంగ్రెస్ పేర్కొన్నట్లుగానే ఇప్పుడు మోడీ, ఆయన పార్టీ ప్రజాకోర్టు విచారణను ఎదుర్కోవలసి ఉంది. ప్రజాధనంతో నిండే ఖజానాకు కాపలాదారుగా ఉంటానన్న మోడీ హామీ ఏమైందని ప్రజలు నిలదీసే సందర్భం వచ్చింది. నీరవ్–చోక్సీ ఆస్తులనుంచి ప్రభుత్వ ఖజానాకు పిఎన్‌బి కుంభకోణం ద్వారా కలిగిన నష్టాన్ని రాబట్టాలన్నది ప్రజల డిమాండ్. ఈ డిమాండ్ వేడిని ఎదుర్కొంటున్నది మాత్రం మోడీ ప్రభుత్వమే.

— అజాద్ అష్రఫ్

కమల్ పార్టీ హసిస్తుందా?



వాహెద్ అబ్దుల్
7093788843

కమల్ హాసన్ రాజకీయ ప్రవేశం ఫిబ్రవరి 19న చాలా నాటకీయంగా జరిగింది. తమిళ రాజకీయాల్లో సినిమా నటుల ప్రభావం చాలా ఎక్కువ. తమిళనాడును తిరుగులేకుండా శాసించిన ఎం.జి.రామచంద్రన్ వంటి నాయకుడితో అప్పుడే కమల్ హాసన్‌ను పోల్చడం తొందరపాటే అవుతుంది. కాని కమల హాసన్ రాజకీయ ప్రవేశం, పార్టీకి పెట్టిన పేరు ఇవన్నీ చూస్తుం టే తమిళ రాజకీయ సమీకరణాలు త్వరలో కుదుపులకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కమల హాసన్ తన పార్టీకి పెట్టిన పేరు ‘‘మక్కల్ నీది మయం’’. ప్రజాన్యాయ కేంద్రం అని దీనికి అనువాదం చెప్పుకోవచ్చు. ఈ పార్టీ పేరులో ‘‘న్యాయం’’, ‘‘కేంద్రం’’ అన్న పదాలు గమనించదగ్గవి. శతాబ్దం క్రితం మద్రాసు రాష్ట్రం ఉండేది. అప్పట్లో జస్టిస్ పార్టీ ఏర్పాటుకు వేదిక మద్రాసే. సౌత్ ఇండియన్ లిబరల్ ఫెడరేషన్ లేదా జస్టిస్ పార్టీ ఆ తర్వాత పెరియార్ ఇ.వి.రామస్వామి నాయకత్వంలో ద్రవిడ కజగంగా మారింది. ద్రావిడ మున్నేట్ర కజగానికి మాతృసంస్థ ఇది. ద్రవిడ రాజకీయాలకు పునాదులేసి న సంస్థ.

ఈ ద్రవిడ రాజకీయాలనే ఇప్పుడు కమలహాసన్ ముందుకు తీసుకెళుతున్నట్లు కనబడుతోంది. అయితే తన సెంట్రిస్ట్, ఉదారవాద వైఖరిని కూడా స్పష్టంగా ప్రకటించడానికే పార్టీ పేరు అలా పెట్టారు. మధురైలో ఈ పార్టీని ప్రారంభించడం కూడా గమనించదగిన విషయం. మధురై తమిళ సంస్కృతికి కేంద్రం, జల్లికట్టుకు వేదిక ఇదే. అంతేకాదు తీవార్ కులం అధికంగా ఉంటున్న ప్రాంతం.

కమల హాసన్ పార్టీ లోగో కూడా గమనించదగింది. ఆరు చేతులు ఒక వలయంగా పట్టుకున్న బొమ్మలో మధ్యన నక్షత్రం. ఈ ఆరు చేతులు దక్షణాది రాష్ట్రాలు పుదుచ్చేరితో సహా కలుపుకుని. ఆ విషయాన్ని ఆయనే చెప్పారు. కమల హాసన్ ద్రవిడ రాజకీయాలతో కాని, ద్రవిడ సిద్ధాంతాలతో కాని తన సాన్నిహిత్యాన్ని ఇంతకు ముందెన్నడూ బాహాటంగా ప్రకటించి ఉండలేదు. కాని ఈ పార్టీ లోగోను పరిశీలిస్తే ఇంతకన్నా బాహాటంగా ద్రవిడ నాడును ప్రకటించడం మరేముంటుంది.

తమిళనాడులో రాజకీయాల వైపు చూస్తున్న మరో సూపర్ స్టార్ రజనీకాంత్. కాని వీరిద్దరి మధ్య స్పష్టమైన తేడా కనబడుతుంది. కమల హాసన్ తన రాజకీయ సిద్ధాంతాన్ని, రాజకీయ ఆలోచనలను స్పష్టంగా ప్రకటించాడు. రజనీకాంత్ ఇంకా పరిశీలనలోనే ఉన్నాడు. ఈ ఇద్దరిలో ఎవరో ఒకరికి మాత్రమే తమిళ ప్రజలు రాజకీయంగా అవకాశమిస్తారు. ఎవరు నిలబడతారన్నది కాలమే చెప్పాలి. కమల హాసన్ స్పష్టంగా వామపక్ష, ఉదారవాద మార్గం తనదని స్పష్టంగా ప్రకటిస్తుంటే, రజనీకాంత్ ఆధ్యాత్మికతను ఆధారం చేసుకోవాలనుకుంటున్నారు. ఈ ఇద్దరు నటులు ద్రవిడ రాజకీయాల్లో ప్రత్యామ్నాయాలను ప్రజల ముందుంచాలని ప్రయత్నిస్తున్నారు. రజనీకాంత్ బిజెపికి సన్నిహితంగా ఉంటున్నారన్నది కూడా తమిళ ప్రజలు గమనిస్తున్నారు. ఉత్తరాది పార్టీల పట్ల తమిళ ప్రజల్లో సాధారణంగానే కాస్త వ్యతిరేకత ఉంటుంది.

సైద్ధాంతికంగా న్యూట్రల్, ఉదారవాద విధానాలకు కట్టుబడినట్లు కమలహాసన్ స్పష్టం చేయడం, ఇంతకు ముందు కొన్ని వ్యాఖ్యల్లో వామపక్ష భావజాలం పట్ల సానుభూతితో మాట్లాడడం, పార్టీ ప్రారంభోత్సవంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద కేజ్రీవాల్ పాల్గొనడం స్పష్టమైన సూచనలు అనిపిస్తున్నప్పటికీ ఇందులో కాస్త అయోమయం కూడా ఉంది. కమల హాసన్ ఒక నాస్తికునిగానే ప్రజలకు పరిచయం. ఆ విషయాన్ని ఆయన స్పష్టంగా చాలా సార్లు చెప్పాడు. వామపక్ష భావజాలానికి దగ్గరగా ఉంటాడని కూడా చాలా మందికి తెలుసు. కాని అలాంటి ముద్రలేవీ తన మీద పడకుండా ఆయన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కనబడుతోంది. వామపక్ష భావజాలం నుంచి నెమ్మదిగా ఉదారవాదం వైపు మొగ్గుతున్నట్లు కనబడుతోంది.

కమలహాసన్ అవినీతి వ్యతిరేక నినాదాలు తమిళనాడులో ఎంతవరకు పనిచేస్తాయన్నది కూడా అనుమానాస్పదమే. తమిళనాడు ప్రజలు ఎన్నికల్లో డబ్బు వరదలను చూడ్డానికి అలవాటు పడిపోయారు. ఓటుకు నోట్లు అక్కడ మామూలే. కాని ఎం.జి.రామచంద్రన్ నుంచి ఈ విషయంలో కమలహాసన్ రాజకీయ పాఠాలు గ్రహించవచ్చు. ద్రవిడ మున్నేట్ర కజగంలో చాలాకాలం ఎం.జి.ఆర్ ఉన్నారు. పార్టీ ఎక్కౌంట్లను ప్రజలకు బహిరంగపరచాలని డిమాండ్ చేయడం వల్లనే ఆయన్ను పార్టీ నుంచి అప్పట్లో బహిష్కరించారు అప్పట్లో ముఖ్యమంత్రి కరుణానిధి. ఈ అవినీతి వ్యవహారాలకు వ్యతిరేకంగానే ఎంజిఆర్ ప్రజల్లోకి వెళ్ళగలిగారు. ఇప్పుడు కమల హాసన్ కూడా ఎన్నికల్లో డబ్బు ప్రమేయం వల్ల నష్టాలను ప్రజలకు నచ్చచెప్పగలిగితే, ముఖ్యంగా మహిళలకు అప్పీలు చేయగలిగితే ఆయన రాజకీయ ఎదుగుదలను ఎవరూ ఆపలేరు. ఒక సినిమా నటునిగా, వర్గపరమైన తేడాలను అధిగమించిన వ్యక్తిగా ఓటర్లను ఆకట్టుకునేలా అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడడం, ప్రజలను సమీకరించడం బహుశా ఆయనకు కష్టం కాకపోవచ్చు.

కమలహాసన్ తమిళ పత్రిక ఆనంద వికటన్‌లో ఒక వ్యాసం రాశారు. ‘‘ఎన్నుల్ మయం కొండ పుయాల్’’(నాలో ఉన్న తుఫాను). ప్రజలు గౌరవమర్యాదలతో జీవించడానికి తమ కాళ్ళపై తాము నిలబడడం నేర్చుకోవాలని రాశాడు. ఆయన ఉపాధి కల్పన గురించి మాట్లాడారు. ప్రజాకర్షక స్కీములు, ఉచితంగా ఇచ్చే పందారాలను వ్యతిరేకించాడు. ఇదంతా పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదని చాలామంది భావించవచ్చు, కాని ఎంజిఆర్ కూడా రాజకీయంగా ఇలాంటి వ్యూహాలనే అమలు చేసేవాడన్నది మరిచిపోరాదు. తాను ఎలాంటి ‘‘ఇజము’’లను నమ్మనని కమలహాసన్ అన్నాడు. ఎంజిఆర్ కూడా తనది అన్నాఇజం అని చెప్పేవారు. అంటే కమ్యునిజం, కేపిటలిజం, సోషలిజం అన్నింటి సంగమం. ఇవన్నీ అస్పష్టమైన ప్రతిపాదనలు. కమలహాసన్ స్పష్టమైన విధానాలను ప్రకటించకపోతే ఈ అయోమయం మరింత జటిలం కావచ్చు.

అధికారంలోకి వస్తే సంక్షేమపాలన అందిస్తానని వాగ్దానం చేసినంత మాత్రాన సరిపోదు. విధానపరమైన స్పష్టత ప్రజలకు ఇవ్వాలి.

కమలహాసన్ వైద్య, విద్యారంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మాట్లాడారు. నిజానికి దేశంలో అనేక రాష్ట్రాలతో పోల్చితే తమిళనాడు ఈ రంగాల్లో చాలా ముందుంది. మానవాభివృద్ధి సూచికల్లో తమిళనాడు ప్రగతిపథాన ఉంది. కాబట్టి నిర్దిష్టంగా ఈ రంగాల్లో ఏం చేయదలచుకుంది చెప్పవలసి ఉంటుంది. స్పష్టమైన ప్రణాళికల గురించి మాట్లాడవలసి ఉంటుంది. ఈ విషయంలో ఆయనకు సహాయపడే యువనేతల బృందం ఒకటి అవసరం. ఆయనకు చాలామంది అభిమానులు ఉన్నారు. కాని రజనీకాంత్‌తో పోల్చితే ఆయన అభిమానుల సంఖ్య చాలా తక్కువ. ఈ ఇద్దరు నటులు తమ అభిమానులను పార్టీ కార్యకర్తలుగా మార్చుకోవాలని ఆశిస్తున్నారు. ఎంజిఆర్ చేసిందదే. కాని గమనించవలసిన వాస్తవమేమంటే, ఎంజిఆర్ హఠాత్తుగా వచ్చి పార్టీ పెట్టలేదు. ఆయన ద్రవిడ మున్నేట్ర కజగం నుంచి తన వైపుకు చాలామంది కార్యకర్తలను ఆకర్షించాడు. ఆ పార్టీలో ఆయన చాలా కాలం ఉన్నాడు.

కుల సమీకరణాలు, సంస్థాగత నిర్మాణం కమలహాసన్ కు, రజనీకాంత్ కు ఇద్దరికి తలనొప్పులు కావచ్చు. వాళ్ళిద్దరు కులపరిమితులను అధిగమించి మాట్లాడగల ప్రజామద్దతు ఉన్న వ్యక్తులే . కాని కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితులు వేరుగా ఉండొచ్చు. కమలహాసన్ బహుశా తివార్ కులంపై ఎక్కువగా ఆధారపడవచ్చు. పార్టీ ప్రారంభోత్సవాన్ని పరిశీలిస్తే అదే అర్థమవుతుంది. ఆయన సినిమాల్లోను తివార్ సముదాయం గురించి తీసినవి ఉన్నాయి. అన్నాడిఎంకెకు అసలు బలం ఈ సముదాయమే. కాని డిఎంకె బలమైన కార్యకర్తలు, కేడర్ ఉన్న పార్టీ. కమలహాసన్, రజనీకాంత్‌ల వల్ల వచ్చే సవాళ్ళను ఎదుర్కోవడం ఆ పార్టీకి అంత కష్టమేమీ కాదు. కాబట్టి కమలహాసన్, రజనీకాంత్ ఇద్దరు కూడా ముఖ్యంగా అన్నాడిఎంకె ఓట్లను తమవైపు చీల్చడానికి ప్రయత్నించవచ్చు. బహుశా 2021 శాసనసభ ఎన్నికల్లో ఈ విషయమై స్పష్టత వస్తుంది. కమలహాసన్ బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఇంతవరకు కులాతీతంగా, మతాతీతంగా వ్యవహరిస్తాడన్న పేరుంది. కులసమీకరణాలపై దీని ప్రభావం ఉండదు.

కమలహాసన్ చాలా విషయాల్లో ఇప్పటికే స్పష్టత ఇచ్చాడు. రజనీకాంత్ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. తన పార్టీ ఏది? ఎప్పుడు ప్రారంభిస్తారు?వగైరా ప్రశ్నలకు రజనీకాంత్ ఇంతవరకు జవాబీయలేదు. ఈ సంవత్సరం జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కానీ, 2019 సాధారణ ఎన్నికల్లో కాని రజనీకాంత్ పార్టీ రంగంలో ఉంటుందా అన్నది అనుమానాస్పదమే. రాజకీయా ల్లో రజనీకాంత్ కన్నా ముందుగా అడుగుపెట్టిన అనుకూల పరిస్థితి కమల హాసన్ కు ఉంది. ఎన్నికల్లో తన బలాన్ని పరీక్షించుకునే అవకాశం కూడా ఉంది. తమిళనాడు రాజకీయాల్లోనే కాదు, జాతీయ రాజకీయాల్లోనూ ఒక శూన్యం ఉంది. ఆ శూన్యాన్ని భర్తీ చేసే పార్టీ ఆవశ్యకత కూడా ఉంది. కమలహాసన్, రజనీకాంత్ ఈ ఇద్దరిలో ఎవరు ఆ శూన్యాన్ని పూరిస్తారన్నదే ప్రశ్న. రజనీకాంత్ కన్నా తక్కువ అభిమానులున్నప్పటికీ ప్రస్తు తం కమలహాసన్ కు సానుకూలత ఎక్కువ ఉందనే చెప్పాలి. ఆయన ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నాడు. మంచి పోటీ ఇస్తాడనిపిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా తన సినిమాల ద్వారా కమలహాసన్ తన రాజకీయ ఉద్దేశ్యాలను ప్రకటిస్తూనే వచ్చాడు. విభిన్న వర్గాలను ఆ సినిమాలు ఆకట్టుకున్నాయి కూడా.

కమలహాసన్ చెబుతున్న అవినీతి వ్యతిరేక పోరాటానికి మధ్యతరగతి నిస్సందేహంగా మద్దతివ్వవచ్చు. ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ సభలో పాల్గొనడం కూడా అవినీతి వ్యతిరేకత ప్రధానంగా పోరాటం ఉంటుందని చెప్పకనే చెబుతోంది. కాని దిగువ తరగతి ప్రజానీకాన్ని ఈ అప్పీలు ఎంతవరకు ఆకర్షిస్తుందో వేచి చూడాలి. చాలామంది కమలహాసన్ను శివాజీగణేషన్‌తోను, రజనీకాంత్‌ను ఎంజిఆర్‌తోను పోల్చుతుంటారు. ముఖ్యంగా నటన విషయంలోను, అభిమానుల విషయంలోను. కాని రాజకీయాల్లో ఈ పోలికకు అర్థం లేదు. తమిళ రాజకీయాల్లో ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే. కాని, తమిళనాట బిజెపి కమలం వికసించాలని ఆశిస్తున్న తరుణంలో వికసిస్తున్న ఈ కొత్త కమలం బిజెపి ఆశలపై నీళ్ళు కుమ్మరించిందని చెప్పవ చ్చు.

(డైలీ ఓ లో ఆనంద్ కూచికూడి వ్యాసం)

కోర్కెలు తీర్చే గిరిజనుల కొంగు బంగారం



గుమ్మడి లక్ష్మీ నారాయణ
9491318409

ఉమ్మడి వరంగల్ జిల్లా కొత్తగూడ మండలం లోని గుంజేడు గ్రామంలో ప్రతి రెండేళ్లకొకసారి జరిగే ‘శ్రీముసలమ్మ’ గిరిజన జాతర అతిపెద్ద రెండవ జాతరగా పేరు గాంచినది. ఆదివాసీ సాంప్రదాయాల ఆధారంగా తోలెం వంశీయులు వడ్డెలు (పూజారులు)గా వుండి నిర్వహిస్తారు. ఫిబ్రవరి 28 నుండి మార్చి 3 వరకు జరుగుతుంది. ప్రతి రెండేళ్లకొకసారి ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ జాతరకు (శుక్రవారం) గిరిజన, గిరిజనేతర భక్తులు వేల సంఖ్యలో దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. మేడారం ‘సమ్మక్క సారక్క’ జాతర తర్వాత అత్యంత వైభవంగా జరిగే ఈ ‘ముసలమ్మ జాతర’ గురించి పెద్దగా ప్రచారం లేదు.

శ్రీ గుంజేడు ముసలమ్మ జాతర 1975–76 నుండి క్రమం తప్పకుండా ఆదివాసీ ఆచారాలతో గుంజేడు గ్రామం పడమర దిక్కులో ముసలమ్మ గుట్టకు దగ్గర వాగు ఒడ్డులో నిర్వహిస్తున్నారు. పూర్వం నుండి ఈ జాతరను ఆదివాసీలే వడ్డెలు, భక్తులుగా ఉండి నిర్వహిస్తున్నారు. 1994 తర్వాత నుండి ఉమ్మడి రాష్ట్ర దేవాదాయ శాఖ నిర్వహిస్తూ వస్తోంది. ప్రతి ఏటా జాతర ఆదాయం రూ.70లక్షలు వస్తున్నా అది ఏ మాత్రం ఆదివాసీల అభివృద్ధికి వినియోగించడం లేదు. ఇటీవలే ఈ జాతర దేవాదాయ శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో జరగడం వల్ల ఆరుగురు ఆదివాసీ పూజారులలో కేవలం ముగ్గురికే పర్మినెంట్ స్కేల్ ఇచ్చారు.

శ్రీ ముసలమ్మ తల్లి మన్ననలనుపొంది దేవత అనుగ్రహం కలిగిన వారికి సంతానం, సంపద, పంట పొలాలు, ధాన్యం, వ్యాపారం, ఉద్యో గం వంటి కోర్కెలు తీరడం వల్ల అనూహ్యంగా భక్తుల సందర్శన పెరుగుతోంది. గుంజేడు పరిసర ప్రాంతం దట్టమైన అడవిలో ఉండటంవల్ల అక్కడిపక్షుల కిలకిలా రావాలు, గలగలపారే సెలయేర్లు, పచ్చని చెట్లు క్రింద భక్తులు సేదతీరుతున్నారు. విహార ప్రదేశంగా విరాజిల్లుతోంది. ప్రతీ శుక్రవారం వచ్చే భక్తులతో శివసత్తులు పూనకాలు ఊగుతూ అడుగుల సవ్వడితో చిందులు వేస్తూ అమ్మవారిని తరించడం అద్భుతంగా ఉంటుంది.

శ్రీ ముసలమ్మ దేవత కాకతీయుల కాలంలోనే 12వ శతాబ్దంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బస్తర్ అటవీ ప్రాంతం నుండి ‘గుంజేడు’ చేరినట్లు మౌఖిక మూలాధారం. గుంజేడు ములసమ్మ జాతర అనేది ప్రకృతి ఆరాధాన పండుగ. విగ్రహారాధన లేని హిందూయిజానికి సుదూరమైన జాతర. కాని ఇప్పుడు గిరిజనేతర సంస్కృతి, ఆరాధనతో పాటు దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లి సాంస్కృతిక పరాధీనతకు ఈ జాతర గురైంది. గిరిజనేతర వ్యాపారులు కొందరు దాతలుగా, దేవతకు విగ్రహాన్ని, గుడిగోపురాన్ని ఏర్పరచారు. ఇది ఆదివాసీ వడ్డెల, పెద్దల తీర్మానాలేవి లేకుండా జరిగిన తతంగం. ఇక్కడి సాంప్రదాయక వడ్డెలైన ఆదివాసీ యువకులకు కీసరగుట్టలోని ఆధ్యాత్మిక కేంద్రంలో హిందూ పూజారులుగా శిక్షణ ఇచ్చి మంత్రతంత్రాలతో పూజావిధానం పెట్టడం ఆదివాసీ సంస్కృతికి విరుద్ధం.

ఇప్పటికైనా గుంజేడు ముసలమ్మ జాతరలో ఆదివాసీ సాంప్రదాయాలను రక్షిస్తూ, జాతర ఆదాయం ఆదివాసీ సంక్షేమానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలి.

ఎడిటర్‌కు లేఖ

న్యాయవాదులకు ప్రత్యేక వైద్యశాల నిర్మించాలి

న్యాయవాదుల వెల్ఫేర్ ట్రస్ట్ ఏకగ్రీవ తీర్మానాలలో ప్రముఖ పాత్ర పోషించిన అడ్వకేట్ జనరల్ శ్రీ డి.ప్రకాశ్ రెడ్డిగారిని కలిసి తెలంగాణ హైకోర్టు న్యాయవాదులు అభినందించడం జరిగింది. వారితో జరిగిన సంభాషణలో సిఎం కెసిఆర్‌గారు న్యాయవాదుల సమస్యలపట్ల సానుకూలంగా ఉన్నారని, అందువల్లే న్యాయవాదులకు రెండు లక్షలు హెల్త్ ఇన్సూరెన్స్‌కు, పది లక్షలు ఆక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌కు, పది వేలు జూనియర్ న్యాయవాదులకు, న్యాయవాదులకు కార్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు లైబ్రరీ, కంప్యూటర్, ఫర్నిచర్‌కు నగదు సహాయం చేయటానికి ఒప్పుకున్నారని చెప్పారు.

వీటితోపాటు ఆర్థికంగా గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న న్యాయవాదులకు, ప్రత్యేకంగా ఒక ఆసుపత్రి, డబుల్‌బెడ్ రూమ్, పిల్లల చదువు, పెళ్ళిళ్లకు, వ్యక్తిగత పూచీకత్తుపై లోన్ ఏర్పాటు, అరవై సంవత్సరాలు పై బడిన వారికి పెన్షన్, బస్సులలో ట్రైన్లలో కన్‌సెషన్ ఇవ్వాలని మనవి.

— గుంద్రాతి శారదాగౌడ్,
హైకోర్టు న్యాయవాది



అఖిల



ఒకప్పుడు మామధ్య గొప్ప స్నేహం ఉండేది

సినీరంగంలో అజాతశత్రువులా ఉండేవారు శ్రీదేవి. మూడు తరాల నటీనటులు, టెక్నీషియన్లతో పనిచేసిన ఆమె చాలా వరకు అందరితోనూ కలివిడిగానే ఉన్నారు. కానీ ఒక్క జయప్రదతో మాత్రం ఆమెకు పడేది కాదు. వీళ్ల మధ్య ఎందుకు గొడవ వచ్చిందో కానీ అది రానురాను తీవ్రమైంది. చాలా ఏళ్లపాటు ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండానే ఉండిపోయారు. చివరికి ఓ హిందీ సినిమా షూటింగ్ సందర్భంగా కలిసిన వీళ్లిద్దరినీ ఒక గదిలో పెట్టి తాళం కూడా వేసి వెళ్లిపోయారట. అలా అయినా మాట్లాడుకుంటారేమోనని చూస్తే అదేమీ జరుగలేదు. గంట తర్వాత తలుపులు తెరిచి చూస్తే ఇద్దరూ దూరం దూరంగానే ఉన్నారట. అంతటి విభేదాలుండేవి వీళ్లిద్దరి మధ్య. అయితే ఇప్పుడు శ్రీదేవి హఠాన్మరణంతో జయప్రద కదిలిపోయారు. గత విభేదాలన్నీ పక్కనపెట్టి శ్రీదేవి గురించి గొప్పగా మాట్లాడారు. తమ మధ్య ఒకప్పుడు గొప్ప స్నేహం ఉండేదని చెప్పారు. శ్రీదేవి లేదన్న నిజాన్ని తాను ఇంకా జీర్ణించుకోలేకపోతున్నానని... ఎన్ని రోజులకు తన మనసు కుదుటపడుతుందో తెలియదని జయప్రద అన్నారు. తన కూతురు జాన్వి తెరంగేట్రం కోసం శ్రీదేవి ఎంతో తపించిందని... కానీ అది చూడకుండానే ఆమె వెళ్లిపోయిందని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ఇక శ్రీదేవి మరణవార్త తెలియగానే ముంబయిలోని వాళ్లింటికి వెళ్లిన జయప్రద... మంగళవారం రాత్రి ఆమె పార్థివదేహం రావడంతో బుధవారం ఉదయం మళ్లీ వాళ్లింటికి చేరుకొని నివాళి అర్పించారు. శ్రీదేవి అంతిమ యాత్రలో కూడా ఆమె పాల్గొన్నారు.







విద్యార్థి దశ నుంచే తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుంటోంది యువత నేడు. అనుకున్నది సాధించి ఇతరులకు మార్గదర్శకులవుతున్నారు..అలాంటి కోవకు చెందుతుంది సింధుజ. చదువు పూర్తయ్యేలోగానే వ్యాపారవేత్తగా మారింది. కోట్ల రూపాయల టర్నోవర్‌ను సాధించి అందరిచేతా ఔరా అనిపించుకుంది. ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ తీసుకుంటానన్నా, చదువుకుంటూనే వ్యాపారం చేస్తానన్నా వద్దన్న కుటుంబసభ్యులే ఇప్పుడు ఆమె విజయానికి గర్విస్తున్నారు.

యువత అభిరుచికి అద్దంపట్టేలా...

హైదరాబాద్‌కు చెందిన సింధుజ ఇంటర్ వరకు ఇక్కడే చదువుకుంది. తల్లిదండ్రులిద్దరూ బ్యాంకు ఉద్యోగులు. మొదటి నుంచీ సింధుజకు ఫ్యాషన్ అంటే ఇష్టం. దాన్నే కెరీర్‌గా మార్చుకోవాలనుకుంది. ఇంటర్ కాగానే ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేస్తానంటే ఇంట్లో వద్దన్నారు. కుటుంబంలో అప్పటివరకూ ఎవ్వరూ ఆ రంగంలో లేకపోవడంతో భవిష్యత్తు ఎలా ఉంటుందనే భయంతో పర్మిషన్ ఇవ్వలేదు. చివరికి సింధుజ ఎలాగోలా వారిని ఒప్పించింది. ఓకే అనడంతోనే .. ఫ్యాషన్ డిజైనింగ్‌పై అవగాహన పెంచుకుంది. నిఫ్ట్ ప్రవేశపరీక్ష రాసింది. చెన్నైలో సీటొచ్చింది. రెండేళ్లు అక్కడ కోర్సు పూర్తిచేసింది. మూడో ఏడాది సెమిస్టర్‌లో భాగంగా తను డిజైన్ చేసిన రకరకాల టీషర్టులు స్నేహితులకు చూపించింది. వారికి బాగా నచ్చాయి. దాంతో తను చదివే కాలేజీతో సహా ఇతర కాలేజీల్లో ఫెస్టివల్స్, ఇతర సందర్భాలకు తనే డిజైన్ చేసిన వస్త్రాలను ఇచ్చేది. మరో ఏడాది అయ్యేసరికి విద్యార్థుల నుంచి ఆమె డిజైన్లకు ప్రశంసలు వచ్చాయి. ఆమె చేసిన పదివేల డిజైన్లు విద్యార్థులకు నచ్చాయి. అప్పుడే వ్యాపారం చేయాలనే ఆలోచన వచ్చింది సింధుజకు.

అందుకోసం తమిళనాడులోని తిరుప్పూరు వెళ్లి అక్కడ టీ షర్టు తయారీకి ఉపయోగపడే వస్త్రాన్ని కొలుగోలు చేసింది. కాలేజీల్లో ఇంటా బయటా యువత ఎలాంటి టీషర్టుల్ని ఉపయోగిస్తున్నారనే విషయం గమనించడం మొదలుపెట్టింది. ఏడో సెమిస్టర్‌లో ఉన్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా డిజైన్‌ను మరింత విస్తరించాలనుకుంది. అలా 'యంగ్ ట్రెండ్జ్' అనే బ్రాండ్‌ను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించింది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌ల్లో అమ్మకాలు మొదలుపెట్టింది.

మొదట్లో ఆన్‌లైన్‌లో ఆమె ఆదాయం నాలుగొందలు. దాంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. తర్వాత రోజుకు పది టీషర్టుల్ని అమ్మేది. నెమ్మదిగా తన టీషర్టులు యువతను ఆకర్షించడం మొదలెట్టాయి. ఇంతలో చదువు పూర్తయింది. స్నేహితుడైన ప్రవీణ్ సలహాతో రెండేళ్లలో పదిలక్షల పెట్టుబడి పెట్టి కష్టపడింది. డిజైన్లలో పరిశోధన చేసింది. విద్యార్థులతో మాట్లాడి, వాళ్ల ఆసక్తిని తెలుసుకుంటూనే డిజైన్లను ప్లాన్ చేసింది. మగవారి టీషర్టులకు గిరాకీ పెరిగింది. ఆమె తయారుచేసిన ఓం డిజైన్ బాగా పేరు తెచ్చింది. అయిదు రోజుల్లో పాతికవేల టీషర్టులు అమ్ముడుపోవడమే కాకుండా ఓకే రోజులో పదివేల ఆర్డర్లు రావడం ఇప్పటికీ ఆనందంగా ఉంటుందంటోంది. దీంతో ఫ్లిప్‌కార్ట్ అత్యధిక అమ్మకం చేసిన బ్రాండ్ వ్యవస్థాపకురాలిగా ఆమెకు అవార్డును అందించి సత్కరించింది.

అత్యధిక డిజైన్లు..

ప్రస్తుతం యంగ్ ట్రెండ్జ్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో మూడు వేల డిజైన్ల క్యాటలాగ్ ఉంది. బయోవాష్‌కు అనుగుణంగా ఉండే వస్త్రాన్ని ఎంచుకుంటుంది. వీటి ధర రూ. 400 నుంచి రూ.600 వరకు ఉంటుంది. వీటిని తయారుచేయడానికి ఓ యూనిట్ ఉంది. సుమారు 50 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులోనూ అమ్మాయిల సంఖ్యే ఎక్కువ. చెన్నైతోపాటు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, హరియాణా, పశ్చిమ బంగాల్‌లోని వేర్ హౌసుల్లో తమ సంస్థ దుస్తులను ఎప్పటికప్పుడు 30వేలకు పైగా నిల్వ ఉండేలా చూసుకుంటుంది. రిటైల్ షాపులో అమ్మకాలను ప్రారంభించాలంటూ పెద్ద పెద్ద దుకాణాల నుంచి ఆఫర్లు వస్తున్నాయంటుంది. త్వరలో దాన్ని కూడా ప్రారంభించేదుకు సన్నాహాలు చేస్తోంది సింధుజ. తన డిజైన్లు యువత అభిరుచికి అద్దం పట్టేలా ఉండాలనుకుంటూ.. అలాంటివాటికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ దూసుకుపోతుంది ...ఇప్పుడు కూతురి అభివృద్ధిని చూసి తల్లిదండ్రులు గర్విస్తున్నారు.



ఫుట్‌బోర్డులో ప్రయాణిస్తే...ఆపేస్తుంది

నిత్యం రద్దీగా ఉండే కోల్‌కతాలోని వీధుల్లో రోజూ ఎన్నో బస్సులు తిరుగుతుంటాయి. అందులో ఏం విశేషం ఉందనుకుంటున్నారా ఒక బస్సుని ఆరేళ్లుగా ఒక మహిళ డ్రైవింగ్ చేస్తోంది. ఆమే ప్రతిమా పొద్దార్. ప్రయాణికులను క్షేమంగా తీసుకువెళ్తూ... ఇప్పటికీ ఒక్క ప్రమాదం కూడా జరగకుండా వారి గమ్యాలకు చేరుస్తోంది. ఫుట్‌బోర్డు మీది ప్రయాణం చేసే వారందరిని లోపలికి వస్తేనే బస్‌ను స్టార్ట్ చేస్తుంది. ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తూ ఎవరైనా తన బస్సులో కనిపించినా, సైడ్ విండోలోంచి చూసి అక్కడికక్కడ బస్సును ఆపేస్తుంది... ఇదే ప్రతిమ ప్రత్యేకత. అనుకోకుండా జరిగిన యాక్సిడెంట్‌లో భర్త మంచానికే పరిమితం కావడంతో కుంటుంబానికి ఆసరాగా నిలబడి సంసార సాగరాన్ని నడిపిస్తుంది ప్రతిమ.

కాలక్షేపం కోసం నేర్చుకున్నది ...నేడు కడుపునింపుతుంది...

భర్త శిబేశ్వర్ బస్సు కండక్టర్‌గా ఉద్యోగం చేసేవాడు. 2011లో జరిగిన చిన్న ప్రమాదం జరగడంతో ఆయన మానేసాడు. ఇంట్లో ఆర్థిక పరిస్థితుల ఇబ్బందులు ఎక్కువ అవ్వడంతో ఏదో ఒక ఉద్యోగం వెతుక్కోవాల్సి వచ్చింది. అప్పటికి ఆమెకు 36 ఏళ్లు వయసు. ఎన్నిరకాలుగా ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా.. సరదాగా నేర్చుకున్న డ్రైవింగ్ గుర్తుకొచ్చింది. చివరికి ఆ డ్రైవింగే ఆమెకు బతుకుతెరువు చూపింది. కొన్నాళ్ల పాటు అంబులెన్స్, ట్యాక్సీ నడిపింది. దాని తరవాత అతి కష్టం మీద బస్ డ్రైవింగ్ నేర్చుకుంది. బ్యాంకు లోన్ మీద సొంత బస్సు కొనుక్కుంది, లైసెన్స్ సంపాదించుకుంది. కోల్‌కతాలోని బిరాటి నుంచి హౌరాకు బస్సులు నడుపుతూ ఉండేది. నిత్యం బ్యాంకులో డబ్బులు జమ చేసింది. తన ఇద్దరు కూతుళ్లను ఉన్నత స్థానంలో ఉండేలా మంచి పాఠశాలలో చదివిస్తోంది.

వృత్తిలో ఎలాంటి పొరపాటు చేయదు...

పెద్ద కూతురు పేరు రాఖీ. చదువులోనే కాకుండా బెంగాల్ జిమ్నాస్టిక్స్‌లో, రాష్ట్రం తరఫున ఈత పోటీలలో పాల్గొని తన సత్తా నిరూపించుకుంది. జాదవ్‌పూర్‌లో విశ్వవిద్యాలయంలో మ్యాథమెటిక్స్ కొనసాగిస్తుంది. చిన్న కూతురు పేరు సాథీ స్కూల్‌లో చదువుతుంది. ప్రతిమ బస్సును చాలా జాగ్రత్తగా నడుపుతుంది. డ్రైవింగ్‌లో ఎప్పుడూ ఓవర్‌టేక్ చెయ్యదు. అలాగే బస్సులోకి రన్నింగ్‌లో ఎక్కనివ్వదు. ఇది గుర్తించిన హౌరా పోలీస్‌స్టేషన్ ప్రతిమకు సర్టిఫికెట్ కూడా ఇచ్చారు! ఉద్యోగంలో అందరిలాగే ప్రతిమకూ ఏవో చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నప్పటికీ, చిరునవ్వుతో వాటిని నెట్టుకొస్తుంది. ప్రతి రోజు ఉదయాన్నే 3.30కి నిద్ర లేస్తుంది. బి.ఎ. చదువుతూ మధ్యలో ఆపేసిన ప్రతిమ తన పిల్లలను విద్యాధికులను చేసేందుకే ఇంత శ్రమా పడుతూ, ఉద్యోగం చేస్తూ నేటి మహిళా సమాజానికి ఆదర్శంగా నిలుస్తోంది.

మెడనొప్పి తగ్గడానికి...



మనం ఎప్పుడైన ఏదో ఒక సమయంలో మెడ నొప్పితో బాధ పడుతుంటాం. మెడ ప్రాంతంలోని కండరాల గట్టితనాన్ని, నొప్పిని, శక్తిని తగ్గించడంలో ఈ కింది 3 యోగా అభ్యాసాలు సహాయపడతాయి. అలాగే, ఈ భంగిమలు వల్ల ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. ఇంకా మెదడుకు విశ్రాంతి లభిస్తుంది.

భుజంగాసనం (కోబ్రా భంగిమ)

రెండు కాళ్లు దగ్గరగా ఉంచి, బోర్లా పడుకోవాలి. వెన్నునొప్పి ఉన్నట్లయితే, రెండు కాళ్లు మధ్య కొంత ఖాళీ ఉండాలి. నెమ్మదిగా అరచేతులను భుజాల పక్కన ఉంచండి. తల నేలను తాకుతూ ఉండాలి. గాలి పీల్చేటప్పుడు, తలను పైకి ఎత్తి, పైకప్పు/ఆకాశాన్ని చూడటానికి ప్రయత్నించండి. అరచేతులపై భారం వేయకూడదు.

ఈ భంగిమలో సాధ్యమైనంత ఎక్కువ సమయం కొనసాగండి. సాధారణంగా గాలి పీల్చవచ్చు. బయటకు గాలి విడిచేటప్పుడు, నెమ్మదిగా యదార్థ భంగిమకు చేరుకోవాలి. ఈ విధంగా 3 నుండి 5 సార్లు చేయాలి.



త్రికోణాసనం (తిక్రోణ భంగిమ)

కాళ్లు దగ్గరగా ఉంచి, నిటారుగా నిలబడాలి. శరీరానికి రెండు పక్కలుగా చేతులను చాచాలి. నెమ్మదిగా కాళ్లు 4 అడుగులు దూరంగా చేయాలి. చేతులను నేలకు సమాంతరంగా ఎత్తాలి. నెమ్మదిగా కుడి వైపునకు వంగాలి. కుడి చేతితో ఎడమ కాలి బొటనవేలును తాకడానికి ప్రయత్నించండి. అదే విధంగా, ఎడమ చేతిని పైకి ఎత్తాలి. కంటితో ఎడమ చేతి పైభాగాన్ని చూస్తూ ఉండాలి. ఈ భంగిమలో గట్టిగా శ్వాస తీసుకుంటూ ఉండాలి. నెమ్మదిగా కుడి చేతిని, ఎడమ చేతిని యదార్థ స్థానాలకు తీసుకుని రావాలి (నేలకు లంబంగా/సమాంతరంగా). మరొకవైపు కూడా ఈ విధంగా చేయాలి. ఈసారి, ఎడమ వైపుగా ముందుకు వంగాలి. ఎడమ చేతితో కుడి కాలి బొటనవేలును తాకాలి. అదే సమయంలో కుడిచేతిని పైకి ఎత్తాలి. కంటితో కుడి చేతి పై భాగాన్ని చూస్తూ ఉండాలి. ఈ భంగిమలో గట్టిగా శ్వాస తీసుకుంటూ ఉండాలి. కొంత సమయం తర్వాత, ఎడమ చేతిని, కుడి చేతిని సమాంతర స్థానంలోకి తీసుకుని రావాలి (నేలకు సమాంతరంగా). రెండు చేతులను విడదీయాలి. పాదాలను ఒకదానికి ఒకటి దగ్గరిగా చేర్చి, విశ్రాంతిగా కూర్చోవాలి.

పరిశోధనల కోసం విద్యార్థులకు ప్రోత్సాహకాలు

మనతెలంగాణ/హైదరాబాద్ : శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనల కోసం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించనున్నామని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జోగురామన్న తెలిపారు. బుధవారం బిర్లా సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరిశోధనలు దేశానికి అవసరమన్నారు. దీని కోసం సైన్స్ అండ్ టెక్నాలజీలో రంగంలో విద్యార్థులను ప్రోత్సహించాలని నిర్ణయించామని చెప్పారు. మొత్తం పరిశోధనల్లో 8 ఉత్తమ పరిశోధనలను ఎంపిక చేస్తామని తెలిపారు. వీటిలో 4 సైన్స్, 4 గణిత పరిశోధనలను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన ఒక్కో పరిశోధనకు సంబంధిత విద్యార్థికి రూ.25వేల నగదు బహుమతిని అందచేస్తామన్నారు. విద్యార్థులు పరిశోధనల్లో రాణించి సర్‌సివిరామన్ వలె తయారు కావాలని సూచించారు. సైన్స్ డే సందర్భంగా జాతీయ స్థాయి అవార్డులు సాధించిన విద్యార్థులు అరీబా అయ్యేన్, మహేందర్ రెడ్డిలను ఆయన సన్మానించారు. పర్యావరణ పరిరక్షణ కేంద్రం డైరెక్టర్ జనరల్ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ సైన్స్ ద్వారానే ఇంత ప్రగతి సాధ్యమైందన్నారు. సమాజ సుస్థిర అభివృద్ధికి ఉపయోగపడేలా సైన్స్‌ను వినియోగించాలని సూచించారు.



రెండు తలల పాము విక్రయ ముఠా



మన తెలంగాణ/హైదరాబాద్ : ఆన్‌లైన్‌లో రెండు తలల పాములను విక్రయించే ఓ ముఠా గుట్టును అటవీ శాఖ అధికారులు రట్టు చేసి ఇద్దరు ముఠా సభ్యులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న పాములను అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం శాంతినగర్‌కు చెందిన ఉదయ్‌కుమార్, రమేష్‌లు తమ వద్ద రెండు తలల కలిగిన పాములు ఉన్నాయని, వాటిని విక్రయిస్తామని ఆన్‌లైన్‌లో ఓ పోస్టు పెట్టారు. దీనిని చూసిన వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖకు చెందిన యాంటీ పోచింగ్ స్క్వాడ్ అధికారులు, సంస్థ సభ్యులు సంయుక్తంగా రంగంలోకి దిగి తామే ఆ రెండు తలల పామును కొంటామంటూ సంప్రదింపులు జరిపారు. నమ్మకం కుదిరిన తర్వాత నిందితులు రెండు తలల పాముతో శంషాబాద్‌లోని ఓ హోటల్ దగ్గరకు చేరుకున్నారు. దీంతో వారిని అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఇనుప పెట్టెలో ఉన్న పామును స్వాధీనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బండగొండ గ్రామం నుంచి తాము ఈ పామును తీసుకువచ్చినట్లు నిందితులు వెల్లడించారు. మూడు కేజీలకు పైగా బరువున్న పాముకు మరిన్ని శక్తులు ఉంటాయని, వాటిని అమ్మేవారు నమ్మబలుకుతారని, వాస్తవానికి ఈ రకమైన పాములకు ఎలాంటి అతీంద్రియ శక్తులు ఉండవని, ఆ ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి పాములు విక్రయించేవారు ఎవరైనా ఉంటే పోలీసులు, అటవీ శాఖ సమాచామివ్వాలని వన్యప్రాణి ప్రత్యేక అధికారి ఎ.శంకరన్ తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగికి గవర్నర్ సన్మానం



మన తెలంగాణ / హైదరాబాద్ : ఉద్యోగులు అత్యంత సంతృప్తిగా ఉద్యోగ విరమణ చేసి శేష జీవితంలో సంతోషంగా ఉండాలని రాష్ట్ర గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ అన్నారు. ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో ముఖ్యమైన సందర్భమని, సర్వీసు నుంచి గౌరవంగా విరమణ పొందాలని ఆయన పేర్కొన్నారు. రాజ్‌భవన్‌లో బట్లర్‌గా ఆరుగురు గవర్నర్ల వద్ద దాదాపు 37 ఏళ్లు పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన టి.మునిశేఖర్‌ను గవర్నర్ రాజ్‌భవన్‌లో బుధవారం దుశ్శాలువాతో సత్కరించారు. గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ హరప్రీత్ సింగ్, జాయింట్ సెక్రటరీ అర్జున్‌రావు, డిప్యూటీ సెక్రటరీ ఎం.కృష్ణ, ప్రెస్ సెక్రటరీ పి.గౌరీశంకర్, లైజన్ ఆఫీసర్ ఎల్.విద్యాసాగర్‌తో పాటు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

8,9న రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక

మన తెలంగాణ/ హైదరాబాద్ :త్వరలో జరిగే మూడు రాజ్యసభ స్థానాల ఎన్నికపై టిఆర్ఎస్ మార్చి రెండవ వారంలో కసరత్తు చేయనుంది. ఈ నెల 8,9వ తేదీలలో టిఆర్ఎస్ అధినేత, సిఎం కెసిఆర్ అభ్యర్థుల ఎంపికపై పార్టీ నేతలతో చర్చించి ప్రకటించే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

12 నుండి అసెంబ్లీ

శాసనసభ బడ్జెట్ సమావేశాలు మార్చి 12వ తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు సమాచారం. తొలి రోజున ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ఉంటుంది. బడ్జెట్ సమర్పించే తేదీ ఖరారు కానప్పటికీ, సాధారణంగా గవర్నర్ ప్రసంగం చేసిన రెండు రోజుల తరువాత ఉంటుంది.

పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

మనతెలంగాణ/హైదరాబాద్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అర్హత పరీక్ష 2018 దరఖాస్తు గడువును మార్చి 22 వర కు పొడిగిస్తున్నట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ముందు ప్రకటించిన పరీక్ష తేదీని మారుస్తూ రెండు రాష్ట్రాలలో ఏప్రిల్ 8న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు టిఎస్‌ఆన్‌లైన్/ఎపిఆన్‌లైన్ కేంద్రాలలో వివరాలు నమోదు చేసుకుని నిర్దేశిత ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు www.braouon line.in చూడాలన్నారు.

ముగ్గురు సజీవ దహనం

నోయిడా: గ్రేటర్ నోయిడాలోని బదల్పూర్ ప్రాంతంలో ట్రక్కును ఢీకొన్న అంబులెన్స్‌లో మంటలు చెలరేగడంతో ముగ్గురు సజీవ దహనమయ్యారు. ఇద్దరు గాయపడ్డారు. బుధవారం తెల్లవారు జామున 18 టైర్ల ట్రక్కును మారుతీ ఒమ్ని అంబులెన్స్ ఢీకొట్టుకోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. మృత దేహాలు గుర్తించలేనంతగా కాలిపోయాయని, ప్రమాదం జరిగిన తర్వాత అంబులెన్స్‌కు నిప్పంటుకున్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు బదల్పూర్ ఎస్‌హెచ్ఒ ముఖేష్ కుమార్ తెలిపారు. ప్రమాద వేగానికి బయట పడిన ఇద్దరికి గాయాలు కాగా, అంబులెన్స్‌లో చిక్కుకున్న ముగ్గురు మృతి చెందినట్లు కుమార్ తెలిపారు. బాటసారి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నట్లు ఆయన తెలిపారు. అంబులెన్స్ ఢిల్లీలోని తేజ్ బహదూర్ ఆస్పత్రి నుంచి దాద్రికి తిరిగి వెళ్తున్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు.

సవరించే విషయం యోచించండి

(మొదటిపేజీ తరువాయి)

ముందే ప్రభుత్వం స్పందిస్తే బాగుంటుందని పేర్కొంది. హిజ్రాల వద్ద పదిహేను పదహారు ఏళ్ల బాలుడు ఉండకూడదనే ఆ చట్ట నిబంధన ఆమోదయోగ్యంగా లేదని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. హిజ్రాలు సంగీతం నేర్చుకోరాదని, డ్యాన్స్ చేయరాదనే చట్ట నిబంధనలు దారుణమని బెంచ్ వ్యాఖ్యానించింది. హిజ్రాల కారణంగా అఘాయిత్యాలు జరుగుతున్నాయా.. ఇతరుల కారణంగా పిల్లలపై అఘాయిత్యాలు జరగడం లేదా అని బెంచ్ ప్రశ్నించింది. తెలంగాణ యూనిక్స్ చట్టం రాజ్యాంగ వ్యతిరేకంగా వెల్లడించాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన వసంత, మోనాలీసా ఇతరులు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ విచారించింది. పిల్లల్ని యూనిక్స్‌గా మార్చేస్తారనే దారుణ చట్టాన్ని రద్దు చేయాలని, యూనిక్స్ అనే పదాన్ని కర్నాటక హైకోర్టు తప్పుపట్టిందని పిటిషనర్ లాయర్ వాదించారు. స్వాతంత్ర్యానికి పూర్వపు చట్టమని, కేసులు ఎన్ని ఉన్నాయో తెలుసుకుని వివరాలు సమర్పిస్తామని ప్రభుత్వ లాయర్ చెప్పారు. ప్రతివాదులైన తెలంగాణ హోం/సాంఘిక సంక్షేమశాఖల ముఖ్య కార్యదర్శులు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

బడ్జెట్‌లో ఆర్‌టిసికి రూ.1000 కోట్లు

• భారీ మొత్తంలో ఆర్థిక సాయాన్ని ఆశిస్తున్న సంస్థ • ప్రభుత్వం ఆదుకోకుంటే కుప్పకూలుతుందని ఆందోళన



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ(టిఎస్‌ఆర్‌టిసి) నష్టాల ఊబిలో కూరుకుపోతున్నది. ఆర్‌టిసి ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారవుతన్నది. ఈ నేపథ్యంలో ఆర్‌టిసికి ఉన్న అప్పులను, వస్తున్న నష్టాన్ని ఎవరు పూడ్చాలి, ఎలా పూడ్చాలని అధికారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆర్‌టిసి అధికారులు ప్రభుత్వం నుంచి పెద్దఎత్తున ఆర్థిక సహాయాన్ని ఆశిస్తున్నారు. నష్టాల కష్టాల నుంచి ఆర్‌టిసిని గట్టెక్కించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి ఆదుకోనట్లయితే సంస్థకుప్పకూలే పరిస్థితి ఏర్పడుతుందని ఆర్‌టిసి అధికారులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందించాలని లేదా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేందుకు, టిక్కెట్ ధరలు పెంచేందుకు అనుమతించడం తప్ప మరో మార్గం లేదని అభిప్రాయపడుతున్నారు. ఆర్‌టిసికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీల నిధులతో పాటు కనీసం రూ.1000 కోట్లు అవసరమని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ఆర్‌టిసి ఉన్నతాధికారులు ఇటీవల రవాణ శాఖకు బడ్జెట్ ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. సంస్థ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెరిగిన వేతనాలు, రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణకు రూట్ల సంఖ్య తగ్గడం, రాయితీలు, అప్పులపై వడ్డీలు పెరగడం తదితర కారణాలు సంస్థకు నష్టం వాటిల్లడానికి ప్రధాన కారణాలని ఆర్‌టిసిఅధికారులు చెబుతున్నారు. ఆర్‌టిసిని ఆదుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఏ మాత్రం సరిపోవడం లేదని వారంటున్నారు. పెరుగుతున్న కార్మికుల వేతనాలు, నిర్వహణ వ్యయం, ఖర్చులకు అనుగుణంగా బస్ ఛార్జీలు పెంచడం, ప్రజా రవాణ వ్యవస్థ అయినందున ప్రభుత్వం మరింతగా ఆర్థిక సహాయాన్ని అందిస్తే తప్ప సంస్థ 'నో లాస్ నో ప్రాఫిట్' పరిస్థితికి వచ్చే అవకాశాలు కనబడడం లేదంటున్నారు.

అప్పులు, నష్టాల భారం

ప్రస్తుతం ఆర్‌టిసికి దాదాపు రూ. 2 వేల కోట్ల అప్పులుండగా ప్రతి ఏటా సుమారు రూ.450 కోట్ల నష్టాలు పెరగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. సంస్థ ఆదాయానికి, ఖర్చుకు మధ్య అగాధం నిత్యం పెరుగుతున్నది. మొత్తం 97 బస్ డిపోలలో 27 డిపోలు లాభాల్లో ఉన్నప్పటికీ మిగిలిన డిపోలు నష్టాలను చవిచూస్తూనే ఉన్నాయి. నష్టాలను అధిగమించేందుకు కేవలం టిక్కెట్లపై వచ్చే ఆదాయమే కాకుండా ఇతర ఆదాయ వనరుల కోసం కృషి చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. ప్రతి రోజు డీజిల్ ధర పెరుగుతుండడంతో మరోవైపు అమ్మకం పన్ను, మోటారు వాహనాల పన్ను ఆర్‌టిసికి భారంగా మారి సుమారు రూ. 400 కోట్ల ఆర్థిక భారం సంస్థపై పడుతుంది. మరో వైపు కొత్త వేతన సవరణ కోసం సంస్థ యాజమాన్యంపై వత్తిడి పెరగుతుండడంతో వాటి కోసం ఆర్థిక వనరులను ఎలా సమకూర్చుకోవాలనే ఆలోచనలోపడ్డారు.


ప్రభుత్వం ఆదుకుంటేనే ఆర్‌టిసి మనుగడ

ప్రభుత్వం ఆదుకుంటే తప్ప ఆర్‌టిసి బయటపడే పరిస్థితి లేదు. తక్షణం రూ.1000 కోట్లు ఇచ్చి ఆదుకోవాలి. లేదా ఛార్జీలను పెంచుకునేందుకు, బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు అనుమతి ఇవ్వాలి. ప్రభుత్వం ఇచ్చే నిధులైనా సమయానికి ఇస్తే అప్పులు బారిన పడకుండా వడ్డీ భారాన్ని తగ్గించుకోవచ్చు. వ్యవసాయ రంగంలో గిట్టుబాటు ధర ఎలా కోరుతున్నారో ఆర్‌టిసిలో కూడా బస్ టెక్కెట్ ధర అలాగే నిర్ణయించాలి'' అని ఇటీవల టిఎస్‌ఆర్‌టిసి కార్యదర్శి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు చేపట్టిన ఎం.వెంకటేశ్వరరావు 'మన తెలంగాణ' ప్రతినిధితో చెప్పారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు డిమాండ్

19,400 సీట్లకు 56,089 దరఖాస్తులు

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు డిమాండ్ పెరుగుతోంది. ఇంగ్లీష్ మీడియం కావడంతో పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించే తల్లిదండ్రులు సైతం మోడల్ స్కూళ్లకు పంపించేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. మోడల్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికవుతుండటం, ట్రిపుల్‌ఐటిలోనూ ఎక్కువ మందికి సీట్లు లభించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ స్కూళ్లలో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. దాంతో మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం ఈ ఏడాది జనవరి 23 నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రారంభం కాగా, బుధవారం(ఈ నెల 28)తో దరఖాస్తు గడువు ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 19,400 సీట్లు అందుబాటులో ఉండగా, బుధవారం సాయంత్రం నాటికి 56,089 దరఖాస్తులు అందాయి. అంటే 1:3 నిష్పత్తిలో దరఖాస్తులు అందాయి.ఫీజు చెల్లింపుకు బుధవారం అర్థరాత్రి వరకు అవకాశం ఉండటంతో మరికొన్ని దరఖాస్తులు పెరిగే అవకాశ వుందని అధికారులు తెలిపారు.



ఏప్రిల్ 15న పరీక్ష

మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 15న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. 7,8,9,10 తరగతులకు అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగనుంది. మే 16 నుంచి 19 వరకు ప్రవేశాల జాబితా ఖరారు చేసి, మే 20 నుంచి ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు.

రాష్ట్ర హజ్ కోటా పెంచండి

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర హజ్ యాత్రీకుల కోటాను పెంచాలని రాష్ట్ర హజ్ కమిటి ఛైర్మన్ మొహమ్మద్ మసిఉల్లా ఖాన్ కేంద్ర మంత్రి నఖ్విని కోరారు. ఆయన బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ రాసిన లేఖను అందజేశారు. తెలంగాణ హజ్ కమిటీకి 17,130 హజ్ దరఖాస్తులు అందాయని అయితే రాష్ట్రానికి 4,066 కోటా మాత్రమే మంజూరైందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు.13,064 దరఖాస్తులను ఎంపిక చేయలేదని వివరించారు. యాత్రీకులు హజ్‌కు వెళ్ళేందుకు బేగంపేట్ విమానాశ్రయంలో సౌకర్యాలు ఉన్నాయని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బదులుగా బేగంపేట విమానాశ్రయాన్ని వినియోగించాలని కేంద్రమంత్రికి విన్నవించారు.

సిఎం హోలీ శుభాకాంక్షలు

మన తెలంగాణ / హైదరాబాద్ : హోలీ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కెసిఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంగుల పండుగను సంతోషంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఓఎంఆర్ షీట్లపై కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

ఓఎంఆర్ షీట్లను పరిశీలించాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఓఎంఆర్ షీట్లను అందుబాటులో ఉంచాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. కమిటీ టాప్‌లో ఉన్న అయిదు వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలించి నిబంధన మేరకు ఎన్ని ఉన్నాయో, సర్వీస్ కమిషన్ నిబంధనల్ని ఉల్లంఘించినవి ఎన్ని ఉన్నాయో తేల్చాలని న్యాయమూర్తి ఆదేశించారు. సర్వీస్ కమిషన్ రికార్డులను కూడా పరిశీలించాలని ఆదేశించారు. ఈ కమిటీ సమగ్రంగా పరిశీలించి పూర్తి నివేదికను అందజేయాలని కమిటీని ఆదేశించారు.తదుపరి విచారణను మార్చి 19వ తేదీ సోమవారానికి వాయిదా వేశారు.
తొలుత కేసు విచారణ ప్రారంభం కాగానే వైట్‌నర్ వాడరాదని సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్‌లో స్పష్టంగా ఉందని, అయినా వైట్‌నర్ వాడారని, అదే విధంగా బబ్లింగ్ జరిగిందని పిటిషనర్ న్యాయవాదులు చెప్పారు. వైట్‌నర్ వినియోగించిన జవాబు పత్రాల్ని కంప్యూటర్లు ఆమోదించవని చెప్పిన సర్వీస్ కమిషన్ ఆ తర్వాత వాటిని ఎలా ఆమోదించిందో అర్థం కావడం లేదన్నారు. చట్ట ప్రకారం హైకోర్టు తగిన ఆదేశాలిస్తే అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరుగుతుందన్నారు. 1032 పోస్టుల భర్తీ కోసం 1:3 నిష్పత్తిలో 3093 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోందన్నారు. అనంతరం అడ్వకేట్ జనరల్ ప్రకాష్‌రెడ్డి వాదిస్తూ.. ఓఎంఆర్ షీట్లను పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామంటే తమకు అభ్యంతరం లేదన్నారు. దాంతో కమిటీని ఏర్పాటు చేసిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను మార్చి 19వతేదీకి వాయిదా వేశారు.

452 కి.మీ... 18 వంతెనలు

- తీవ్రవాద ప్రభావిత జిల్లాల్లో రహదారుల అభివృద్ధి
- రూ.547 కోట్లు కేంద్ర నిధులు మంజూరు

మన తెలంగాణ / హైదరాబాద్ : తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పథకంలో భాగంగా రాష్ట్రానికి కేంద్రం రూ.547 కోట్ల నిధులను మంజూరు చేసిందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆర్ అండ్ బి ఇంజనీర్–ఇన్–చీఫ్, అధికారులతో ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ, ఇఎన్‌సిలు రవీందర్ రావు, గణపతి రెడ్డి, చీఫ్ ఇంజనీర్లు, అన్ని జిల్లాల పర్యవేక్షక ఇంజనీర్లు, క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మొత్తం 452 కి.మీ. నిడివి గల రహదారులను, 18 వంతెనలను కేంద్రం మంజూరు చేసిందని, వీటిలో కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలు ఉన్నాయన్నారు. మొదటి విడతగా కేంద్రం తన వాటాగా రూ.136.47 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ నిర్మిస్తున్న భవనాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాలలో శాసనసభ్యుల కార్యాలయం–వసతి నిర్మాణాలు మే నెల నాటికి పూర్తి కావాలని, పూర్తి అయినవాటికి తుది మెరుగులు దిద్ది ఉగాది నుండి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సమీకృత జిల్లా కార్యాలయ సముదాయాల నిర్మాణాలు వరవేగంగా రూపుదిద్దు కుంటున్నాయన్నారు. హైదరాబాద్‌లో శాసన సభ్యుల బహుళ అంతస్తుల వసతి సముదాయం నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లో వచ్చే మార్చి నెలకల్లా నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. జాతీయ రహదారుల నిర్వహణకు కేంద్రం ఇచ్చే నిధులు అరకొరగా ఉంటున్నాయని, నిర్వహణ గ్రాంటును పెంచేందుకు కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు కేంద్రం ప్రకటించిన 25 నూతన జాతీయ రహదారులకు 3,155 కి.మీ నిడివికి అదనంగా మరో 1,207 కి.మీ. నిడివి గల 11 రహదార్లను జాతీయ రహదారులుగా బదలాయించేందుకు కేంద్రానికి మంత్రి తుమ్మల అభ్యర్థించారు. అంతర్రాష్ట్ర అనుసంధాన పథకంలో భాగంగా రాష్ట్రానికి రూ.190.10 కోట్ల వరకు పథకాలు సిద్దం చేసి కేంద్ర మంత్రికి సమర్పించినట్లు తెలిపారు. రాష్ట్రం పెద్ద ఎత్తున చేపట్టిన రహదారుల విస్తరణ పథకంలో భాగంగా సుమారు 2,124.85 కి.మీ. నిడివిగల 290 పనులకు రూ.4,944 కోట్లు అంచనాతో శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వాటిలో 1,138.89 కి.మీ నిడివిగల 156 రహదారి విస్తరణ పనులు పూర్తి అయ్యాయని వాటి విలువ రూ.1,405 కోట్లు ఉందన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సుమారు 516 వంతెనలకు గాను 210 వంతెనల నిర్మాణం పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. మిగతా వంతెనల నిర్మాణం కూడా మే, జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

జయేంద్ర సరస్వతి శివైక్యం

మొదటిపేజీ తరువాయి)

పీఠానికి జయేంద్ర సరస్వతి సీనియర్ పీఠాధిపతిగా ఎన్నో సేవలందించారు. శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిగల్ నుంచి జయేంద్ర సరస్వతి 69వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. జయేంద్ర శివైక్యంతో ఆయన జూనియర్ అయిన విజయేంద్ర సరస్వతి తదుపరి కంచి పీఠాధిపతి కానున్నారు. 2520ఏళ్ల క్రితం ఆదిశంకరాచార్యుడు ఈ మఠాన్ని స్థాపించారు. 'బృందావన్ ప్రవేశ కార్యక్రమం (మహాసమాధి)'గా పిలుచుకోబడే అంత్యక్రియల తంతును గురువారం ఉదయం 8గంటల నుంచి ఆరంభిస్తామని మఠం అధికారిక ట్విటర్ ఖాతాలో వెల్లడించారు. భక్తుల దర్శనార్థం ఆయన పార్థీవ దేహాన్ని కంచి పీఠంలోనే ఉంచారు. ఉదయం నుంచే జయేంద్ర దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. జయేంద్రను జగద్గురుగా అభివర్ణిస్తూ భక్తులు కన్నీరుమున్నీరయ్యారు.

18వ ఏటనే సన్యాసం...

అభినవ శంకరులుగా పేరుగాంచిన జయేంద్ర సరస్వతి 1935, జులై 18న తమిళనాడులోని మన్నార్‌గుడి సమీపంలోని ఇరుల్‌నిక్కి గ్రామంలో జన్మించారు. అసలు పేరు సుబ్రహ్మణ్య మహాదేవ అయ్యర్. చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి అనంతరం 1954, మార్చి 24న కంచి పీఠానికి 69వ పీఠాధిపతిగా నియమితులయ్యారు. అనంతరం ఆయన పేరును జయేంద్ర సరస్వతిగా మార్చుకున్నారు. సనాతన ధర్మ పరిరక్షణలో జయేంద్ర సరస్వతిది ఓ స్వర్ణయుగంగా చెపుతుంటారు. చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి అడుగుజాడల్లో నడిచేందుకు 18వ ఏట సన్యాస ఆశ్రమం స్వీకరించిన జయేంద్ర సరస్వతి సమాజ అభ్యున్నతి కార్యక్రమాలు నిర్వహించాలని గట్టిగా విశ్వసించేవారు. ఆలయాలతో పాటు విద్యాలయాలు, వైద్యశాలలు అవసరమని భావించారు. దీంతో పాఠశాలల నుంచి వర్సిటీ వరకూ విద్యాభివృద్ధిలోనూ భాగస్వాములయ్యారు. నిరుపేదల కోసం పలు చోట్ల వైద్యశాలలను నెలకొల్పారు. వయోవృద్ధుల కోసం వృద్ధాశ్రమాలు, గోవుల రక్షణకు గోశాలలు ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా ఆలయాల నిర్వహణకు ఇతోధికంగా ఆర్థిక సాయం సైతం అందించారు. జయేంద్ర సర్వస్వతి స్వామి వారు తన సందేశాల ద్వారా ప్రజల్లో చైతన్య కాంతులు నింపారు. జయేంద్ర సరస్వతి నేతృత్వంలో కంచి పీఠం అనేక సామాజిక కార్యక్రమాలను చేపడుతోంది. ఆయన ఆధ్వర్యంలో కంచి పీఠం మరింతగా వృద్ధి చెందింది. మఠం ఆధ్వర్యంలో చెన్నైలోని శంకర నేత్రాలయ, అసోంలో శంకర దేవ నేత్రాలయ స్థాపించారు.



ప్రముఖుల సంతాపం...

జయేంద్ర సరస్వతి కన్నుమూయడంపట్ల రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఒక ప్రకటనలో సంతాపం వెలిబుచ్చారు. దేశం ఒక మంచి ఆధ్యాతికవేత్తను కోల్పోయిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. జయేంద్రను కోల్పోవడం తీవ్రంగా బాధించిందని మోడీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులను తన అడుగుజాడల్లో నడిచేలా చేశారని రాహుల్ ప్రశంసించారు. తమిళనాడు సిఎం పళనిస్వామితో పాటు వివిధ రాష్ట్రాల సిఎంలు, గవర్నర్‌లు జయేంద్ర మృతికి సంతాపం తెలిపారు.

జయేంద్ర సేవలను గుర్తు చేసుకున్న సిఎం కెసిఆర్

కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి నిర్యాణం పట్ల ముఖ్యమంత్రి కెసిఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చేసిన ఆధ్యాత్మిక సేవలను ఈ సందర్భంగా కెసిఆర్ గుర్తుచేసుకున్నారు. జయేంద్ర సరస్వతి అంత్యక్రియల్లో తెలంగాణ రాష్ట్రం తరపున అధికారికంగా పాల్గొనాలని దేవాదాయ శాఖ అధికారులను సిఎం ఆదేశించారు. ఈ మేరకు అధికారులు బుధవారం మధ్యాహ్నానికే కాంచీపురంకు బయలుదేరివెళ్ళారు.

కన్నీటి వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

మధ్య నటి శ్రీదేవి అంత్యక్రియలు ముగిశాయి. కనువిందు చేసే అందం కనుమరుగయింది. బుధవారం మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాల నడుమ, పోలీసు బృందాల గౌరవ వందనం మధ్య శ్రీదేవి అంతిమక్రియలు జరిగాయి. 54 సంవత్సరాల నటి శ్రీదేవి దుబాయ్‌లో ఓ విందుకు హాజరయ్యేందుకు వెళ్లి ఆకస్మికంగా మృతి చెందారు. అన్ని ప్రభుత్వ దర్యాప్తుల తరువాత, అనుమతి పత్రాల జారీ తరువాత శ్రీదేవి భౌతిక కాయం మంగళవారం రాత్రి ముంబైకి చేరుకుంది. బుధవారం ఉదయం నుంచే వీడ్కోలు విషాద పర్వం సాగింది. తొలుత నివాసంలో ప్రత్యేక ప్రార్థనలు తరువాత సెలబ్రేషన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో కడసారి సందర్శనకు భౌతికకాయం ఉంచిన తరువాత, అనుకున్నట్లుగానే మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో అక్కడి నుంచి అంతిమయాత్ర దాదాపు ఏడు కిలోమీటర్ల పొడవునా సాగింది. తరువాత విలే పార్లే హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. తుది కర్మకాండను భర్త, చిత్ర నిర్మాత బోనీ కపూర్ నిర్వహించారు. శోకతప్త హృదయాలతో శ్రీదేవి కుటుంబ సభ్యులు, సన్నిహితులు, పలువురు సాంకేతిక నిపుణులు రాకతో శ్మశానవాటిక విషాదభరితంగా మారింది. బాలనటిగా తెరను అలరించి తరువాత యువనటిగా , పరిణతి మహిళగా పలు పాత్రలలో నటించిన శ్రీదేవి జీవితంలో అత్యధిక భాగం సినిమా కెమెరాల ఫ్లాష్‌ల మధ్యనే గడిపారు. వెండితెర ఆమె మెట్టిల్లుగానే మారింది. భౌతికకాయపు వాహనం వెంబడి వేలాదిగా సాగిన ఊరేగింపు తరువాత అధికార లాంఛనాలతో శ్రీదేవి అంత్యక్రియలు జరిగాయి. ఇప్పుడు ఆమె పావురాల కళ్ల చిలిపి చూపులు, తిరిగిరాని నవ్వులే ఆమె ఆనవాళ్లుగా మారాయి.
2012లో సినిమా సూపర్‌స్టార్ రాజేశ్ ఖన్నా అంత్యక్రియల తరువాత ముంబైలో భారీ స్థాయిలో తరలివచ్చిన తుది వీడ్కోలుగా నిలిచింది. ముంబై జనసంద్రంగా మారింది. హీరోయిన్‌గా తన ప్రత్యేకతను చాటుకుంటూ శ్రీదేవి సూపర్‌స్టార్‌గా ఎదిగిన వైనానికి సాక్ష్యంగా మారిన ముంబై ఆమె అంతిమ సీన్‌కు వేదికగా నిలిచింది. కూతుళ్లు జాన్వి, కుషీలు తండ్రి వెంట నిలబడి ఉండగా శ్రీదేవి అంతిమ సంస్కారం జరిగింది. తరాల అంతరాలు లేకుండా అభిమానులను పొందిన నటి చివరికి నీలి ఎరుపు రంగు చితిమంటల్లో జ్వలించింది. అంత్యక్రియలకు ప్రముఖ నటులు అమితాబ్ బచ్చన్, జయాబచ్చన్, ఐశ్వర్యారాయ్ షారూక్ ఖాన్, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, రణదీర్ కపూర్, దక్షిణాది అగ్రనటులు రజనీకాంత్,కమల్‌హాసన్, చిరంజీవి , వెంకటేశ్ వంటి ఎందరో ప్రముఖులు, వారితో పాటు హేమామాలిని , రాణి ముఖర్జీ ఇతరులు ఎందరో అంతిమ క్షణాల ఘట్టానికి హాజరయ్యారు. అంతిమయాత్ర సమయంలో శ్రీదేవి భౌతిక కాయం శకటంపై త్రివర్ణ పతాకం ఉంచారు.
శ్రీదేవి నుదుటిన ఎర్రటి బొట్టు పెట్టారు. ఎరుపు రంగు కంచీవరం పట్టు చీర కట్టారు. దారిపొడవునా వేలాది అభిమానులను అదుపులో పెట్టడం పోలీసు బృందాలకు అసాధ్యంగా మారింది. శ్మశానవాటిక వద్దకు చేరుకోవడానికి ప్రముఖులు ఎందరో తమ వాహనాలను చాలా దూరంలో నిలిపి కాలినడక సాగించారు. ఏడు కిలోమీటర్ల దూరంలోని శ్మశాన వాటికను చేరుకోవడానికి రెండు గంటలు పట్టింది.
దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఎందరో ప్రజలు తమ అభిమాన నటిని కడసారి చూడలేకపోవడంతో ఉసూరుమన్నారు. ఎందరో అభిమానులు ఆమెకు దూరం నుంచే నివాళులు అర్పించి వెనుదిరిగారు.



విద్య, వైద్య రంగాలకు నిధులు వెచ్చించండి : కైలాశ్ సత్యార్థి

మన తెలంగాణ/ కరీంనగర్ టౌన్ : విద్య వైద్య ఆరోగ్యానికి ప్రభుత్వాలు నిధులు వెచ్చించాలని, దేశంలో ఎక్కడైనా ఎప్పుడైనాబాలలు పని చేస్తే ప్రతి ఒక్కరూ దాన్ని వ్యతిరేకించాలని నోబెల్ శాంతి బహుమతి అవార్డు గ్రహీత కైలాస్ సత్యార్థి అన్నారు. కరీంనగర్‌లో బుధవారం అంబేద్కర్ స్టేడియంలో జరిగిన బాల మిత్ర సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు దాటిన తరువాతనే వివాహము చేసుకోవాలని తెలిపారు. సర్వమతాల సారంశం ఒక్కటే పిల్లలు ఎప్పుడు సంతోషంగా వుంటే దేవుడు కూడా సంతోషిస్తాడని బాలల స్నేహ పూర్వక తెలంగాణ కోసం బాలలందరు సహకరించాలని అన్నారు. దేశంలోనే తొలి బాలల స్నేహ పూర్వక తెలంగాణ రాష్ట్రం కాబోతుందని అన్నారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాలలో కూడా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేసే విధంగా తెలంగాణ రాష్ట్రం కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ వంటి మంచి పథకాలుఎంతో దోహదపడుతున్నాయన్నారు. ప్రభుత్వాలు, విద్య వైద్యం, ఆహారం కోసం నిధులు ఖర్చు చేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖామాత్యులు ఈటెల రాజేందర్ మాట్లాడుతూ దేశం బాగుపడాలంటే ఆ శక్తి పిల్లల చేతిలో ఉందని చెప్పిన వ్యక్తి కలామ్ అని మంత్రి అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామ న్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం

- రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్న కెసిఆర్ కుటుంబం
- ఇంట్లో ఒకరికే పింఛనైతే మీ కుంటుంబంలో అందరికీ పదవులా..?
- ప్రజాచైతన్య యాత్రలో టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్

మన తెలంగాణ/ జహీరాబాద్ : తెలంగాణ ప్రజలు బాగుపడతారన్న ఉద్దేశంతో సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణను ఇస్తే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రజా పాలన వదిలి కుటుంబ సభ్యుల పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కు మార్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేసిన కెసిఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్ప దం తథ్యమని జోష్యం చెప్పారు. టిపిసిసి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజా చైతన్య బస్సు యాత్ర బుధవారం డివిజన్ కేంద్రమైన జహీరాబాద్‌కు చేరుకుంది. ఈ యా త్రకు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామాల నుంచి వేలాదిగా కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. స్థానిక ఎంఎల్‌ఎ డాక్టర్ జెట్టి గీతారెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, పొన్నాల లక్ష్మ య్య, రవీం ద్ర నాయక్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, మాజీ ఎంపిలు అజహరుద్దీన్, సురేశ్‌కుమార్ షెట్కార్, పొన్నం ప్రభాకర్, మల్లు రవి, సుదర్శన్‌రెడ్డి, ఎంఎల్‌ఎ రాంమోహన్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్‌లు మాజీ డిసిసిబి చైర్మన్ యం. జైపాల్ రెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మాయమాటలు నమ్మి కెసిఆర్‌కు పగ్గాలు అప్పగించిన తెలంగాణ ప్రజలు నమ్మిమోసపోయినట్లు తెలుసుకున్నారని, వచ్చే ఎన్నికల్లో తిరిగి అదే పొరపాటు చేయకుండా జాగ్రత వహించాలని సూచించారు. అటు కేంద్రంలో.. ఇటు రాష్ట్రంలో ప్రజలు ప్రభు త్వ పాలనతో విసిగిపోయారని, వచ్చే ఎన్నికల్లో రెండు చోట్ల ఆయా ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడం తథ్యమని జోష్యం చెప్పారు. కాంగ్రెస్‌కు కంచుకోట అయిన జహీరాబాద్‌లో తిరిగి గీతారెడ్డిని ప్రజలు గెలిపించడం ఖాయమన్నారు. తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి రాంచంద్ర కుంతియా మాట్లాడుతూ.. విద్యార్థుల బలిదానాలతో వచ్చిన తెలంగాణలో విద్యార్థులను ప్రభుత్వం విస్మరించడం దారుణమన్నారు. నిరుద్యోగ సమస్య తెలంగాణలో తాండవిస్తోందని వాపోయారు. మాజీ క్రికెటర్, మాజీ డిసిసిబి చైర్మన్ యం జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే జహీరాబాద్ ప్రాంతం అన్ని రంగల్లో అభివృద్ధి చెందిందని గుర్తుకు చేశారు. మాజీ మంత్రి షబ్బీర్‌అలీ మాట్లాడుతూ ఎన్నికల ముందు వాగ్దానాలు చేసిన ఏ హామిని కెసిఆర్ నెరవేర్చారో ప్రకటించాలని డిమాండ్ చేశారు.



ఎకరాకు రూ.4వేలు జిమ్మిక్కే

సంగారెడ్డి ప్రతినిధి : సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ప్రజా చైతన్య బస్సు యాత్ర కొనసాగుతున్న సందర్భంగా సంగారెడ్డిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల టిఆర్‌ఎస్ పాలనలో కెసిఆర్ ఏ ఒక్క హామీ కూడా నిలుపుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులు కట్టేది ప్రజలకు నీళ్ల ఇవ్వడానికి కాదని, కేవలం వారి జేబులు నింపుకోవడానికేనని అన్నారు. అన్ని వర్గాలను మోసం చేశారని. ఎకరాకు నాలుగు వేల రూపాయలు రైతులు ఇస్తాననడం ప్రస్తుతం రానున్న ఎన్నికల జిమ్మిక్కేనన్నారు. గత నాలుగేళ్ల కాలంలో ఈ పథకాన్ని ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రైతు సమన్వయ కమిటీలన్నీ టిఆర్‌ఎస్ పార్టీ అనుబంధ సంఘాలుగా ఉత్తమ్ పేర్కొన్నారు.



రాష్ట్రంలో కుటుంబ నిరంకుశ పాలన

మనతెలంగాణ/ హుజూరాబాద్ టౌన్ (కరీంనగర్ జిల్లా) : రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పాలన సాగడం లేదని, కుటుంబ పాలన సాగుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. సిపిఐ 21వ జిల్లా మహాసభల్లో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలను అరికట్టేందుకు సిపిఐని గ్రామగ్రామాన బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బిజెపి, టిఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజానిరంకుశ పా లనను సాగిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. బాల మల్లేశ్, సిపిఐ జిల్లా కార్యదర్శి కొమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, నాయకులు కాల్వ నర్సయ్య, అందె స్వామి తదితరులు ఉన్నారు.


రూ. 12లక్షల గుట్కా ప్యాకెట్లు పట్టివేత

మన తెలంగాణ/ జహీరాబాద్ : గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా దాచిన గుట్కా పాకెట్ల గుట్టును జహీరాబాద్ పోలీసులు రట్టు చేశారు. రాష్ట్రంలో అమ్మకాలను నిషేధించిన గుట్కా పాకెట్లను ఓ ఇంట్లో నిల్వ ఉంచారన్న విశ్వసనీయ సమచారం మేరకు బుధవారం జహీరాబాద్ పోలీసలు పట్టణంలోని శాంతినగర్‌లోని ఆ ఇంటిపై దాడి చేయగా రూ. 12లక్షల విలువ గల గుట్కా పాకెట్లు, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మహ్మద్ ఖాజాపాషా, మహ్మద్ ఖలీల్‌పాషాలను అదుపులోకి తీసుకున్నామని పట్టణ ఎస్సై సత్యనారాయణ వివరించారు. దాడిలో జహీరాబాద్ టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

హవాల వ్యాపారం చేస్తున్న వ్యక్తి అరెస్టు

మనతెలంగాణ/ కోరుట్ల (కరీంనగర్ జిల్లా): పట్టణంలోని టీచర్‌క్లబ్ రోడ్‌లో నివాస ముంటున్న చింతల సంతోష్(35) అనే వ్యక్తి కొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా విదేశీ కరెన్సీ మార్పిడి వ్యా పారం నిర్వహిస్తున్నాడు. సంతోశ్ హవాల వ్యాపారం చేస్తున్నట్లు జగిత్యాల ఎస్‌పి అనంతశర్మకు సమాచారం అందింది. ఎస్‌పి ఆదేశాల మేరకు కోరుట్ల సిఐ కె. సతీష్ చందర్‌రావు, ఎస్‌ఐ ఎమ్. రవికుమార్ ఆధ్వర్యంలో సంతోష్ ఇంట్లో సోదాలు నిర్వహించగా, రూ. 30,78,920 దేశీయ నగదుతో పాటు, రూ. 94,105ల విలువ చేసే విదేశీ నోట్లు దొరికాయని, వాటిని స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల కోసం డైరెక్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వారికి అప్పజెప్పినట్లు పోలీసులు వివరించారు.

40 ఎల్ఎస్‌డి బ్లాట్స్ పట్టివేత



మన తెలంగాణ/ ఎల్బీనగర్ : ఓ కారులో మత్తు మందు సరఫరా జరుగుతుందనే సమాచారం మేరకు బుధవారం ఉదయం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్ కె. పవన్‌కుమార్, సరూర్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీధర్ ఇతర అధికారులు కొత్తపేట్‌లో వాహనాల సోదాలు నిర్వహించారు. కొత్తపేట్ నాగోల్ ప్రధాన రహదారిలో చిన్నా బజార్ షాపు ముందు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా తెల్ల కలర్ మారుతి షిఫ్ట్ టిఎస్ 0 ఎస్ఇజె 4347 కారుగా అటుగా వేళుతుంది. అనుమానంతో ఆ కారును తనిఖీ చేయగా అందులో ప్రయాణిస్తున్న కోట అరవింద్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి 40 ఎల్ఎస్‌డి బ్లాట్స్ (మత్తు మందు) లభించింది. అరవింద్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు 40 ఎల్.ఎస్.డి. బ్లాట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్క ఎల్ఎస్‌డి బ్లాట్స్ ఆరుగురు వ్యక్తులకు మత్తు కలిగిస్తుందని తెలిపారు.

దళిత బాలికపై అత్యాచారం

ప్రాణాపాయస్థితిలో బాలిక

మన తెలంగాణ/ జైపూర్ (ఆదిలాబాద్ జిల్లా) : మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ముదిగుంట గ్రామంలో ఈనెల 19న 3వ తరగతి చదువుతున్న 7 సంవత్సరాల బాలికపై అదే గ్రామానికి చెందిన 40 సంవత్సరాల వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 19న గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా అదే గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థులు కార్యక్రమానికి చూడానికి వచ్చిన ఆ విద్యార్థినిని సమీపంలో గల ఇంటి పరిసారాల్లోకి తీసుకెళ్లి ఆఘాయిత్యానికి పాల్పడడంతో తీవ్ర రక్త శ్రావం కావడంతో బాలిక కేకలు వేయడంతో సదరు వ్యక్తి చంపేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. పరిశీలించిన వ్యక్తి బాలికను అతని నుండి విడిపించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో బాలికను హుటాహుటిన మంచిర్యాల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక ప్రాణపాయ స్థితిలో చికిత్స అందుకుంటుంది. ఈవిషయం బయటకు రాకుండా ఉండడానికి అదే గ్రామానికి చెందిన రాజకీయ నాయకులు కుటుంబ సభ్యులకు 50 వేల రూ పాయాలు ఇవ్వడానికి ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. బుధవారం స్థానికంగా ఈవిషయం బయటకు రావడంతో పోలీసులకు కూడా స మాచారం రావడంతో నిందితుని కోసం గాలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎస్‌ఐ ఆంజనేయులు, ఎఎస్‌ఐ గంగన్నలు నిందితుని కోసం గాలిస్తున్నారు.

బాసర ఆలయానికి నిధులు మంజూరు


మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రసిద్ధ బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాభివృద్ధికి సిఎం కెసిఆర్ రూ. 50 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల గృహ నిర్మాణ, న్యాయ దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని రెండవ సరస్వతి అమ్మ వారు కొలువు దీరిన బాసర ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు సిఎంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అక్షరాభ్యసం కోసం దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం, అక్షరాభ్యసం కోసం తరలివస్తున్న నేపథ్యంలో ఆలాయాభివృద్ధికి నిధులు కేటాయించాలని సిఎంను కోరిన వెంటనే నిధులు కేటాయించారని మంత్రి తెలిపారు. ఆలయా పనర్‌నిర్మాణ పనులపై త్వరలోనే ఆగమ శాస్త్ర పండితులతో చర్చించి మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తామన్నారు. యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ ఆలయాల తరహాలోనే బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిపై బాసరలో దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.


డిఎంఇలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఫలితాలు విడుదల

మనతెలంగాణ/ హైదరాబాద్ : డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డిఎంఇ) విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పోస్టుల ఫలితాలను టిఎస్‌పిఎస్‌సి విడుదల చేసింది. వివిధ సూపర్‌స్పెషాలిటిలకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించి 6 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపింది. న్యూరోసర్జరీ విభాగంలో ఇద్దరు, యూరాలజిలో ఇద్దరు, ప్లాస్టిక్ సర్జరీలో ఒకరు, ఎండోక్రినాలజిలో ఒకరిని ఎంపిక చేసినట్లు పేర్కొంది. ఎంపికైన అభ్యర్థుల వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

కొడంగల్‌లో ఉద్రిక్తత

- శంకుస్థాపన కార్యక్రమంలో తోపులాట
- శిలాఫలకం ధ్వంసం.. కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టు





మన తెలంగాణ/ మహబూబ్‌నగర్ జిల్లా : కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలం నందిగామలో బిటి రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో నెలకొన్న చిన్న వివాదం చిలికి చిలికి గాలివానలా మారింది. కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టుకు దారితీసిం ది. కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలం నందిగామ గ్రామంలో బిటి రోడ్డు శంకుస్థాపన కార్యక్ర మం బుధవారం ఉదయం 9.30 గంటలకు జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, పట్నం మహేందర్‌రెడ్డి, ఎంఎల్‌సి పట్నం నరేందర్‌రెడ్డి, ఎంఎల్‌ఎ రేవంత్‌రెడ్డి, స్థానిక సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి హాజరుకావాల్సి ఉండగా స్థానిక ఎంఎల్‌ఎ రేవంత్‌రెడ్డి ఉదయం 9.30 గంటలకే తన అనుచరులతో కలిసి కార్యక్రమం జరిగే స్థలానికి చేరుకున్నారు. 11.30 అవుతున్నా మంత్రులు, ఎంఎల్‌సి రాకపోవడంతో 'మంత్రు లు వస్తారా? లేదా తామే కార్యక్రమాన్ని ప్రారంభించా లా' అని పోలీసులను రేవంత్‌రెడ్డి ప్రశ్నించగా మరో పది నిమిషాల్లో మంత్రులు వస్తారని పోలీసులు సమాధానం చెప్పడంతో రేవంత్‌రెడ్డి మరోసారి వేచిచూశారు. అనంతరం సమయం గడిచిపోతున్నా మంత్రులు రాకపోవడంతో రేవంత్‌రెడ్డి స్థానిక సర్పంచ్, ఎంపిటిసి చేతుల మీదుగా బిటి రోడ్డు శంకుస్థాపన చేయించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో సిఐ శిలాఫలకంపై పడడంతో శిలాఫలకం ధ్వంసమైంది. వెంటనే అప్రమత్తమైన పోలీసు బలగాలు కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేశారు. ఆ తర్వాత నందిగామ గ్రామానికి చేరుకున్న మంత్రులు జరిగిన ఘటనపై స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిలాఫలకం ధ్వంసం అయిన ఘటనపై మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని టిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నాకు దిగారు.



అరుదైన శస్త్ర చికిత్సతో 5 కిలోల కణితి తొలగింపు

మన తెలంగాణ/ హైదరాబాద్/ హిమాయత్‌నగర్: సోమాలియా దేశం ఆర్గీస్ నగరానికి చెందిన ఖద్రో హుస్సేన్ అనే యువతికి వీన్ ఆసుపత్రిలో గర్భసంచిలో ఉన్న 5కిలోల కణతిని తొలగించడం జరిగిందని ఆసుపత్రి అంకో గైనకాలజిస్టు డాక్టరు శ్రీదేవి తెలిపారు. ఆమె విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంవత్సర కాలంగా ఖద్రోకు కడుపు నొప్పితో పాటు కడుపు పెరుగుతూ వస్తుందని తెలిపారు. పలు ఆసుపత్రులలో చూపించగా కడుపులో ఉన్న కణతి తొలగిస్తే గర్భసంచి కూడా తొలగించాలని వైద్యులు తెలియజేయడంతో యువతి భయాందోళనకు గురైందని తెలిపారు. కానీ తాము తగిన వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గర్భసంచికి ఎలాంటి ప్రమాదం లేకుండా అరుదై శస్త్ర చికిత్స ద్వారా కణతిని తొలగించడం జరిగిందని ఆమె తెలిపారు.

బస్సుయాత్రలో అలీబాబా దొంగల ముఠా

మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి : కాంగ్రెస్ నేతలు చేసే బస్సు యాత్ర అలీ బాబా దొంగల ము ఠాలా ఉన్నదని కెటిఆర్ ఎద్దేవ చేశారు. ఓటుకు నోటు కేసు లో దొరికిన చిల్లరదొంగ రేవంత్‌రెడ్డి, ఎన్నికల్లో డ బ్బులు పంచిన ఉత్తమ్‌కు మార్‌రెడ్డిలు నీతులు చె ప్పడం విడ్డూరమన్నారు. కాంగ్రెస్ నేతలు అంద రూ దొంగలే అని వారి బస్సు యాత్ర చూసి ప్రజ లు నవ్వుకుంటున్నారన్నారు. ఫ్లోరైడ్ పాపం ము మ్మాటికి కాంగ్రెస్ నేతలదేనన్నారు. కాంగ్రెస్ సిఎల్‌పి నేత జానారెడ్డి ఏనాడైనా ఫ్లోరైడ్ నిర్మూలానకు పోరాడలేదన్నారు. దశాబ్ధాల పాటు జిల్లాను పట్టి పీడించిన ఫ్లోరైడ్‌ను తరిమికొట్టేందుకే మిషన్ భగీరథ ప్లాంటును ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర ఐటి, పురపాలిక శాఖామంత్రి కె.తారకరామారావు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా మద్దిరాలలో జరిగిన తుంగతుర్తి ప్రగతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తుంగతుర్తిని సస్యశ్యామలం చేసి చూపిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం సిఎం కెసిఆర్ నాయకత్వంలో రైతే రాజు అయ్యాడని, 24 గం టల కరెంట్‌తో తెలంగాణ రాష్ట్రం వెలిగిపోతుందన్నారు. సూర్యాపేట జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని, తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు ఎర్రతివాచి పరిచి ప్రైవేటు రంగంలో లక్షల ఉద్యోగాలు సృష్టిస్తున్నామన్నారు.



తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ ఆశాకిరణం మంత్రి కెటిఆర్ అని రాష్ట్ర విద్యుత్, షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖా మంత్రి జి.జగదీష్‌రెడ్డి కొనియాడారు. నియోజకవర్గం ప్రజలు మరిచిపోయిన నేతలు మళ్లీ వస్తున్నారని, చింతమడక నుంచి తెలంగాణ రాష్ట్రంలోని 10వేల గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సభలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్యగౌడ్, తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిషోర్‌కుమార్, నకిరెకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బాలునాయక్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ సురేంద్ర కుమార్, టిఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.


యాదాద్రి హుండీ ఆదాయం రూ. 1.21 కోట్లు

మనతెలంగాణ/ యాదగిరిగుట్ట : శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం స్వామి వారి హుండి లెక్కింపు బుధవారం కొండపైన బాలాలయం ఆవరణలో జరిగింది. 36 రోజుల హుండి లెక్కింపులో 1కోటి 21 లక్షల 52వేల 850 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. గీత తెలిపారు. ఈ హుండి లెక్కింపులో 63గ్రాముల బంగారం, 3 కిలోల 400గ్రాముల వెండి భక్తుల నుండి కానుకల రూపంలో వచ్చినట్లు తెలిపారు. నిత్యారాబడిలో భాగంగా బుధవారం 6 లక్షల 26 వేల 396 రూపాయలు ఆదాయం రాగా.. ప్రధాన బుకింగ్ ద్వారా 59.556 రూపాయలు, అతిశీగ్ర దర్శనంలో 18300 రూపాయలు, వ్రతాలు 31000, కళ్యాణ కట్ట 13000 రూపాయలు, ఎంక్వైరీ 29840 ప్రసాదాలు 317610, టోల్‌గేట్ 2380 రూపాయలు, శాశ్వతపూజలు 31464, రూపాయలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వాటికి దూరంగా ఉండాలనుకుంటున్నా : రాధికా ఆప్టే



''ప్రత్యేక గీతాల్లో నటిస్తానే తప్ప ఐటమ్‌సాంగ్స్‌లో మాత్రం నటించను. ప్రత్యేక గీతాల్లో డ్యాన్స్ పర్ఫార్మెన్స్‌కు ప్రాధాన్యత ఉంటుంది. కానీ ఇప్పుడు వస్తున్న ఐటమ్‌సాంగ్‌ల ఉద్దేశమే మారిపోయింది''అని అంటోంది రాధికా ఆప్టే. ఇటీవల కాలంలో నూతన నటీనటుల దగ్గరినుంచి స్టార్ హీరోయిన్ల వరకు ఐటమ్‌సాంగ్స్‌లో నటించేందుకు అమితాసక్తి చూపిస్తున్న విషయం తెలిసిందే. బాలీవుడ్‌లో ఐశ్వర్యారాయ్, కరీనాకపూర్, కత్రినాకైఫ్, ప్రియాంకా చోప్రా... టాలీవుడ్‌లో తమన్నా, శ్రియా, ఛార్మి... ఇలా చాలా మంది స్టార్ హీరోయిన్లు ఐటమ్‌సాంగ్స్‌లో మెరిసి మెప్పించినవాళ్లే. స్పెషల్‌సాంగ్స్, ఐటమ్‌సాంగ్స్‌లో దేనికి ప్రాధాన్యమిస్తారని అడిగిన ప్రశ్నకు రాధికాఆప్టే సమాధానమిస్తూ... ''ఐటమ్‌సాంగ్స్‌లో మెరిసి మెప్పించిన తారలందరికీ నేను భిన్నంగా ఉండాలనుకుంటున్నాను. మనమేంటో నిరూపించుకోవడానికి ప్రత్యేక గీతాలు బాగా ఉపయోగపడతాయి. కానీ ఐటమ్‌సాంగ్స్‌లో అలాంటిదేమీ ఉండదు. పైగా ఇటువంటి గీతాల్లో నటించే తారలను పొట్టి దుస్తుల్లో మాత్రమే చూసేందుకు ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. అందుకే వాటికి దూరంగా ఉండాలనుకుంటున్నాను''అని చెప్పింది.



మహేష్‌బాబు

6న 'ది విజన్ ఆఫ్ భరత్'

సూపర్‌స్టార్ మహేష్‌బాబు, టాప్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'భరత్ అనే నేను'. శ్రీమతి డి.పార్వతి సమర్పణలో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దానయ్య డి.వి.వి. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలచేయనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన 'ది విజన్ ఆఫ్ భరత్'ను మార్చి 6న విడుదల చేయనున్నారు. మహేష్, కైరా అద్వాని, ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్ ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతంః దేవిశ్రీ ప్రసాద్, సినిమాటోగ్రఫీః రవి కె.చంద్రన్, ఎస్.తిరునవుక్కరసు, పాటలుః రామజోగయ్య శాస్త్రి, ఎడిటింగ్ః శ్రీకర్‌ప్రసాద్.



అతిలోక సుందరికి అశ్రు నివాళి



అనంతలోకాలకు వెళ్లిన అతిలోక సుందరి శ్రీదేవికి బాలీవుడ్‌తో పాటు దక్షిణాది సినీ ప్రముఖులు అశ్రు నివాళి అర్పించారు. ముంబయిలోని శ్రీదేవి స్వగృహానికి వెళ్లి ఆమె భౌతిక కాయం వద్ద సినీ ప్రముఖులు అంజలి ఘటించారు. సౌత్ స్టార్లు రజనీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, అర్జున్, ప్రకాష్‌రాజ్‌తో పాటు బాలీవుడ్ ప్రముఖులు హేమామాలిని, ఐశ్వర్యారాయ్, జయాబచ్చన్, టబు, సుస్మితాసేన్, మాధురిదీక్షిత్, దీపికాపదుకునే తదితరులు శ్రీదేవికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చిరంజీవి, నాగార్జున, వెంకటేష్‌లు శ్రీదేవితో తమ సినిమా జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆమె మరణంతో భారతదేశ చిత్ర పరిశ్రమ ఓ గొప్ప నటిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.





'దండుపాళ్యం 4' పోస్టర్‌ను విడుదల చేస్తున్న శ్రీకాంత్, వెంకట్, కె.టి.నాయక్

రెండు గ్యాంగ్‌లతో 'దండుపాళ్యం 4'

వెంకటేష్ మూవీస్ బ్యానర్‌పై కె.టి.నాయక్ దర్శకత్వంలో వెంకట్ నిర్మిస్తున్న చిత్రం 'దండుపాళ్యం 4'. ఈ సినిమా షూటింగ్ మార్చి 8న ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో నిర్మాత వెంకట్ మాట్లాడుతూ ''నేను నిర్మించిన దండుపాళ్యం పార్టు 1, పార్టు 2లను తెలుగు ప్రేక్షకులు ఆదరించారు. నా కృషితో ఈ రెండు సినిమాలను ప్రజలు ఆదరించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు దండుపాళ్యం 4 చిత్రాన్ని ప్రారంభిస్తున్నాం. ఇంటిలిజెంట్, హార్డ్‌వర్కర్ అయిన కె.టి.నా యక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఆయనకు క్రైమ్ జోనర్‌లో సినిమాలు చేయడమంటే చాలా ఇష్టం. ఈ సినిమాను ఆయన ఏవిధంగా తెరకెక్కించనున్నాడో చెప్పిన తీరు నాకు నచ్చింది. దండుపాళ్యం, బాహుబలి రెండు సినిమాల రేంజ్ వేరైనా ఈ రెండు సినిమాల సీక్వెల్స్‌కు మంచి క్రేజ్ వచ్చి ఘన విజయాన్ని సాధించాయి. ఇప్పుడు కసితో దండుపాళ్యం 4 చిత్రా న్ని ప్రారంభిస్తున్నాము. పక్కా స్క్రిప్ట్‌వర్క్‌తో ఈ సినిమా రానుంది. మార్చి 8న సినిమా షూ టింగ్ ప్రారంభంకానుంది. దండుపాళ్యం 4 చిత్రం లో రెండు గ్యాంగ్‌లుంటాయి. మొదటి మూడు పార్టులలో నటించిన నటీనటులతో పాటు వేరే గ్యాంగ్ కూడా ఇందులో కనపడుతుంది. యదార్థ ఘటనను ఆధారంగా చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. ఆసక్తికరమైన స్క్రీన్‌ప్లేతో సినిమా సాగుతుంది''అని అన్నారు. దర్శకుడు కె.టి.నాయక్ మాట్లాడుతూ ''నేను నిజామాబాద్ ఆర్మూర్‌లో పుట్టి పెరి గాను. కానీ తమిళనాడు, కర్నాటకల్లో స్థిరపడ్డాను. దండుపాళ్యం 4 చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాలని ప్లాన్ చేశాము''అని చెప్పారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ''దండుపాళ్యం సిరీస్‌లకు ఉన్న క్రేజ్ తెలిసిందే. ఇంతకుముందు విడుదలైన రెండు పార్టులు ఎంత పెద్ద సక్సెస్‌ను సాధించాయో అందరికీ తెలిసిందే. ఇందులో ఉన్న మంచి కంటెంట్‌ను ఆధారంగా చేసుకొని ఎన్ని పార్టులైనా చేయవచ్చు. నిజంగా జరిగిన సంఘటనల ఆధారంగా చేసిన సినిమాలు ఇవి. దండుపాళ్యం 4 పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను''అని తెలిపారు.



రాజ్‌తరుణ్ రిద్దికుమార్ అనీశ్‌కృష్ణ దిల్‌రాజు

ప్రేమలోని కొత్త కోణం 'లవర్'

తొలి చిత్రం 'ఉయ్యాల జంపాల'తో సక్సెస్‌ఫుల్ హీరోగా కెరీర్‌ను ప్రారంభించిన యువ కథానాయకుడు రాజ్‌తరుణ్. ఆతర్వాత కొన్ని విజయవంతమైన చిత్రాలతో ఈ యంగ్ హీరో ప్రేక్షకులను అలరించాడు. ఇప్పుడు రాజ్‌తరుణ్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మాణ సారథ్యంలో 'లవర్' సినిమాలో నటిస్తున్నాడు. 'అలా ఎలా?' వంటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో ఆకట్టుకున్న దర్శకుడు అనీశ్‌కృష్ణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ప్రేమలోని కొత్త కోణాలను టచ్ చేసేలా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రం ద్వారా రిద్దికుమార్ హీరోయిన్‌గా పరిచయమవుతోంది. సమీర్‌రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా, ప్రవీణ్‌పూడి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను జూన్ 14న విడుదల చేయడానికి నిర్మాత దిల్‌రాజు సన్నాహాలు చేస్తున్నారు.

రేపటి నుంచి థియేటర్లలో సినిమాల నిలిపివేత



ముత్యాల రామదాసు, దామోదర్ ప్రసాద్

మార్చి 2 నుంచి సౌతిండియా వ్యాప్తంగా ఉన్న థియేటర్లలో సినిమాల ప్రదర్శన నిలిపివేతకు దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు అధిక మొత్తంలో డిజిటల్ ధరలను వసూలు చేయడంతో నిర్మాతలు, పంపిణీదారులకు పెద్ద మొత్తంలో భారం తప్పడం లేదు. ఇప్పటికే పలుసార్లు డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల యజమాన్యాలతో దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ చర్చలు జరిపినా విఫలమవ్వడంతో సమరశంఖం పూరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఫిల్మ్‌ఛాంబర్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి ముత్యాల రామదాసు మాట్లాడుతూ ''మార్చి 2 నుంచి సినిమా థియేటర్లలో సినిమా ప్రదర్శనను నిలిపివేస్తున్నాం. రెండు నెలల నుంచి డిజిటల్ ధరలు భయంకరంగా పెంచేశారు. ఈ నేపథ్యంలో జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డి.సురేష్‌బాబు, కన్వీనర్ పి.కిరణ్ ఆధ్వర్యంలో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో పలు అంశాలపై జరిపిన చర్చలు విఫలమయ్యాయి. బుధవారం ఉదయం రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. ఆయన కూడా సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం తరపున ఎల్లవేళలా సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. మా పోరాటానికి ఏపి, తెలంగాణ రాష్ట్రాలలో ఉన్న అన్ని థియేటర్ల యాజమాన్యాలు పూర్తిగా మద్దతునిచ్చాయి. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, పంపిణీదారులు అంతా ఒకే తాటిపైకి వచ్చి పోరాటం చేయడానికి సిద్ధమయ్యాం. థియేటర్ల నిలిపివేత అన్నది ఎన్ని రోజులు కొనసాగుతుందో చెప్పలేం. మా పోరాటానికి ప్రేక్షకుల కూడా సహకరిస్తారని కోరుకుంటున్నాం''అని అన్నారు. తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ ఆఫర్ కామర్స్ డిజిటల్ కమిటీ ఛైర్మన్ దామోదర్‌ప్రసాద్ మాట్లాడుతూ ''డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో ఇప్పటివరకు జరిపిన సమావేశాల్లో మూడు అంశాలపై చర్చలు జరిగాయి. విపిఎఫ్ ఛార్జీలు కట్టేది లేదని, రెండు సినిమా యాడ్స్ మాకు ఇవ్వాలని, కమర్షియల్ యాడ్స్ 8 నిమిషాల నిడివికంటే ఎక్కువగా ఉండకూడదనే నిబంధనలను వాళ్ల ముందు ఉంచాము. దీనిపై జరిగిన చర్చలన్నీ విఫలమయ్యాయి. ఇక ఉపేక్షించేది లేదు. దక్షిణాది చలనచిత్ర పరిశ్రమల నుంచి పూర్తిగా మద్దతు లభించడంతో మార్చి 2 నుంచి థియేటర్లలో సినిమా ప్రదర్శనలను నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నాం''అని తెలిపారు.

అమెరికాలో 'గూఢచారి' సందడి



అడివి శేష్

'క్షణం' వంటి ట్రెండ్‌సెట్టింగ్ మూవీ అనంతరం అడివి శేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గూఢచారి'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నేతృత్వంలో అభిషేక్ పిక్చర్స్‌విస్టా డ్రీమ్ మర్చంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి శశికిరణ్ తిక్క దర్శకుడు. అడివి శేష్ ఈ చిత్రానికి కథ సమకూర్చగా... తెలుగమ్మాయి శోభిత ధూళిపాళ్ల కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం తాజా షెడ్యూల్ అమెరికాలో జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు అభిషేక్ నామా, టి.జి.విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని సరికొత్త కాన్సెప్ట్‌తో 'గూఢచారి' తెరకెక్కుతోంది. ఢిల్లీ, పూణే, హైదరాబాద్, కాకినాడ, రాజమండ్రి, వైజాగ్, చిట్టగాంగ్‌లలో చిత్రీకరణ జరుపుకున్న ఈ చిత్రం తాజా షెడ్యూల్ ప్రస్తుతం అమెరికాలోని కాస్కేడ్ మౌంటేన్స్‌లో జరుగుతోంది. అక్కడి అందమైన, అత్యద్భుతమైన లొకేషన్స్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ప్రస్తుతం కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. అడివి శేష్ ఈ చిత్రంలో ఒక స్పై పాత్రలో కనిపించనున్నారు. వేసవి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం''అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః షానిల్ డియో, సంగీతంః శ్రీచరణ్ పాకాల, మాటలుః అబ్బూరి రవి, ఎడిటర్ః గ్యారీ బి.హెచ్.



భారత్‌లో కాగ్నిజెంట్ 8000 ఉద్యోగాల కోత

న్యూఢిల్లీ: అమెరికా ఐటి దిగ్గజం కాగ్నిజెంట్ గతేడాదిలో భారత్‌లో భారీగా 8 వేల మంది వరకు ఉద్యోగులను తొలగించింది. అదే సమయంలో అమెరికా, యూరప్‌లలో ఉద్యోగులను సంఖ్యను పెంచింది. ఈమేరకు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు దాఖలు చేసిన వార్షిక వివరాల్లో కంపెనీ వెల్లడించింది. 2017 నివేదిక ప్రకారం మొత్తం కాగ్నిజెంట్‌లో 2.60 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారిలో భారత్‌లో సుమారు 1.8లక్షల మంది ఉన్నారు. అయితే 2016లో కంపెనీలో 2,60,200 మంది పనిచేస్తుండగా.. 2017 సంవత్సరంలో ఈ సంఖ్య 1.88 లక్షల మందికి తగ్గింది. అంటే దీని ప్రకారం గతేడాది కాగ్నిజెంట్ 8,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఆటోమేషన్ కారణంగా భారత ఐటీ కంపెనీలు ఉద్యోగాలను తొలగిస్తున్నట్లు సమాచారం. దీంతో పాటు సరికొత్త నైపుణ్యాలు, ప్రతిభావంతులకు ఐటీ కంపెనీలు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. 2017 సంవత్సరం ముగింపు నాటికి అమెరికాలో కాగ్నిజెంట్ ఉద్యోగులు 2900 పెరగ్గా, యూరప్‌లో ఈ సంఖ్య 2300 పెరిగింది

జిడిపి వృద్ధి రేటు 7.2%

• ఐదు త్రైమాసికాల గరిష్టం • చైనాను అధిగమించిన భారత్ వృద్ధి రేటు



న్యూఢిల్లీ: డిసెంబర్ ముగింపు నాటి త్రైమాసికంలో జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి రేటు 7.2 శాతానికి పెరిగింది. మూడో త్రైమాసికం(అక్టోబర్-డిసెంబర్)లో వ్యవసాయం, ఉత్పత్తి రంగం, నిర్మాణం, వివిధ సేవల్లో మెరుగైన పనితీరు వల్ల వృద్ధి రేటు పుంజుకుంది. మొత్తానికి ఐదు త్రైమాసికాల గరిష్టానికి చేరుకుంది. దీంతో వేగవంతంగా వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థగా చైనాను అధిగమించినట్టయింది. బుధవారం కేంద్ర గణాంకాల శాఖ(సిఎస్‌ఒ) వివరాలను విడుదల చేసింది. రైటర్స్ పోల్ నివేదిక ప్రకారం, డిసెంబర్ త్రైమాసికంలో భారత్ వృద్ధి రేటు 6.9 శాతంగా ఉంటుందని అంచనా వేయగా.. దీనిని మించి వృద్ధి రేటును సాధించింది. రెండో త్రైమాసికంలో 6.3 శాతంతో పోలిస్తే ఈసారి గణనీయమైన వృద్ధిని చూపింది. 2016–17 ఆర్థిక సంవత్సరం జులై –సెప్టెంబర్‌లో అత్యధికంగా 7.5 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. ఆ తర్వాత అంతటి స్థాయిలో జిడిపి నమోదవడం ఇదే.. 2017–18లో కన్స్‌టంట్ (2011–12) ధరల జిడిపి రూ.130.04 లక్షల కోట్లు నమోదైంది. 2016–17 తొలి సవరణ అంచనాలు రూ.121.96 లక్షల కోట్లతో పోలిస్తే పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. 2017–18లో జిడిపిలో వృద్ధి అంచనా 6.6 శాతంగా ఉండగా.. అంతకు ముందు 2016–17లో 7.1 శాతంగా ఉంది.

పలు రంగాల వృద్ధి రేటు ఇలా..

వివిధ రంగాల్లో వృద్ధి రేటును చూస్తే.. వ్యవసాయం, అటవీ, మత్స్యపరిశ్రమ (4.1 శాతం), మైనింగ్ అండ్ క్వారీ (0.1 శాతం), ఉత్పత్తి రంగం (8.1 శాతం), విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర వినియోగ సేవలు (6.1 శాతం), నిర్మాణం (6.8 శాతం), ప్రసార సేవలు, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్ (9.0 శాతం), ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసెస్' (6.7 శాతం), ప్రభుత్వ యంత్రాంగం, రక్షణ, ఇతర సేవలు (7.2 శాతం) ఉన్నాయి. 2017–18 క్యూ3లో వరుసగా గనులు, తయారీరంగం, విద్యుత్ సూచీలో వృద్ధి రేటు అంచనా 0.8 శాతం, 7.1 శాతం, 3.8 శాతంగా ఉంది.

కోలుకుంటోంది : మూడీస్

డీమానిటైజేషన్(నోట్ల రద్దు), జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) ప్రతికూల ప్రభావం నుంచి భారత్ ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం ప్రారంభించిందని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ పేర్కొంది. అయితే 2018లో దేశీయ జిడిపి వృద్ధి రేటు అంచనా 7.6 శాతంలో ఎలాంటి మార్పు ఉండబోదని తెలిపింది. 2018, 19 సంవత్సరాల్లో ప్రపంచ వ్యాప్తంగా వృద్ధి రేటు అంచనాలు ఏవిధంగా ఉంటాయనే అంశంపై మూడీస్ నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారమే భారత్ ఆర్థిక వృద్ధి పురోగమనంలో ముందుకు కొనసాగుతోందని తెలిపింది. 2018–19 ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా తీసుకున్న నిర్ణయాలు సానుకూలంగా ఉన్నాయని, దీని వల్ల పెద్ద నోట్ల రద్దు ప్రతికూల ప్రభావం నుంచి భారత ఆర్థిక వ్యవస్థను పుంజుకునేలా చేస్తోందని మూడీస్ అభిప్రాయం వ్యక్తం చేసింది. పెద్ద నోట్ల రద్దు నిర్ణయం, జిఎస్‌టి నిర్ణయాలు భారత్ వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపాయి. ఇప్పుడిప్పుడే వాటి నుంచి భారత ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం ప్రారంభించిందని మూడీస్ పేర్కొంది. గ్రామీణ, పట్టణాభివృద్ధి కోసం 2018 బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాలే అందుకు కారణమని వెల్లడించింది. దీంతోపాటు మొండి బకాయిల భారంతో సతమతమవుతున్న బ్యాంకులకు మూలధనం అందించడం వంటివి ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు దోహదం చేస్తున్నాయని మూడీస్ తెలిపింది.



నాలుగు నెలల కనిష్టానికి తయారీ రంగం వృద్ధి రేటు



ఫిబ్రవరి నెలలో తయారీ రంగం వృద్ధి రేటు నాలుగు నెలల కనిష్టానికి పడిపోయింది. కొత్త ఆర్డర్లు లేకపోవడం, తయారీదారులు ధరలు పెంచిన తర్వాత ఉత్పత్తిపై భారం పడడం వంటి ప్రతికూలంగా మారాయని నివేదికలో తేలింది. ఫిబ్రవరి నెలలో నిక్కీ తయారీ రంగం పిఎంఐ(పర్చేసింగ్ మేనేజర్స్ ఇండెస్) 52.1కు క్షీణించగా.. జనవరిలో ఇది 52.4గా ఉంది. కాగా, మూడో త్రైమాసికంలో(అక్టోబర్–డిసెంబర్)లో దేశీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగంగా ఉందని మోర్గాన్ స్టాన్లీ, రైటర్స్ పోల్ రెండు నివేదికలు అంచనా వేశాయి. ఏడాది – ఏడాది ఆధారంగా చూస్తే జిడిపి వృద్ధి రేటు 7 శాతానికి పెరగనుందని, అంతకుముందు సెప్టెంబర్ ముగింపు త్రైమాసికంలో 6.3 శాతంతో పోలిస్తే మెరుగవనుందని నివేదిక పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017–18) జులై–సెప్టెంబర్ త్రైమాసికంలో భారత్ జిడిపి 6.3 శాతం నమోదవగా, అంతకుముందు తొలి త్రైమాసికంలో 5.7 శాతంతో పోలిస్తే పెరిగింది. అయితే 2016 నవంబర్‌లో అనూహ్యంగా పెద్ద నోట్లను రద్దు చేయడం, అలాగే ఆందోళనల మధ్య 2017 జులైలో జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అమలు వంటి అంశాలు జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)కి ఆటంకంగా మారాయని నివేదికలు తెలిపాయి. పరిశ్రమ, సేవల రంగంలో వృద్ధి రేటు పెరగనుండగా, అదే సమయంలో వ్యవసాయ రంగంలో వృద్ధి క్షీణించనుందని నివేదిక పేర్కొంది.

రెండో రోజూ నష్టాలు

సెన్సెక్స్ 162 పాయింట్లు పతనం



న్యూఢిల్లీ: జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) గణాంకాలను వెల్లడించడానికి ముందు స్టాక్‌మార్కెట్లో తీవ్ర ఒడిదుడుకులు కనిపించాయి. బ్యాంకింగ్, మెటల్, క్యాపిటల్ గూడ్స్ షేర్ల అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో వరుసగా రెండో రోజు మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్ల పెంపు భయాలతో దేశీయ మార్కెట్ల సెంటిమెంట్ దెబ్బతింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 162.35 పాయింట్లు కోల్పోయి 34184.04 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ 61.45 పాయింట్లు నష్టపోయి 10492.85 వద్ద స్థిరపడింది. ఫిబ్రవరిలో దేశీయ తయారీ రంగం వృద్ధి రేటు 4 నెలల కనిష్టస్థాయికి పడిపోవడం ఇన్వెస్టర్లను నిరుత్సాహపర్చింది. ఓ దశలో సెన్సెక్స్ 34,076 నుంచి 34,303 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. కీలకమైన బ్యాంక్ నిఫ్టీ 276 పాయింట్లు (1.09 శాతం) నష్టపోయి 25,107.40 పాయింట్ల వద్ద ముగిసింది. ఐటి, పియుసి రంగాలకు చెందిన షేర్లు తప్ప మిగతా రంగాలకు చెందిన షేర్లన్నీ నష్టాలతో ముగిశాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీ రెట్లు పెంపుపై స్పష్టత రావడంతో అమెరికా మార్కెట్ల నష్టాల ముగింపు, ఆసియా మార్కెట్ నష్టాల ప్రారంభం వెరసి దేశీయ సూచీలు డీలాపడ్డాయి. దేశీ మార్కెట్లు భారీ నష్టాలతో ట్రేడింగ్ ప్రారంభించింది. ప్రధాన సూచీలైన సెన్సెక్స్ 191 పాయింట్లు పతనమై 34,155.63 వద్ద, నిఫ్టీ 56 పాయింట్ల నష్టంతో 10,488.95 వద్ద ప్రారంభమయ్యాయి. దేశీయంగా రూపాయి విలువ ఏకంగా 3 నెలల కనిష్టస్థాయికి కుదేలయ్యింది. దీంతో ఐటి రంగం మినహా అన్ని రంగాలకు చెందిన షేర్లు నష్టాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ప్రపంచ మార్కెట్ల ప్రభావంతో దేశీ మార్కెట్ నష్టాలతో ట్రేడ్ అవుతున్నా, ఐటి, పిఎస్‌యు బ్యాంక్ షేర్లు మార్కెట్ నష్టాలకు ఎదురీదాయి. నిఫ్టీ పిఎస్‌యు బ్యాంక్ ఇండెక్స్‌లోని ఒక్క బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు తప్ప మిగతా అన్ని షేర్లు లాభపడ్డాయి.

నూతన ఎస్‌బిఐ హబ్ ప్రారంభం



మన తెలంగాణ/హైదరాబాద్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా(ఎస్‌బిఐ) ఎక్స్‌క్లూజీవ్ వెల్త్ మేనేజ్‌మెంట్ హబ్ మొదటి వార్షికోత్సవంలో భాగంగా హై దరాబాద్‌లోని మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన 'ఎస్‌బిఐ నూతన హబ్'ను బుధవారం ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ జె. స్వామినాథన్ ప్రారంభించారు. ఇప్పటికే బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్, మియాపూర్, సికింద్రాబాద్, ఇసిఐఎల్, కోఠి, గన్‌ఫౌండ్రితో పాటు తాజాగా 8వ హబ్‌ను మాదాపూర్‌లో ప్రారంభించారు. ఇప్పటికే డిజిటల్ బ్యాంకింగ్‌లో ఎస్‌బిఐ ప్రసిద్ధి చెందిందని, మాదాపూర్‌లో ప్రారంభించిన నూతన హబ్ ద్వారా వినియోగదారులకు మరిన్ని మెరుగైన సేవలను అందించ నున్నట్లు ఎస్‌బిఐ ఒక ప్రకటనలో పేర్కొన్నది.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34184.04	–162.35	–0.47%
నిఫ్టీ	10492.85	–61.45	–0.58%

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29080	31101.60	–0.55%
ముంబై	30020	32106.95	0.2%
ఢిల్లీ	29650	31711.23	–0.5%
కోల్‌కతా	30190	32288.77	0%
కేరళ	28150	30106.95	–0.53%
బెంగళూరు	28500	30481.28	–0.7%
హైదరాబాద్	29010	31026.74	–0.65%
గల్ఫ్	1407.18	1505.00	–0.33%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	మంగళవారం	సోమవారం	మార్పు (%)
చెన్నై	41700.00	41600.00	0.24
ముంబై	41700.00	41600.00	0.24
ఢిల్లీ	41700.00	41600.00	0.24
కోల్‌కతా	41700.00	41600.00	0.24
హైదరాబాద్	41700.00	41600.00	0.24

కోడిగుడ్లు (100కు) నెక్ రేటు



హైదరాబాద్	355	విశాఖపట్నం	350
వరంగల్	357	చిత్తూరు	388
విజయవాడ	348	చెన్నై	395
గోదావరి	348	బెంగళూరు	385

ఎయిర్‌సెల్ దివాలా పిటిషన్



న్యూఢిల్లీ: కొంత కాలంగా నష్టాలతో సతమతువుతున్న మరో టెలికామ్ సంస్థ ఎయిర్‌సెల్ దివాలా పిటిషన్‌ను దాఖలు చేసింది. టెలికామ్ రంగంలోకి రిలయన్స్ జియో ప్రవేశించిన తర్వాత తీవ్రమైన పోటీ నేపథ్యంలో కంపెనీ లాభాలు గణనీయంగా పడిపోయాయి. నష్టాలు పెరగడంతో ఇక చేసేదేమీ లేక ఎయిర్‌సెల్ సంస్థ దివాలాకు సిద్ధమైంది. ఇప్పటికే రిలయన్స్ కమ్యూనికేషన్స్ తన కార్యకలాపాలను నిలిపివేయగా, తాజాగా ఎయిర్‌సెల్ కూడా ఇదే బాటలో ఉంది. ఐడియా వంటి సంస్థలతో ఇంటర్ కనెక్టివిటీ సదుపాయాన్ని తొలగించాయి. ఆయా కంపెనీలకు ఛార్జీల రూపంలో చెల్లించాల్సిన మొత్తం కట్టడంలో కంపెనీ విఫలమైంది. దీంతో ఎయిర్‌సెల్ నుంచి లక్షలాది మంది కస్టమర్లు నెంబర్ పోర్టబిలిటీతో ఇతర కంపెనీలకు మారిపోతున్నారు. ఇప్పుడు ముంబై ఎన్‌సిఎల్‌టి వద్ద ఎయిర్‌సెల్ దివాలా పిటిషన్ దాఖలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. జియో ప్రవేశించిన తర్వాత ఎయిర్‌టెల్, ఐడియా, వొడాఫోన్ హహా తగ్గిపోయింది. ఇంతకాలంగా టెలికామ్ రంగంలో మంచి లాభాలను పొందుతున్న ఈ సంస్థలు జియో దెబ్బతో ఇతర సంస్థలకు తీవ్రమైన పోటీ ఏర్పడింది. దీంతో ఇతర సంస్థలను కొనుగోలు చేయడం, సేవల్లో మార్పులు చేయడం ప్రారంభించాయి. ఆర్‌కామ్ సేవలను నిలిపివేయగా.. జియోనే వీటిని ఆస్తులను కొనుగోలు చేస్తోంది.

ఎస్‌బిఐకి షాక్

ఇప్పటికే ఇతర బ్యాంకుల రుణాల మోసాలతో సతమతమవుతున్న ఎస్‌బిఐకి మరో షాక్ తగిలింది. ఎయిర్‌సెల్‌కు ప్రస్తుతం అప్పుల భారం అధికంగానే ఉంది. రూ. 19వేల కోట్ల మేర అప్పులు ఉన్నట్టు సమాచారం.

అయితే దీనిలో అధిక శాతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎయిర్‌సెల్ దివాలా ప్రభావంతో గురువారం నాటి ట్రేడింగ్‌లో ఎస్‌బిఐ షేర్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొనవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

బంగారం ధర దిగివస్తోంది..



ముంబై: నాలుగు రోజులుగా పరుగులు పెడుతున్న బంగారం ధరకు బ్రేక్ పడింది. బుధవారం పది గ్రాములు పసిడి ధర రూ.460లు తగ్గి రూ.31,390కి చేరింది. డాలరు విలువ పెరగడంతో అంతర్జాతీయంగా లోహ వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో బంగారం ధర దిగివస్తోంది. అదే సమయంలో దేశీయంగా నగల తయారీదారుల నుంచి డిమాండ్ మందగించడంతో పసిడి ధర తగ్గినట్లు బులియన్ మార్కెట్ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయంగా బంగారం ధర 0.07శాతం తగ్గడంతో ఔన్సు 1,316.80 డాలర్లకు చేరింది. పసడి బాటలోనే వెండి పయనిస్తోంది. కిలో వెండి ధర రూ.250 తగ్గి రూ.39,300కి చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణెల తయారీదారుల నుంచి డిమాండ్ లేకపోవడంతో వెండి ధర తగ్గినట్లు మార్కెట్ వర్గాలు చెప్పాయి. గ్లోబల్ మార్కెట్‌లో వెండి 0.37 శాతం తగ్గి ఔన్సు 16.32 డాలర్లు అయింది.

డిపాజిట్ రేట్లను అర శాతం పెంచిన ఎస్‌బిఐ



న్యూఢిల్లీ: ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) రిటైల్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేటు అర శాతం మేరకు పెంచింది. డిపాజిట్లపై 50 బేసిస్ పాయింట్ల మేరకు వడ్డీ రేటును పెంచామని, ఇది బుధవారం నుంచి అమల్లోకి వచ్చిందని బ్యాంక్ ప్రకటించింది. దేశీయ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బిఐ రిటైల్ డిపాజిట్ల రేట్లను పెంచడంతో ఇతర బ్యాంకులు కూడా దీనిని అనుసరించవచ్చని భావిస్తున్నారు. ఎస్‌బిఐ తాజా ప్రకటనతో వివిధ ప్లాన్లకు 10 నుంచి 50 బేసిస్ పాయింట్ల పెరుగుదల ఉంటుంది. నాలుగు మెచ్యూరిటీ విధానాల్లో.. 7 రోజుల నుంచి 45 రోజుల వరకు, రెండేళ్ల నుంచి మూడేళ్ల లోపు, మూడేళ్ల నుంచి 5 ఏళ్ల లోపు, ఐదేళ్ల నుంచి పదేళ్ల లోపు వాటికి 50 బేసిస్ పాయింట్ల వడ్డీ రేటు పెరుగుతుంది. 7 నుంచి 45 రోజుల డిపాజిట్లపై వడ్డీరేటు 5.25 శాతం నుంచి 5.75 శాతానికి పెరుగుతుంది. వార్షిక వడ్డీ రేటు 6.40 శాతానికి పెరగ్గా.. ఇప్పటివరకు ఇది 6.25 శాతంగానే ఉంది. అలాగే 2 నుంచి 10 సంవత్సరాల మధ్య మెచ్యూర్ అయ్యే డిపాజిట్లపై 6.50 శాతం వడ్డీని అందించనుండగా.. ఇప్పటివరకూ ఇది 6 శాతంగానే ఉంది. అలాగే కోటి రూపాయలకు పైన డిపాజిట్లపై కూడా ఈ పెంపు వర్తిస్తుంది. సీనియర్ పౌరుల డిపాజిట్ల వడ్డీ రేట్లు 7 శాతం కానుండగా.. అంతకు ముందు 6.50 శాతంగానే ఉన్నాయి. ఈ సవరించిన వడ్డీరేట్లు కొత్త డిపాజిట్లకు , రెన్యూవల్ చేసుకునే డిపాజిట్లకు కూడా వర్తిస్తుందని ఈ మేరకు బుధవారం వెబ్‌సైట్‌లో ఎస్‌బిఐ ఒక ప్రకటన జారీ చేసింది. దీంతో రుణాలపై వడ్డీరేట్లను కూడా త్వరలోనే భారీగా పెంచనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరిలో ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) తన పాలసీ రేట్లను వరుసగా మూడోసారి యథాతథంగా కొనసాగించింది.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
ఇన్ఫోసిస్	1,189.50	1,142.55	1,172.60	1,150.20	22.40	1.95
యుపిఎల్	732.40	718.20	728.75	721.15	7.60	1.05
ఐచర్ మోటార్స్	27,599.00	26,511.00	27,437.75	27,154.65	283.10	1.04
ఎసియన్ పెయింట్స్	1,124.00	1,099.25	1,117.75	1,110.35	7.40	0.67
బిపిసిఎల్	430.85	424.15	429.55	426.95	2.60	0.61
భారతి ఇన్‌ఫ్రాటెల్	351.40	338.90	346.70	344.80	1.90	0.55
సిప్లా	596.60	587.10	589.65	586.50	3.15	0.54
ఐటిసి	381.20	373.50	379.30	377.45	1.85	0.49
హిందాల్కో	246.65	238.65	245.40	244.30	1.10	0.45
రిలయన్స్	957.10	943.20	954.55	950.50	4.05	0.43

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
వేదాంత	338.70	327.00	329.75	340.60	10.85	3.19
హెచ్‌పిసిఎల్	382.40	373.10	380.15	391.50	11.35	2.90
ఐసిఐసిఐ బ్యాంకు	317.00	311.10	313.25	322.15	8.90	2.76
హెచ్‌యుఎల్	1,338.50	1,311.00	1,317.75	1,346.35	28.60	2.12
ఇండియాబుల్స్	1,280.00	1,247.80	1,254.10	1,279.75	25.65	2.00
జీ ఎంటర్‌టైన్	573.90	564.20	565.35	576.50	11.15	1.93
యాక్సిస్ బ్యాంకు	536.50	520.00	528.75	538.40	9.65	1.79
బోస్క్	18,980.00	18,635.00	18,687.30	19,017.85	330.55	1.74
సన్‌ఫార్మా	552.35	532.65	535.35	544.80	9.45	1.73
ఎంఅండ్ఎం	734.95	725.10	728.35	739.80	11.45	1.55

పరిపాలన యంత్రాంగంలో మార్పులు : 30 మందికి స్థానచలనం



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం బుధవారం పరిపాలనా యంత్రాంగంలో భారీ స్థాయి మార్పులు చేర్పులు చేపట్టింది. ప్రధాని మోడీ భారీ స్థాయిలో దీనిని ప్రక్షాళన తరహాలో అమలు చేయడం కీలకంగా మారింది. అత్యున్నత స్థాయి పరిపాలనా యంత్రాంగంలో కార్యదర్శి స్థాయిలలో ఇప్పుడున్న వారికి స్థానచలనం కల్గించారు. కొత్త వారిని తీసుకున్నారు. కీలకమైన గనులు, పర్సనల్, పార్లమెంటరీ వ్యవహారాలు, పశు సంరక్షణ, ఉన్నత విద్యావిభాగాలకు కొత్త కార్యదర్శులను నియమించారు. గుజరాత్ అదనపు చీఫ్ సెక్రెటరీ (ఫైనాన్స్) అనిల్ ముఖీంను గనుల శాఖ కార్యదర్శిగా నియమించారు. తమిళనాడు కేడర్‌కు చెందిన సి చంద్రమౌళిని పర్సనల్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా నియమించారు. ఇరువురూ 1985 బ్యాచ్ ఐఎఎస్ అధికారులు. ఇక ఈ బ్యాచ్‌కే చెందిన మరో అధికారి రాఘవేంద్ర రావును కేంద్ర కెమికల్స్, పెట్రోకెమికల్స్ కార్యదర్శిగా తీసుకున్నారు. పార్లమెంటరీ వ్యవహారాల కార్యదర్శిగా ఎస్ఎన్ త్రిపాఠీని నియమించారు. ఇందర్ జిత్ సింగ్‌ను కేబినెట్ సెక్రెటరియేట్‌లో సమన్వయ విభాగానికి బదిలీ చేశారు. ఇక ఆర్ సుబ్రమణ్యంను ఉన్నత విద్యావిభాగం కార్యదర్శిగా నియమించారు. నియామకాల కేబినెట్ కమిటీ ప్రధాని అధ్యక్షతన భేటీ అయి తీసుకున్న నిర్ణయాల మేరకు ఉత్తర్వులను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ వారు బుధవారం వెలువరించారు.

మహాకూటమిలోకి మాంఝీ



పాట్నా : అధికార ఎన్‌డిఎ కూటమి నుంచి బీహార్‌లో హిందుస్థానీ ఆవామ్ మోర్చా (హెచ్ఎఎం) తప్పుకుంటున్నట్లు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జీతన్ రామ్ మాంఝీ ప్రకటించారు. అదే విధంగా ప్రతిపక్ష మహాకూటమిలో చేరుతున్నట్లు ఆయన వెల్లడించారు. అయితే మహాకూటమిలో ప్రస్తుతం ఆర్‌జెడి, కాంగ్రెస్‌లు ఉన్నాయి. కాగా, ఆర్‌జెడి నేతలు తేజస్వి యాదవ్, భోలా యాదవ్, తేజ్ ప్రతాప్ యాదవ్, ఇతర నాయకులు మాంఝీ నివాసంలో ఆయనతో సమావేశమైన అనంతరం వారి ఆధ్వర్యంలోనే మహా కూటమిలో చేరుతున్నట్లు బీహార్ మాజీముఖ్యమంత్రి ప్రకటన చేశారు. బుధవారం రాత్రే తాము అధికారికంగా మహాకూటమిలో చేరుతున్నట్లు మీడియాకు స్పష్టం చేశారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ విధానాలను ఎత్తి చూపుతున్న మాంఝీకి పితృ సమానుడైన మహాకూటమిలోకి వచ్చేందుకు ఆహ్వానం పలుకుతున్నట్లు రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్న తేజస్వి యాదవ్ పేర్కొన్నారు.

ముంబయిలో వడగాడ్పుహెచ్చరిక

ముంబయి: మహారాష్ట్రలోని ముంబయి, రాయిగఢ్, రత్నగిరిలో అసాధారణ రీతిలో వడగాడ్పులు వీస్తాయని బుధవారం భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ రెండు రోజులు పగటి ఉష్ణోగ్రత 38 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉందని, ఇది సాధారణం కంటే ఆరు డిగ్రీలు అధికమని పేర్కొంది. శుక్రవారం ఉష్ణోగ్రత 35 డిగ్రీలకు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. ముంబైతో సహా కొంకణ్ తీరానికి చెందిన వేర్వేరు ప్రాంతాలలో వేడిగాలులు వీస్తాయని ఐఎండి, పశ్చిమ ప్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కెఎస్ హోసలికర్ తెలిపారు.ఫిబ్రవరిలో ఇటువంటి అధిక ఉష్ణోగ్రతలు ముంబయికి అసాధారణం కావడంతో వడగాడ్పు హెచ్చరిక జారీ చేశామన్నారు. వడ గాడ్పులకు ముంబై వాసులు దూరంగా ఉండాలని, ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలని ఐఎండి శాస్త్రవేత్త అజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం ముంబయిలో పగటి ఉష్ణోగ్రత 37.8 డిగ్రీలు నమోదయ్యాయి. ఇది సాధారణం కంటే 5.7 డిగ్రీలు అధికమని అధికారులు తెలిపారు.

ఢిల్లీలో విద్యార్థినిపై 'హోలీ అకృత్యం'

న్యూఢిల్లీ: ఇక్కడ ఒక స్త్రీల కళాశాల విద్యార్థినిపై వీర్యంతో నింపిన బెలూన్‌ను హోలీ సందర్భంగా విసిరిన ఘటన జరిగింది. అది ఆమె నల్లటి లెగ్గింగ్‌పై పగిలి తెల్లటి చారికలను మిగిల్చింది. ఆ విద్యార్థిని సహచరి దానిని 'వీర్యం'గా గుర్తించింది. తర్వాత ఈ ఘటనపై లేడీ శ్రీరామ్ కళాశాల మహిళాభివృద్ధి విభాగం 40 మంది విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం జరిపింది. అటువంటి ఘటన ఇది మొదటిది కాదని ఆ సమావేశంలో బయటపడింది. ఈ ఘటనపై పోలీసు ఫిర్యాదు దాఖలు చేయకుండా విద్యార్థుల సంఘం, కళాశాల అధికార్లు ముఖతా పోలీసులకు తెలియపరిచారు. కాలేజి పరిసరాల్లో పోలీసులు గస్తీని పెంచారు. ఈ విషయంపై లిఖిత ఫిర్యాదు ఇవ్వాలని పోలీసులు సూచించారు. అవసరం వచ్చినప్పుడు పోలీసులను పిలవడానికి ఒక మొబైల్ నెంబర్ కూడా ఇచ్చారు. కాలేజి చుట్టూ ఉన్న పొదలను తొలగించారు. ఈ ఉదంతంపై విద్యార్థినులు మహిళల విభాగం డిసిపి ఈశా పాండేను కలిసి తమ ఆందోళన వ్యక్తం చేశారు.

సిబిఎస్ఇ టెన్త్ విద్యార్థులకు ఊరట

న్యూఢిల్లీ : సిబిఎస్ఇ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎగ్జామినేషన్) 10వ తరగతి విద్యార్థులకు బోర్డు పెద్ద ఊరట కల్పించింది. వచ్చే వారం జరగనున్న పరీక్షల్లో పాస్ మార్కులపై ఒకసారి సడలింపును కల్పిస్తున్నారు. విద్యార్థులు బోర్డు పరీక్షలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో కలిపి 33 శాతం మార్కులు తెచ్చుకుంటే చాలునని బోర్డు ఎగ్జామినేషన్ కమిటీ నిర్ణయం ప్రకటించింది. పాస్ కావడానికి విద్యార్థి విడిగా ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో కూడా 33 శాతం మార్కులు తెచ్చుకోనక్కన లేదు. బోర్డు పరీక్షకు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ఉమ్మడిగా 33 శాతం మార్కులు తెచ్చుకోవాలి. ఏడేళ్ల తర్వాత ఈ ఏడాది సిబిఎస్ఇ 10వ తరగతి పరీక్షలను తప్పనిసరి చేశారు.

అదనంగా 500 క్యాబిన్ సిబ్బంది



ముంబయి/ న్యూఢిల్లీ : కొత్త రెగ్యులేటరీ అవసరాల మేరకు 500 మంది క్యాబిన్ సిబ్బంది సభ్యులను ఎయిర్ ఇండియా త్వరలో తీసుకోనుంది. ఈ సంస్థలో పెట్టుబడుల ఉపసంహరణకు ఒక పక్క రంగం సిద్ధమవుతుండగా, మరో పక్క రెగ్యులేటరీ అవసరాలు తీర్చాల్సిన పరిస్థితి కలిగింది. నష్టాలతో నడుస్తున్న ఎయిర్ ఇండియాలో ప్రభుత్వ వాటాల విక్రయానికి పద్ధతులను రూపొందిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థకు రూ. 5,765.16 కోట్ల నష్టం వచ్చింది. విమానయాన రెగ్యులేటర్ పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డిజిసిఎ) సవరించిన నియమాల ప్రకారం కొత్తగా సిబ్బందిని తీసుకొంటారు. మరిన్ని విమానాలను కూడా చేర్చే ప్రతిపాదన ఉంది. ఎ 320 తరహా విమానాలను కొత్తగా ఎయిర్ ఇండియాలో చేర్చనున్నారు. అందుకే అదనపు క్యాబిన్ సిబ్బంది అవసరపడుతున్నారు. ఇటీవల చాలా మంది సంస్థను విడిచిపెట్టి పోవడంతో కూడా అదనపు క్యాబిన్ సిబ్బంది అవసరం ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వారిని తీసుకుంటారు. ఈ సంస్థ రుణ బకాయిల మొత్తం రూ. 48,447.37 కోట్లని అధికార్లు తెలిపారు.

జైలులో సైకో శంకర్ మృతి



బెంగళూరు: కర్నాటక,తమిళనాడులో భయోత్పాతం సృష్టించిన సైకో శంకర్ మంగళవా రం తెల్లవారు జామున బెంగళూరులోని పరపన అగ్రహార సెంట్రల్ జైలులో మరణించినాడు.అతడిపై'సైకో శంకర్' పేరుతో కన్నడంలో చలన చిత్రం కూడా రూపొందింది. కంఠం తెగిపోయి, రక్తపు మడుగులో పడివుండగా అతడి దేహాన్ని జైలు అధికార్లు కనుగొన్నట్లు తెలిసింది. అతడి అసలు పేరు ఎం జైశంకర్. ఈ నెల 25 న జైలు లోంచి పారిపోవడానికి అతడు ప్రయత్నించి విఫ లం అయ్యా డు. ట్రక్కు డ్రైవరయిన అతడు జైలులో ఒంటరి ఖైదు శిక్ష అనుభవిస్తున్నాడు. 2009 జూలై 3న ఒక స్త్రీని రేప్ చేసి చంపడానికి ప్రయత్నించడం అతడి తొలి నేరం. అతడు దాదాపు 30 రేప్, హత్యల కేసుల లో నిందితుడు.తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలలో దోపిడీ కేసు లు కూడా అతడిపై ఉన్నాయి. అతడికి మతి తప్పినట్లు 2011 మేలో వైద్య పరీక్షల్లో వెల్లడయింది.

ముంబయిలో అభిమాన జనసంద్రం

● శ్రీదేవిని కడసారి చూసేందుకు జనం బారులు ● అందాల నటికి తెల్లపువ్వులతో నివాళి

ముంబయి : సముద్ర తీరం ముంబై శోక జన సం ద్రం అయింది. దుబాయ్‌లో మృతి చెందిన ప్రముఖ నటి శ్రీదేవి అంతిమయాత్రకు వేలాదిగా జనం తరలివచ్చారు.బుధవారం తెల్లవారు జామునుంచే ముంబైలో శ్రీదేవి కడసారి చూపుల కోసం జనం బారులు తీరారు. ఎందరో ప్రముఖులు శ్రీదేవి నివాసానికి నేరుగా వెళ్లగలిగినా, వారి స్పందనను మించి రహదారుల వెంబడి వేలాదిగా నిలిచి ఉన్న శ్రీదేవి అభిమానుల మూగ ఆరాధన మిన్నగా మారింది. భారతీయ సినిమాకు ప్రతీకగా మారిన శ్రీదేవి అంతిమయాత్ర ముంబై వీధులలో అయిదారు కిలోమీటర్ల పాటు సాగింది. త్రివర్ణ పతాకం కప్పి ఉంచిన శ్రీదేవి అంతిమ యాత్ర శకటం వెంబడి వేలాది మంది నగరంలోని వీలే పార్లే ఖననవాటిక వైపు కదిలారు. అంతకు ముందు సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లో భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచినప్పుడు స్థానిక మహారాష్ట్ర పోలీసులు గౌరవ వందన సూచకంగా గాలిలో తుపాకులు పేల్చి గన్ శాల్యూట్ పాటించారు. మహారాష్ట్ర ప్రభుత్వం శ్రీదేవి పార్థివదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను ప్రకటించింది. భౌతిక కాయం ఉన్న శకటంలో భర్త బోనీకపూర్, స్టార్ అనిల్‌కపూర్ ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు. వాహనం కదలగానే దారిపొడువునా ఉన్న చెట్లపై, మేడలపై అభిమానులు నిలబడి శ్రీదేవిని కడసారి చూసేందుకు యత్నించారు. ఈ దశలో పలు చోట్ల ఉద్విగ్నభరిత వాతావరణం నెలకొంది. ముంబై జన సంద్రం అయిందని, ఏడు కిలోమీటర్ల మేర జనం కన్పించి నీరాజన ప్రభంజనం విన్పించిందని స్థానికులు తెలిపారు. భౌతిక కాయాన్ని హాల్ నుంచి తరలించే ముందు ప్రార్థనలు నిర్వహించారు.తెల్లటి పూలతో రథంగా అలంకరించిన అంతిమ శకటంలో ఎరుపు రంగు కంచీ పట్టుచీరతో దేవతగా అలంకరణతో ఉన్న శ్రీదేవి, నుదుటిపై నిండైన బొట్టు తో కన్పించడంతో బావురుమన్నారు.శ్వేత వాహనంపై శ్రీదేవి భారీ చిత్తరువును ఉంచారు. శ్రీదేవి అంతిమఘట్టం ఆమెకు ఇష్టమైన మల్లెలు, లిల్లీ పూలు, మోగ్రా, గులాబీల నేపథ్యంగా, పూలజల్లుల రోజుగా మారింది. అభిమానులు తమ చేతులలో తెల్లటి పూలు ధరించి ఉన్నారు. కొందరు ఆమె ఆత్మశాంతి కోసం ప్రార్థించడం, పాటలు పాడటం కన్పించింది. శ్రీదేవి అంతిమ రూపం అచ్చమైన తమిళ సాంప్రదాయపు స్త్రీగా తళుక్కుమంది. నవ్వుతూ నవ్విస్తూ ఉన్న ఆమె చివరి క్షణాలలో పోషించిన మౌనముద్ర శాశ్వతంగా గుర్తుండిపొయ్యేలా నిలిచింది. కుటుంబ సభ్యుల ఆవేదన భరిత వదనాల నడుమ శ్రీదేవి నివాసం గ్రీన్ ఏకర్స్ నుంచి ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనకు తరలించారు.స్పోర్ట్స్ క్లబ్‌లో మరిది అనిల్ కపూర్, సంజయ్ కపూర్,మేనల్లుడు హర్షవర్ధన్ కపూర్ ఇతరులు ఉన్నారు. వారి కళ్లలో కన్నీరు సుడులు తిరిగింది. విషాదభరితంగా ఎరుపెక్కి ఉన్న కళ్లతో భర్త బోనీ కుటుంబ సభ్యులతో ఒక మూలకు నిలిచారు.స్నేహితులు, సినిమా వర్గాల వారు కూడా తోడుగా ఉన్నారు. వరుసలో కొద్దిగా వెనకగా కూతుళ్లు జాన్వి, కుషీలు నిలబడి అమాయకంగా పరిసరాలను చూస్తున్నారు. ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా వెక్కివెక్కి రోదిస్తూ ఉండటంతో ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ ఓదార్చారు. జోహార్ కూడా కన్నీళ్లను అణచివేసుకోలేకపోయారు. భౌతికకాయం



వద్ద నటి రాణి ముఖర్జీ కూర్చుని ఉన్నారు. సోనమ్ కపూర్ ఇతరులను ఓదారుస్తూ కన్పించారు. విఐపిలకు, మీడియాకు, ప్రజలకు మూడు వేర్వేరు ప్రవేశ ద్వారాలను హాల్ బయట ఏర్పాటు చేశారు. ప్రజలను అదుపులో పెట్టేందుకు భారీ స్థాయిలోనే బందోబస్తు ఏర్పాటు అయింది. సాధారణ పౌరుల కోసం హాల్ గేట్లను ఉ. పది గంటలకు తెరిచారు. దీనితో చాందినీకి నివాళులు అర్పించేందుకు ఫ్యాన్స్ క్యూలలో నిలబడి ముందుకు సాగారు. తెలంగాణ, కర్ణాటక,తమిళనాడులకు చెందిన బృందాలు క్యూలలో నిలిచి అభిమాన నటికి నివాళుల వం తుకు వేచి చూసాయి. తాము ఆమెను కడసారిగా చూడనిందే ముంబై వీడి వెళ్లేది లేదని పలువురు అభిమానులు తమ స్పందన తెలియచేసుకున్నారు. దక్షిణాది సినిమా నటులు పలువురు ఈ హాల్ వద్దకు వడివడిగా నడుస్తూ వెళ్లడం కన్పించింది.










త్రిపురలో వామపక్షానిదే గెలుపు

ఆ ఎగ్జిట్ పోల్స్‌పై అనుమానాలున్నాయి : సురవరం



హైదరాబాద్ : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుందని రెండు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించిన ఫలితాలపై సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అనుమానాలు వ్యక్తం చేశారు. మళ్లీ వామపక్ష కూటమే అధికారాన్ని చేజిక్కించుకుంటుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. గతం లో కూడా బీహార్, ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ ప్రకటించిన ఫలితాలు తారుమారైన విషయాన్ని సురవరం గుర్తుచేశారు. తాజాగా ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ వెల్లడించిన ఫలితాలు కూడా తారుమారు కావచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బుధవారం సురవరం పిటిఐతో మాట్లాడారు. త్రిపురలో బిజెపి–ఐపిఎఫ్‌టి కూటమికి 51 శాతం ఓట్లు రావచ్చని ఒక ఎగ్జిట్ పోల్ ప్రకటించగా, మరొకటి అధికార లెఫ్ట్‌ఫ్రంట్‌కు 45–46 శాతం రావచ్చని పేర్కొందని, ఈ రెండింటికి మధ్య స్వల్ప తేడా మాత్రమే ఉందన్నారు. సి ఓటర్ ఎగ్జిట్ పోల్ ఫలితం లెఫ్ట్ ఫ్రంట్‌కు అనుకూలంగా ఉందని ఆయన చెప్పారు. త్రిపురలో 44.3 శాతం ఓట్లతో సిపిఐ(ఎం)కు 26 నుంచి 34 సీట్లు వచ్చే అవకాశముందని, బిజెపి 42.8 శాతం ఓట్లతో 24 నుంచి 32 సీట్లు గెలుచుకోనుందని సి ఓటర్ ఎగ్జిట్ పోల్ వెల్లడించిన విషయం తెలిసిందే. అలాగే కాంగ్రెస్ 7.2 శాతం ఓట్లతో రెండు స్థానాలను గెలుచుకోనుందని పేర్కొంది. అయితే త్రిపురలో బిజెపి విజయం సాధిస్తుందన్న దానిపై తాను ఆలోచించడం లేదని కానీ, వామపక్షం గెలుస్తుందన్న విశ్వాసంతో తామున్నామని సురవరం చెప్పారు. అక్కడి ప్రభుత్వంపై ఎక్కడో కొంతమందిలో వ్యతిరేకత ఉండవచ్చని అత్యధిక మంది సంతృప్తికరంగా ఉన్నారన్నారు. ఇదిలా ఉండగా, ఈనెల 18న 60 స్థానాలు ఉన్న త్రిపుర అసెంబ్లీలో 59 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. చార్లీలామ్ నియోజకవర్గం నుంచి సిపిఐ(ఎం) తరుపున బరిలోకి దిగిన రామేంద్ర నారాయణ్ దబే బర్మా మృతి చెందడంతో ఆ స్థానంలో ఎన్నికలు నిర్వహించలేదు. మార్చి 12న ఈ సీటుకు ఎన్నికలు జరగనున్నాయి.

ఎంపిలకు అలవెన్సుల పెంపు



న్యూఢిల్లీ: పార్లమెంట్ సభ్యుల అలవెన్స్ పెంపు ప్రతిపాదనకు బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. నియోజక వర్గ భత్యం, ఫర్నీచ ర్ భత్యం, కమ్యూనికేషన్ల ఖర్చులు గణనీయంగా పెరగనున్నట్లు ప్రభుత్వవర్గాలుతెలిపాయి. నియోజకవర్గ భత్యాన్ని రూ.45 వేల నుంచి రూ. 60 వేలకు పెంచేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతిపాదించింది. ఫర్నీచర్ అలవెన్సను ప్రస్తుతమున్న రూ.75వేల నుంచి లక్ష రూపాయలకు పెంచాలని పేర్కొంది.ద్రవ్యోల్బణం పరిగణలోకి తీసుకుని, ప్రతి ఐదేళ్లకోసారి ఎంపిల జీతాలను సవరించేందుకు శాశ్వ త యం త్రాంగాన్ని నియమించనున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఎంపిల మూల వేతనం నెలకురూ.50 వేలు కాగా, నియోజకవర్గ భత్యం రూ.45 వేలతోపాటు ఇతర భత్యాలు లభిస్తాయి. ఒక్కో ఎంపికి ప్రతినెల రూ. 2.7 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.


వేదాల తరువాతే న్యూటన్

న్యూఢిల్లీ : ఐజాక్ న్యూటన్ కన్నా మన వేదాలే మిన్న అని కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ సెలవిచ్చారు. భౌతిక శాస్త్రవేత్త సర్ ఐజాక్ న్యూటన్ గతి తార్కిక సూత్రం ఆవిష్కరించడానికి చాలా కాలం ముందే భారతీయ మంత్రాలలో దీని గురించి సమగ్రంగా క్రోడీకరించి ఉందని చెప్పారు. కేంద్రంలో మానవ వనరుల సహాయ మంత్రిగా ఉన్న సత్యపాల్ ఈ శాస్త్రీయ సత్యాన్ని ఏకంగా కేంద్రీయ విద్యా సలహా మండలి (సిఎబిఇ) సమావేశంలో అధ్యక్ష స్థానంలో ఉండి తెలిపారు. భారతీయుల మంత్రాలు మహత్తరమైనవని, అంతా అనుకుంటున్నట్లుగా న్యూటన్ గతితార్కికానికి ఆద్యులు కారని,అంతకుముందే వేదాలలో ఇది నిక్షిప్తం అయి ఉందన్నారు.

కార్తీ చిదంబరం అరెస్టు

● ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అదుపులోకి తీసుకున్న సిబిఐ ● చెన్నై నుంచి ఢిల్లీకి తరలింపు

చెన్నై/న్యూఢిల్లీ : ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంను బుధవారం సిబిఐ అరెస్టు చేసింది. ఐఎన్ఎక్ మీడియా కేసులో ఆయన అరెస్టు జరిగింది. లండన్ నుంచి చెన్నై విమానాశ్రయం చేరుకోగానే సిబిఐ ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసుకు సంబంధించి ఆయనను అరెస్టు చేసినట్లు సిబిఐ వర్గాలు ప్రకటించాయి. లండన్ నుంచి విమానంలో విమానాశ్రయం చేరుకోగానే అరెస్టు జరిగింది. వెంటనే విమానంలో ఢిల్లీకి తరలించారు. సిబిఐ ప్రధాన కార్యాలయానికి ఆయనను తీసుకువెళ్లి, అవసరమైన నిబంధనలను పూర్తి చేసి, వైద్య పరీక్షలు నిర్వహించారు. తరువాత సిబిఐ అనుబంధ కోర్టులో హాజరుపర్చారు. దర్యాప్తు సంస్థకు దేశం మొత్తంలో విచారణపరమైన నిర్వాహక అధికారం ఉండటంతో తాత్కాలిక రిమాండ్ ప్రక్రియను ఢిల్లీలో చేపట్టారు. కేంద్ర మంత్రిగా చిదంబరం ఉన్నప్పుడు కుమారుడు కార్తీ ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని సిబిఐ అభియోగాలు ఉన్నాయి. దీనికి సంబంధించి ఐఎన్ఎక్స్ మీడియాకు ఓవర్సీస్ నిధుల చేరవేతలో ఎఫ్ఐపిబి క్లియరెన్స్‌లో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణతో కేసు నమోదు అయింది. గత ఏడాది మే 15న కేసు దాఖలు చేశారు. 2007లో చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు రూ 305 కోట్ల మేర ఓవర్సీస్ నిధుల అక్రమాలు జరిగినట్లు సిబిఐ ఆరోపించింది. ఐఎన్ఎక్స్ మీడియాకు పన్నుల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కార్తీ తమ పలుకుబడిని వినియోగించారని ఇందుకు తగు ప్రతిఫలంగా రూ 10 లక్షల వరకూ పుచ్చుకున్నారని సిబిఐ కేసులో పేర్కొన్నారు. ఈ మీడియాకు అప్పట్లో పీటర్, ఇంద్రాణి ముఖర్జీ యజమానులుగా ఉండేవారు. ప్రస్తుతం వారు ఇంద్రాణి కూతురు షీనా బోరా హత్య కేసులో జైలులో ఉన్నారు. కార్తీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఇందుకు అనుగుణంగానే కార్తీ నివాసాలు, కార్యాలయాలపై సిబిఐ, ఇడిలు సోదాలు నిర్వహించాయి. పలుసార్లు విచారణ కూడా జరిగింది. ఈ పరిణామాల తరువాత ఇప్పుడు కార్తీని అరెస్టు చేశారు. దర్యాప్తుల క్రమంలో ఆయన విదేశాలకు వెళ్లకుండా సిబిఐ లుకౌట్ నోటీసులు జారీ చేసింది. అయితే కార్తీ తన కూతురు లండన్‌లో కేంబ్రిడ్జి వర్సిటీలో ప్రవేశం పొందాల్సి ఉందని, తండ్రిగా తాను వెళ్లాల్సి ఉందని సుప్రీంకోర్టులో



పిటిషన్ దాఖలు చేశారు. నవంబర్‌లో కార్తీ విదేశీ ప్రయాణానికి సుప్రీంకోర్టు అనుమతిని ఇచ్చింది. ఇప్పుడు తిరిగి రాగానే అరెస్టు జరిగింది. సిబిఐ విచారణ క్రమంలో కార్తీ అన్ని విధాలుగా సహకరిస్తున్నట్లు వెల్లడైంది. .

ప్రభుత్వ కక్ష సాధింపు : కార్తీ చిదంబరం అరెస్టుపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని పలువురు కాంగ్రెస్ నేతలు విమర్శించారు. మోడీ ప్రభుత్వ హయాంలో సాగుతోన్న స్కామ్‌ల నుంచి ప్రజలను పక్కదోవ పట్టించేందుకు సిబిఐ కావాలనే అరెస్టు చేసిందని మండిపడ్డారు. కార్తీ చిదంబరం అరెస్టును కాంగ్రెస్ నేతలు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, రణదీప్ సూర్జేవాలా ఖండించారు. ఇలాంటి అరెస్టులతో నిజాలను కప్పిపుచ్చలేరని, వాస్తవాలను తెలియచేస్తున్న కాంగ్రెస్‌ను అడ్డుకోలేరని నేతలు పేర్కొన్నారు. చిదంబరం ఆయన కుటుంబ సభ్యులపై వేధింపు చర్యలకు భయపడేది లేదని, మోడీ ప్రభుత్వ అవినీతి అక్రమాలపై ఎప్పటికప్పుడూ స్పందిస్తూనే ఉంటామని తెలిపారు. మరోవైపు ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో లెక్చర్ ఇచ్చేందుకు వెళ్లిన మాజీ మంత్రి చిదంబరం హుటాహుటిన తిరిగి స్వదేశం తిరిగిబయలుదేరారు. కుమారుడు కార్తీ అరెస్టు, ఢిల్లీలో విచారణకు తరలించిన విషయం గురించి తెలియగానే చిదంబరం తమ పర్యటనను కుదించుకున్నారు. తనను, తన కుటుంబాన్ని కేంద్రం రాజకీయ కక్ష సాధింపు చర్యలలో భాగంగా వేధిస్తోందదన్నారు.

కాంగ్రెస్ ప్లీనరీకి కమిటీల ఏర్పాటు

సంస్థాగత, ముసాయిదా, రాజ్యాంగ సవరణ కమిటీలను ఏర్పాటు చేసిన పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలు మార్చి 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం సంస్థాగత కమిటీని, ఒక ముసాయిదా కమిటీని ఏర్పాటు చేసి ముసాయిదా కమిటీని నాలుగు ఉప గ్రూపులుగా విభజించారు. అదే విధంగా రాజ్యాంగ సవరణ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ముసాయిదా కమిటీకి చైర్మన్‌గా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కన్వీనర్‌గా ముకుల్ వాస్నిక్, సంస్థాగత కమిటీకి చైర్మన్‌గా ఎఐసిసి కోశాధికారి మోతిలాల్ ఓరా, కన్వీనర్‌గా పార్టీ జనరల్ సెక్రెటరీ అస్కార్ ఫెర్నాండెజ్‌లు ఉంటారని ఒక ప్రకటనలో పార్టీ పేర్కొంది. రాజ్యాంగ సవరణ కమిటీకి పార్టీ సీనియర్ నేతలు గులామ్ నబీ ఆజాద్, జనార్దన్ ద్వివేదీలు చైర్మన్, కన్వీనర్‌గా, అహ్మద్ పటేల్, పి. చిదంబర్, మల్లికార్జున ఖర్గే, కపిల్ సిబాల్‌లతో సహా పది మంది సభ్యులుగా ఉండనున్నారు.అలాగే ముసాయిదా కమిటీలో సభ్యులుగా 44 మంది సీనియర్ నాయకులు ఉంటారు. ఈ కమిటీలో రాజకీయ, ఆర్థిక వ్యవహారాలు, అంతర్జాతీయ వ్యవహారాలు, వ్యవసాయ, ఉపాధి వంటి నాలుగు గ్రూపులు ఉంటాయి. రాజకీయ సబ్ గ్రూప్‌కు చైర్మన్‌గా ఎకె ఆంటోనీ, కన్వీనర్‌గా సెల్జా, ఆర్థిక వ్యవహారాల సబ్ గ్రూపుకు చైర్మన్‌గా చిదంబరం, కన్వీనర్‌గా జైరాం రమేష్, అంతర్జాతీయ వ్యవహారాల సబ్ గ్రూపుకు ఆనంద్ శర్మ చీఫ్‌గా, జ్యోతిరాదిత్య సింధియా కన్వీనర్‌గావ్యవహరించనున్నారు. అదే విధంగా వ్యవసాయ, ఉపాధి, పేదరిక నిర్మూలన సబ్ గ్రూపుకు హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా చైర్మన్‌గా, మీనాక్షి నటరాజన్ కన్వీనర్‌గా ఉండనున్నారు. 2019లో జరిగే సాధారణ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపట్టింది. ఈ ఏడాది కర్నాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున త్వరలో జరిగే ప్లీనరీ సమావేశాల్లో పార్టీ గెలుపునకు సంబంధించి ప్రణాళికలు రూపొందించనున్నారు. కాగా, రాహుల్ గాంధీ పార్టీ అధ్యక్షుడు అయిన తరువాత ఇవే మొదటి ప్లీనరీ సమావేశాలు.



సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకోవాలి : వెంకయ్యనాయుడు

మన తెలంగాణ/హైదరాబాద్ : అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. రాజేంద్రనగర్ లోని జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న 2017 బ్యాచ్‌కు చెందిన ఐపిఎస్‌లతో బుధవారం ఆయన హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డితో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, దేశంలో ఉగ్రవాదం, నక్సలైట్ల వల్ల శాంతి భద్రతలకు విపరీతమైన పరిణామాలు ఏర్పడుతున్నాయని, వాటిని నిరోధించడానికి అవసరమైన వ్యూహాత్మక ఎత్తుగడలతో పోలీసులు ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పోలీసు శాఖకు నాయకత్వం వహించే ఐపిఎస్‌లు మారుతున్న కాలానికి అనుగుణంగా ఎత్తుగడలు వేయడంలో ఆరితేరాలని పిలుపునిచ్చారు. శాంతి భద్రతలు సక్రమంగా ఉన్నప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దేశాభివృద్ధిని విచ్ఛిన్నం చేసేందుకు అసాంఘిక శక్తులు పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టడంలో పురోగతి సాధించాలని పిలుపునిచ్చారు. భద్రతపై ఎలాంటీ రాజీ వద్దని సూచించారు. దేశ అంతర్గత భద్రతకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ఐపిఎస్‌లపైనే ఉందన్నారు. మహిళలు, పిల్లలపై జరుగుతున్న నేరాలు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయని,ఇలాంటి నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, ఒడిషాలో బిజెడి విజయం

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలలో అధికార బిజెపికి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికలు జరిగిన ముంగవొలి, కోలారాస్ స్థానాలలో ప్రతిపక్ష కాంగ్రెస్ విజయం సాధించింది. గత వారం ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. కొలారాస్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి మహేంద్ర సింగ్ యాదవ్ తమ సమీప బిజెపి ప్రత్యర్థి దేవేంద్రకుమార్ జైన్ పట్టేవాలేను ఎనిమిదివేల ఓట్ల ఆధిక్యతో ఓడించారు. ఇక ముంగవొలి స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి బిజేంద్ర సింగ్ యాదవ్ బిజెపికి చెందిన బాయి సాహబ్ రావు దేశ్‌రాజ్ సింగ్ యాదవ్‌ను 2100 ఓట్ల తేడాతో పరాజితులను చేశారు. ఫిబ్రవరి 24న ఉప ఎన్కిలు జరిగాయి. ఈ ఏడాదే జరిగే మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజా నాడికి ఈ ఎన్నికల ఫలితాలు సూచిక అని భావిస్తున్నారు. అయితే ఇక్కడి సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మృతి చెందడంతోనే ఉప ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించడంతో ఇది గొప్ప విజయం కానేరదని బిజెపి ప్రకటించుకుంది. ఇక బిజెడి అధికారంలో ఉన్న ఒడిషాలో బిజెడి తన ఆధిక్యతను చాటుకుంది. బీజెపూర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలలో బిజెడి అభ్యర్థి రీతాసాహూ దాదాపు 24 వేల ఓట్ల ఆధిక్యతతో బిజెపి అభ్యర్థి అశోక్ పాణిగ్రహీని ఓడించి అధికార పార్టీ ప్రాబల్యాన్ని చాటారు.

నారాయణ స్కూల్స్ ఏకఛత్రాధిపత్యం

మనతెలంగాణ/హైదరాబాద్ : హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ జాతీయస్థాయిలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ మ్యాథమేటిక్స్ ఒలింపియాడ్ రెండవ దశ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల నుంచి స్కూల్ స్థాయిలో ఎంపికైన ఏకైక విద్యార్థిని వి.వి.సాయికీర్తన తమ సంస్థ విద్యార్థి కావడం గర్వకారణమని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారాయణ తెలిపారు. అలాగే ఇండియన్ నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ రెండవ దశ ఫలితాల్లో సి.యశ్వంత్ రెడ్డి, జి.సింధుజ, సి.హెచ్.తనూజలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో టాప్ మార్కులు సాధించారని పేర్కొన్నారు.అదేవిధంగా ఇండియన్ నేషనల్ ఆస్ట్రానమి ఒలింపియాడ్‌లో వి.సాయితేజ, ఎం.ఆదర్శ్‌రెడ్డి మంచి మార్కులు సాధించారన్నారు.వీరందరూ ముంబయిలో జరిగే ఓరియెంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్‌కు హాజరవుతారని తెలిపారు. ఈసందర్భంగా ఘనవిజయం సాధించిన విద్యార్థులనునారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునిత్ ప్రత్యేకంగా అభినందించారు.

ఆగాఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోల్కొండ కోటను అభివృద్ధి చేయండి



మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గోల్కొండ అభివృద్ధికి కృషి చేస్తున్నదని ఉపముఖ్యమంత్రి మహమ్మద్ మహమూద్ అలీ అన్నారు. హైదరాబాద్‌లోని ఫలక్‌నూమా ప్యాలెస్‌లో బుధవారం ఆగాఖాన్ ట్రస్ట్ సంస్థ ఛైర్మన్ ఆగాఖాన్‌తో మహమూద్ ఆలీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగాఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టోలిచౌక్‌లోని సెవెన్ టూంబ్స్ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. గోల్కొండ కోటను కూడా ఆగఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని ప్రిన్స్ ఆగాఖాన్‌ను మహమూద్‌అలీ కోరగా ఆయన అందుకు సానుకూలంగా స్పందించినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

అవుటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం

కారు దగ్ధం, వ్యక్తి మృతి



మన తెలంగాణ / ఘట్‌కేసర్(మేడ్చల్ జిల్లా) : అతివేగంగా ప్రయాణిస్తున్న బెంజి కారు ఢీవైడర్‌ను ఢీ కొట్టి మృతి చెందాడు. కారు పూర్తిగా కాలి బూడిదైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం, ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో శ్రీనిధి కళాశాల వెనక అవుటర్ రింగురోడ్డు పై ప్రమాదం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చేందిన వెగశ్న శ్రీరామరాజు(31) తన బెంజి కారు (ఏపీ37 సిఎఫ్ 6777)లో అవుటర్ రింగురోడ్డు పై వేగంగా ప్రయాణిస్తుండగా అదుపుతప్పి ఢీవైడర్‌ను ఢీ కొంది. దీంతో కారు మూడు పల్టీలు కొట్టడంతో కారులో నిప్పంటుకుంది. అది గమనించిన ఇతర వాహనదారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చెరుకుని తీవ్ర గాయాలకు గురైన శ్రీరామరాజును ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కారుకు నిప్పంటుకున్న బెంజి కారును ఫైర్ ఇంజన్ సహాయంతో ఆర్పివేశారు. మృతుడు నగరంలో ఉన్న అతని సోదరున్ని కలిసి తిరిగి వెళ్లుచుండగా ప్రమాదం జరిగినట్లు తెలిపారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు, భీమవరంలో వ్యాపారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని బందువులకు అప్పగించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

ప్రామాణిక కొలతల కోసం ఫ్యాషన్ సంస్థ సర్వే

న్యూఢిల్లీ : దేశంలో ప్రజలందరకు సరిపోయే కొలతల్లో బట్టల తయారీకి జాతీయ ఫ్యాషన్ టెక్నాలజి సంస్థ (ఎన్ఐఎఫ్‌టి) జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో త్వరలోనే జాతీయ స్థాయి సర్వేను జరుపుతుంది. ప్రామాణిక 'సైజ్ చార్ట్' రూపొందించడానికి ఈ సర్వేలో హైటెక్ త్రిడి బాడీ స్కానర్లను ఉపయోగించి 25,000 మంది ప్రజల కొలతలు తీసుకుంటారు. ఈ 'జాతీయ సైజింగ్ సర్వే'కు దాదాపు రూ. 30 కోట్లు ఖర్చు అవుతుంది. ఆరు నగరాల్లో 15–65 ఏళ్ల వయస్సుగల వారిని సర్వే చేస్తారు. సమాన సంఖ్యలో స్త్రీ, పురుషులను సర్వే చేస్తారని ఎన్ఐఎఫ్‌టి డైరెక్టర్ జనరల్ శారదా మురళీధరన్ చెప్పారు. రెండుమూడేళ్ల వ్యవధిలో ఈ సర్వే సాగుతుందని ఆమె తెలిపారు. ప్రజల దుస్తుల కోసం కొలతలతో డేటా బేస్‌ను కూర్చుతారు. ఆ సమాచారం నుంచి ప్రామాణిక కొలతలను నిర్ణయించి ఇండియా సైజ్ చార్ట్ రూపొందిస్తారు. భారతీయ జనాభాకు సరిపోయే కొలతల్లో దుస్తుల తయారీ కోసం జౌళి పరిశ్రమ ఈ చార్ట్ ఎంతో ఉపకరిస్తుంది. మొత్తం దుస్తుల తయారీ పరిశ్రమ ఈ కొలతల ఆధారంగా ఉత్పత్తి సాగించే వీలు ఏర్పడుతుందని ఈ ప్రాజెక్టు ఉన్నతాధికారి ప్రొఫెసర్ నూపూర్ ఆనంద్ తెలిపారు.

అతిపెద్ద విమానం అడుగులు...



ప్రపంచంలోనే అతిపెద్ద విమానం అడుగులు వేసింది. స్ట్రాటో లాంచ్ పేరుతో తయారైన ఈ విమానాన్ని 2011లో పాల్ జీ అలెన్ తయారు చేశారు. గగనంలో మరింత చౌకగా, సౌకర్యవంతంగా, నిరంతరం విహరించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. అతిపెద్ద విమానంగా భావిస్తున్న స్ట్రాటో లాంచ్ క్షేత్రస్థాయి పరీక్షలకు సిద్ధం అవుతోంది. దాదాపు గంటకు74కిలోమీటర్ల వేగంతో రన్‌వేపై పరుగులు తీయనుంది.గతేడాది ఈ ఎయిర్‌క్రాఫ్ట్ 45 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీసింది. అయితే సాంకేతిక కారణాలతో పరీక్షలు చాలా ఆలస్యం అవుతున్నాయి. ఈ లోహ విహంగం 72.5 మీటర్ల పొడవు, అత్యంత బరువు ఉండటమే ఆలస్యానికి ప్రధాన కారణాలుగా చెప్తున్నారు.

రైతన్నకు సకల వసతులు

- మాతా అమృతానందమయి ఆకాంక్ష
- ఆశీర్వాదం తీసుకున్న మంత్రి హరీష్‌రావు



మన తెలంగాణ/ హైదరాబాద్ : అందరికీ అన్నం పెట్టే రైతన్నకు అవసరమైన అన్ని వసతులు సమకూర్చడం సమాజం బాధ్యత అని, ఈ బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం గొప్పగా నెరవేరుస్తున్నది అమ్మగా అభిమానం పొందిన సద్గురు శ్రీ మాతా అమృతానందమయి దేవి ప్రశంసించారు. సముద్రం పాలవుతున్న నీటిని కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల ద్వారా పొంట పొలాలకు తరలించడం మంచి ప్రయత్నమని అభినందించారు. అందరికీ అన్నం పెట్టే రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి పూర్తిగా మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. భారతదేశ యాత్రలో భాగంగా తెలంగాణలో పర్యటిస్తున్న అమ్మ బుధవారం సికింద్రాబాద్ లోని మాతా అమృతానందమయి మఠం (అమ్మఆశ్రమం)లో భక్తులకు దర్శనమిచ్చి, ఆశీర్వచనం అందచేశారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మతానికి వెళ్లి అమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. తెలంగాణలో ప్రాజెక్టులు త్వరగా పూర్తయి, రైతులకు సాగునీరు అందేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆమె తెలంగాణ నీటి పారుదల ప్రాజెక్టుల గురించి ఆసక్తిగా అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకాల గురించి, మిషన్ కాకతీయ గురించి, తెలంగాణలో వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను హరీష్ రావు వివరించారు. దీనికి ఆమె స్పందిస్తూ రైతన్నలకు అందరూ అండగా ఉండాలని, రైతుకు కావాల్సిన నీరు మనం ఇస్తే, మనకు కావాల్సిన అన్నం రైతు ఇస్తాడని సద్గురు శ్రీ మాతా అమ తానందమయి దేవి అన్నారు. కానీ దేశంలో రైతుల పరిస్థితి బాగా లేదని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు తాము ఆర్థిక సహాయం అందిస్తున్న విషయాన్ని ఆమె తెలిపారు. తమ మఠం నుంచి అందరికీ మంచి ఆరోగ్యం, మంచి వైద్యం అందించడం,పరిశుభ్రమైన వాతావరణంలో జీవించడం కోసం అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. దేశ వ్యాప్తంగా అనేక గ్రామాలను దత్తత తీసుకుంటున్నట్లు వివరించారు. తెలంగాణలో కూడా 20 గ్రామాలను దత్తత తీసుకుంటానని వెల్లడించారు. తెలంగాణలో ప్రతీ ఇంటికి సురక్షిత మంచినీరు అందించేందుకు మిషన్ భగీరథ పథకం అమలు చేయడం మంచి నిర్ణయమన్నారు. బహిరంగ మల విసర్జన లేని ప్రాంతంగా సిద్దిపేట నియోజకవర్గం చరిత్రలో నిలిచిందని, తెలంగాణ అంతటా ఇదే ఒరవడి కొనసాగాలని, దేశానికి ఆదర్శంగాహా నిలవాలని సూచించారు. ప్రజలకు మంచి విద్య, వైద్యం అందించడానికి పాలకులు కృషి చేయాలని చెప్పారు.

సత్యమార్గం, శాంతి మార్గమే ప్రధానం: హరీశ్ రావు

మాతా అమ తానందరమయి మఠం సందర్శించిన సందర్భంగా హరీష్ రావు అక్కడి భక్తులతో మాట్లాడారు. ఇప్పుడు సమాజానికి కావల్సింది శాంతి మార్గం, సత్య మార్గమే అన్నారు. ఈ సన్మార్గాన్ని అందిస్తున్నందునే సద్గురు శ్రీ మాతా అమ తానందమయ దేవిని దేశమంతా అమ్మగా పిలుస్తున్నదన్నారు. ఆమె మానవత్వమే దైవత్వంగా కొనియాడబడుతున్నద న్నారు. అమ్మ చేసిన సేవ, అమ్మ చూపిస్తున్న ప్రేమ మానవ జాతికి మంచి సందేశమన్నారు. వత్తిడీని జయించడానికి శాంతి, సహనం ఎంతో ప్రధానమన్నారు. తోటి మానవుడి హితం కోరి చేసే పనులే మనల్ని చరితార్థులను చేస్తాయన్నారు. ఈ దిశగా సమాజంలో పరివర్తన తేవడానికి అమ్మ చేస్తున్న కృషి తప్పక ఫలిస్తుందని హరీశ్ అన్నారు.

కిసాన్ భవన్‌లకు నిధులు

- కందులను కొనుగోలు చేయండి
- కేంద్రమంత్రి రాధామోహన్‌కు పోచారం విజ్ఞప్తి



మనతెలంగాణ/న్యూఢిల్లీ: తెలంగాణలో అధికంగా దిగుబడి అయిన కందులు కొనుగోలు చేయాలని, కిసాన్ భవన్‌లకు నిధులు కేటాయించాలని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం, కేంద్రమంత్రి రాధామోహన్ సింగ్ కి విజ్ఞప్తి చేశారు. బుధవారం మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్‌ను ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగాజిల్లాకొక కేవీకేల(కిసాన్ వికాస కేంద్రాలు)ను మంజూరు చేయాలని, హార్టికల్చర్ యూనివర్సిటీకి మరిన్ని నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి రాధామోహన్ సింగ్ ని కోరారు. బుధవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్ అధ్యక్షతన భారత వ్యవసాయ పరిశోధన మండలి 89వ వార్షిక సమావేశం దేశ రాజధాని ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ తరపున ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. తెలంగాణ తరపున సమావేశంలో మంత్రి పోచారం పలు సూచనలు చేసారు. అనంతరం కేంద్ర వ్యవసాయ మంత్రితో జరిగిన భేటీలో భాగంగా రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తోన్న కృషిని పోచారం కేంద్ర మంత్రికి వివరించారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి అభినందించినట్లు సమావేశం అనంతరం మంత్రి పోచారం మీడియాకు వివరించారు. సమావేశం అనంతరం కేంద్రమంత్రి కి తెలంగాణ ప్రభుత్వం తరపున నాలుగు వినతి పత్రాలు అందజేసారు. దేశంలో నే తొలిసారిగా రైతుకు పంట పెట్టుబడి ఇవ్వడం పై సిఎం కేసీఆర్, ప్రభుత్వాన్ని కూడా కేంద్ర మంత్రి రాధా మోహన్ సింగ్ ప్రశంసించినట్లు తెలంగాణ వ్యవసాయ మంత్రి వెల్లడించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలంటే ప్రణాళికలు సరిపోవు.. వాటిని పకడ్బందీగా అమ లు చేయాలని పోచారం తెలిపారు. నేలలను బట్టి పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని కేంద్రప్రభుత్వానికి సూచించారు. పండించిన పంటకు కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధరకు అమ్ముకునేలా చేస్తేనే రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని కేంద్ర వ్యవసాయమంత్రికి పోచారం తెలిపారు. తెలంగాణ లో ఉద్యాన విశ్వవిద్యాలయానికి ఈ ఏడాది బడ్జెట్లో 100 కోట్లు కేటాయించాలని కూడా కేంద్రమంత్రిని కోరినట్లు పోచారం తెలిపారు.



వ్యాపారాల్లో బిజీగా ఉన్నా..

- విచారణకు హాజరుకాలేను
- సిబిఐ ఈ-మెయిల్‌కు బదులిచ్చిన నీరవ్ మోడీ
- మరిన్ని ఆస్తులు అటాచ్, పిఎన్‌బి ఆడిటర్ శర్మ అరెస్ట్

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ కుంభకోణానికి పాల్పడిన డైమండ్ కింగ్ నీరవ్ మోడీ సిబిఐకి ఝలకిచ్చాడు. విచారణకు హాజరు కావాలంటూ నీరవ్‌కు అధికారిక ఈ మెయిల్ అడ్రస్‌కు సిబిఐ పంపిన మెయిల్‌కు సమాధానమిచ్చాడు. తాను విచారణకు హజరు కానని బుధవారంనాడు స్పష్టం చేశాడు. విదేశాల్లో తనకు వ్యాపారాలు ఉన్నాయని,వాటికి హాజరు కావాల్సి ఉందని సమాధానమిచ్చాడు. మరోవైపు తాను ఎక్కడున్న విషయాన్ని కూడా బహిర్గతం చేయలేదు. నీరవ్ మోడీ ఇచ్చిన సమాధానానికి సిబిఐ అధికారులు మరో మెయిల్ పంపారు. కచ్చితంగా వచ్చే వారం విచారణకు హాజరుకావల్సిందేనంటూ ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుతమున్న దేశ హై కమిషన్‌ను సంప్రదించాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. భారత్‌కు రావడానికి అన్ని రకాల ఏర్పాట్లు తాము చేయనున్నట్టు కూడా సిబిఐ పేర్కొంది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ. 12,717 కోట్ల కుంభకోణానికి పాల్పడిన నీరవ్ మోడీ విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణం వెలుగులోకి రాక ముందే అతను దేశం విడిచి వెళ్లిపోయారు. మరోవైపు నీరవ్ మోడీ కేసులో ఆదాయపన్ను విభాగం తన చర్యలను ముమ్మరం చేసింది. బుధవారం నాడు తాజాగా రూ.70కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసుకుంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ శ్కాంలో ఆ బ్యాంకు ఆడిటర్ శర్మను సిబిఐ బుధవారంనాడు రాత్రి అదుపులోకి తీసుకుంది.

చాసిస్.. ఇంజిన్.. ఆర్‌సిలు అన్నీ నకిలీవే

- వేలంలో తీసుకున్న వాటికి కేటాయింపు
- కొనుగోలుదారులకు విక్రయం
- ఆర్‌సి కావాలంటే రూ.30 వేలు వడ్డన
- ఐదుగురు నిందితుల అరెస్టు



మన తెలంగాణ/ సిటీబ్యూరో : వేలంలో కొనుగోలు చేసిన మోటార్ సైకిళ్ళకు చాసిస్, ఇంజన్ నెంబర్లను సృష్టించి విక్రయిస్తున్న ముఠాను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి 17 వాహనాల(15 రాయల్ ఇన్‌ఫీల్డ్ 350 సిసి, 2 యమహా–350సిసి)ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోయిన్‌పల్లికి చెందిన మోటార్ సైకిళ్ళ బ్రోకర్‌గా పనిచేసే హితేష్ పటేల్(32), మెట్టుగూడ ఆలుగడ్డబావికి చెందిన మెకానిక్‌గా పనిచేస్తున్న మిచల్ మోడి(45), కొత్తపేట్ న్యూ మారుతీనగర్‌కు చెందిన ఆర్‌టిఏ ఏజెంట్ ఎ. విఠల్ రావు(49), ఉదాంగడ్డ శాస్త్రీపురంకు చెందిన హకీం అబు నసీర్(30), వారాసిగూడ ప్రాంతానికి చెందిన మెకానిక్‌పనిచేసే మహ్మద్ ఆరీఫ్(26)లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. వాహనాల క్రయవిక్రయాల విషయంలో బ్రోకర్‌గా పనిచేసే హితేష్‌పటేల్ చాసిస్, ఇంజన్ నెంబర్లను తొలగించిన అనంతరం వేలం వేసే వాహనాలను రూ. 28 వేలకు కొనుగోలు చేసి ఎలాంటి దస్తావేజులు లేకుండా రూ. 35 వేలకు ఇతరులకు విక్రయించేవాడు. ఈ ప్రక్రియలో పటేల్ హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాలకు చెందిన మెకానిక్‌ల సహాకారాన్ని తీసుకునేవాడు. ఆ వాహనాలను కొనుగోలుదారులు ఎవరైనా వాహనానికి సంబంధించిన దస్తావేజులను అడిగితే అందుకు రూ. 20–30 వేలు అదనంగా ఖర్చవుతుందని హితేష్ చెప్పేవాడు. అయినా కావలని కోరే వారి నుండి నగదును తీసుకుని దక్షిణ మండలంలో ఆర్‌టిఏగా పనిచేసే విఠల్‌రావు సహాకారంతో ఆర్‌సిలను తీసుకునేవాడు. ఈ ఆర్‌సిలు తీసుకునేందుకు విఠల్‌రావు ఆర్‌టిఏ అధికారులకు పెద్దమొత్తంలో నగదును ముట్టజెప్పేవాడు. దీంతో ఆర్‌టీఏ అధికారులు ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకుండానే ఆర్‌సిలను జారేచేసేవారని తేలింది. అయితే, ఆధార్ నెంబర్, ఫోటోలు తీసుకోవడం, ఫింగర్ ప్రింట్‌లు ఇచ్చేందుకు కావాల్సిన వ్యక్తుల కోసం విఠల్‌రావు ఆర్‌టిఏ కార్యాలయం సమీపంలోని మెకానిక్‌లైన హకీం అబు నజీర్, మహ్మద్ అరీఫ్‌లతో సంబంధాలు పెట్టుకున్నాడు. వారికి రూ. 1000లు ఇచ్చి ఫోటో, ఆధార్, ఫింగర్ ప్రింట్స్ తీసుకునేవాడు. అలాగే, ఎవరైనా వాహనానికి దస్తావేజులు కావాలని వస్తే వారి నుండి పెద్దమొత్తంలో నగదును తీసుకుని విఠల్‌రావు ద్వారా ఇప్పించేవాడు హితేష్. కాగా తుక్కుగా, పనికిరాని వాహనాలకు చెందిన చాసిస్, ఇంజన్ నెంబర్లను హితేష్ కొనుగోలు చేసిన వాహనాలకు కేటాయించేందుకు మెకానిక్ మిచెల్ మోడి సహాకారాన్ని తీసుకున్నాడు. మోడి ఇచ్చే నెంబర్లు, విఠల్ ఇచ్చే ఆర్‌సిల ద్వారా మొత్తం 35 ఆర్‌సిలను హితేష్ తీసుకున్నాడు. అవి హితేష్, మెకానిక్ అబు నాజీర్, జి. రాజ్‌కుమార్, మహ్మద్ సలీం మిగతా వార్లపేర్ల పైనా ఉన్నాయి. ఆర్‌టిఏ అధికారులను తప్పుదోవపట్టించడం, ఇతర వాహనాల చాసిస్, ఇంజన్ నెంబర్లను మరో పాత వాహనాలకు కేటాయించడం, కొనుగోలుదారులను మోసం చేయడం చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన నగర టాస్క్‌ఫోర్సు పోలీసులు రంగంలోకి దిగి ముఠాలోని 5 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుండి 17 మోటార్‌సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు.



2020 ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్ మస్కట్ల ఆవిష్కరణ

టోక్యో: జపాన్‌లో 2020 ఒలింపిక్స్ క్రీడలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు మొదలయ్యాయి. ఇందులో భాగంగా నిర్వాహకులు తాజాగా రెండు ఒలింపిక్స్ మస్కట్‌లను ఆవిష్కరించారు. ఒకటి సర్వాంగ క్రీడాకారుల ఒలింపిక్స్ మస్కట్ కాగా మరొకటి దివ్యాంగ క్రీడాకారుల ఒలింపిక్స్‌కు సంబంధించింది. తెలుపు, ముదురు నీలం రంగులో ఉన్న మస్కట్ ఒలింపిక్స్‌కు... తెలుపు, గులాబీ రంగులో ఉన్న మరో మస్కట్ పారాఒలింపిక్స్‌కు ప్రతీకలని నిర్వాహకులు తెలిపారు. మస్కట్‌ల డిజైన్‌ల పోటీలో దాదాపు 2042 మంది వ్యక్తులు, గ్రూపులు డిజైన్లను సమర్పించారు. కానీ వాటిలో చివరకు మూడింటిని మాత్రం నిపుణులు ఎంపిక చేశారు. మస్కట్‌ల ఎంపిక ప్రక్రియలో 16,000 పాఠశాలలకు చెందిన 2,00,000 మంది పాల్గొన్నారు. తుదకు దక్షిణ జపాన్‌లోని ఫుకువోకాకు చెందిన చిత్రకారుడు ర్యో తనిగుచి గీసిన మస్కట్‌లు విజేతగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా ఒలింపిక్ మస్కట్లకు మంచి డిమాండ్ ఉండనుంది. కేకులు, బొమ్మలు, ఫుడ్ ఫెస్టివల్స్‌లో ఇవి సందడి చేస్తాయి. ఇదిలా ఉండగా గెలిచిన ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్ మస్కట్లకు పేర్లయితే పెట్టలేదు... కానీ అవి రెండు 'ఒకడాన్ని మరొకటి గౌరవిస్తాయి', 'మంచి స్నేహితులు' అని పేర్కొన్నారు.



ద్యూతీచంద్‌కు స్వర్ణం

చింతా సుధాకర్‌కు కాంస్య పతకం

ఇండియన్ గ్రాండ్ ప్రీ అథ్లెటిక్స్

పటియాల: స్టార్ అథ్లెట్ ద్యూతీచంద్ కొత్త సీజన్‌ను ఘనంగా ప్రారంభించింది. ఇక్కడి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ వద్ద మంగళవారం జరిగిన ఇండియన్ గ్రాండ్ ప్రీ టోర్నీ 100 మీటర్ల విభాగంలో తలపడిన ద్యూతీ 11.57 సెకన్లలో లక్ష్యం చేరి పసిడి పతకం కైవసం చేసుకుంది. హిమ్‌దాస్ (11.74), ప్రజ్ఞా ప్రకాశ్ (11.76) తర్వాతి స్థానాల్లో నిలిచారు. కాగా తెలంగాణకు చెందిన సి.హెచ్. సుధాకర్ 100 మీటర్ల అంశంలో కాంస్యం దక్కించుకున్నాడు. 10.71 సెకన్లతో పరుగు పూర్తిచేసిన సుధాకర్‌ది ఖమ్మం జిల్లా కొత్తగూడెం. నేవీకి చెందిన విద్యాసాగర్ (10.65 సె.) స్వర్ణం, ఇన్‌కంటాక్స్ అథ్లెట్ అనురూప్ (10.70) రజతం గెల్చుకున్నారు. ఇదే మీట్‌లో పురుషుల జావెలిన్ త్రోలో ఆసియా ఛాంపియన్ నీరజ్ చోప్రా పసిడి పతకం గెలిచాడు. అతను జావెలిన్‌ను 82.88 మీటర్ల దూరం విసిరాడు.



రాజస్థాన్ స్పిన్ కోచ్‌గా సాయిరాజ్ బహుతులే

ముంబై: ఐపిఎల్ టీమ్ రాజస్థాన్ రాయల్స్ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా టీమిండియా మాజీ స్పిన్నర్ సాయిరాజ్ బహుతులే నియమితుడయ్యాడు. భారత్ తరపున బహుతులే రెండు టెస్టులు, ఎనిమిది వన్డేలు ఆడాడు. ముంబై తరపున 188 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన సాయిరాజ్ 630 వికెట్లు పడగొట్టాడు. అతడి సగటు 26గా ఉంది. అతడు 6176 పరుగులు, 9 శతకాలు సాధించి చెప్పుకోతగిన సగటు 31.83 సాధించాడు. షేన్ వార్న్ జట్టులో భాగంగా ఉండబోతున్నందుకు ఆనందాన్ని వ్యక్తం చేశాడు. మూడేళ్లుగా బెంగాల్ రంజీ కోచ్‌గా ఉన్నాడు.



2019 తర్వాతే యువీ రిటైర్మెంట్ ప్రకటన

మొనాకో: ప్రముఖ క్రికెటర్ యువరాజ్‌సింగ్ తన రిటైర్‌మెంట్ ప్రకటనపై పెదవి విప్పాడు. 2019 తర్వాతే వీడ్కోలు గురించి నిర్ణయం తీసుకుంటానని ప్రకటించాడు. అదే ఏడాది ఇంగ్లాండ్‌లో ఐసిసి ప్రపంచకప్ జరగనున్నది. యువీ టీమిండియా తరఫున చివరి వన్డే 2017 జూన్‌లో ఆడాడు. ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) కొత్త సీజన్‌లో మెరుపులు మెరిపించాలని పట్టుదలతో ఉన్నాడు. భారత టి20 జట్టులో స్థానం పదిలం చేసుకోవాలని కోరుకుంటున్నాడు. మంచి ప్రదర్శనలతో 2019 ప్రపంచకప్‌లో ఆడాలని అనుకుంటున్నాడు. 'ఐపిఎల్‌లో బాగా ఆడాలని కోరుకుంటున్నాను. 2019 వరకు క్రికెట్ ఆడేందుకు ఐపిఎల్ నాకు కీలకం కానుంది. 2019 వరకు క్రికెట్ ఆడాలన్నది నా ఉద్దేశం. ఇప్పుడు వచ్చే అవకాశాలు, ఆడుతున్న తీరును బట్టే వీడ్కోలు నిర్ణయం తీసుకుంటా' అని 18వ లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డు వేడుకలకు హాజరైన యువీ అన్నాడు.

చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో కర్ణ్ శర్మ

చెన్నై: మహేంద్ర సింగ్ ధోని నేతృత్వంలోని చెన్నై సూపర్ కింగ్స్(సిఎస్‌కె) జట్టులో ఆడే అవకాశం లెగ్ స్పిన్నర్ కర్ణ్ శర్మకు దక్కింది. తాను ధోని నేతృత్వంలో ఎంతో నేర్చుకుంటానని అతడెంతో ఉత్తేజితం అయ్యాడు. 'ధోని నేతృత్వంలోని చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడేందుకు నాకు అవకాశం దొరికినందుకు నేను ఎంతగానో ఎక్సయిట్ అవుతున్నాను. ధోని చాలా గొప్ప కెప్టెన్. క్రికెటర్ల నుంచి అత్యుత్తమ ప్రతిభను ఎలా రాబట్టుకోవాలో ఆయనకు బాగా తెలుసు. ఆయన నేతృత్వంలో నేను చాలా నేర్చుకునే వీలుంది' అని కర్ణ్ శర్మ అన్నట్లు సిఎస్‌కె వెబ్‌సైట్ పేర్కొంది. ఆడేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నానని కూడా మీరట్ క్రికెటర్ అయిన శర్మ తెలిపాడు. 2017–18 మధ్య కాలంలో దేశీయ క్రికెట్‌లో శర్మ బాగా స్థిరంగా రాణించాడు. 2014లో అతడు భారత జట్టు టెస్ట్, వన్డే, టి20లకు ప్రాతినిధ్యం వహించాడు. గత సీజనులో ముంబయి ఇండియన్స్ తమ మూడో టైటిల్‌ను గెలుచుకోవడంలో కర్ణ్ శర్మ ముఖ్య భూమికను పోషించాడు. లోయర్ బ్యాట్స్‌మన్‌గా అతడెంతో ఉపయోగపడతాడు. ఐపిఎల్‌కు కూడా చాలా కాలంగా ఆడుతున్నాడు. వివిధ బ్యాట్స్‌మెన్‌లకు వైవిధ్యభరితంగా ఎలా బౌలింగ్ చేయాలన్నది కూడా నేర్చుకున్నాడు. దాంతో అతడు మెరుగైన బౌలర్‌గా రూపొందాడు.



హాకీ ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

భువనేశ్వర్‌లో నవంబర్ 28 – డిసెంబర్ 16

న్యూఢిల్లీ: హాకీ ప్రపంచ కప్ టోర్నీ ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 16 వరకూ జరుగనుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను అంతర్జాతీయ హాకీ సంఘం బుధవారం విడుదల చేసింది. దీనిలో భాగంగా 16 దేశాలకు చెందిన జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. అయితే ఇందులో భారత్‌కు పూల్–సిలో చోటు లభించింది. ఈ పూల్‌లో భారత్‌తో పాటు బెల్జియం, కెనడా, దక్షిణాఫ్రికా జట్లు ఉన్నాయి. మరో వైపు నాలుగు సార్లు ప్రపంచ హాకీ కప్ విజేత పాకిస్థాన్, రెండు ప్రపంచ కప్‌ల విజేత జర్మనీ పూల్–డిలో ఉన్నాయి. ఈ మాజీ ప్రపంచ ఛాంపియన్లు డిసెంబర్ 1న తలపడనున్నాయి. వీటితో పాటు నెదర్లాండ్స్, మలేషియా జట్లు పూల్–డిలో అగ్రస్థానం కోసం పోటీ పడనున్నాయి. నవంబర్ 28న ప్రారంభం కానున్న హాకీ ప్రపంచ కప్‌లో తొలి మ్యాచ్ అతిథ్య జట్టు భారత్‌కు, దక్షిణాఫ్రికా మధ్య జరుగనుంది. అదేవిధంగా డిసెంబర్ 2న బెల్జియంతో, డిసెంబర్ 8న కెనడాతో భారత్ తలపడనుంది.

పూల్ దశలో ఒక్కో జట్టు మూడేసి చొప్పున మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. ఇవి నవంబర్ 28నుంచి డిసెంబర్ 9 వరకూ జరుగుతాయి. పూల్ స్థాయిలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తుంది. ఇక క్వార్టర్ ఫైనల్స్ డిసెంబర్ 12–13 తేదీల్లో జరుగుతాయి. సెమీ ఫైనల్స్ 15వ తేదీన, ఫైనల్ డిసెంబర్ 16తో ముగుస్తుందని అంతర్జాతీయ హాకీ సంఘం తెలిపింది.

పాకిస్థాన్, భారత్ మధ్య సంబంధాలు అంతంతమాత్రంగా ఉన్న సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో భారత్ వేదికగా జరిగే ప్రపంచ కప్‌లో పాకిస్థాన్ జట్టు పాల్గొనే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కానీ వారి ఊహాగానాలకు తెరదింపుతూ పాక్ భువనేశ్వర్‌లో జరుగనున్న హాకీ ప్రపంచ కప్‌లో పాల్గొననున్నట్లు ఇటీవలే ప్రకటించింది.



జట్ల వివరాలు:
పూల్–ఎ: అర్జంటీనా, న్యూజిలాండ్, స్పెయిన్, ఫ్రాన్స్
పూల్–బి: ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఐర్లాండ్, చైనా
పూల్–సి: బెల్జియం, భారత్, కెనడా, దక్షిణాఫ్రికా
పూల్–డి: నెదర్లాండ్స్, జర్మనీ, మలేషియా, పాకిస్థాన్.

రష్యా ఒలింపిక్ సభ్యత్వం పునరుద్ధరణ

నిషేధాన్ని ఎత్తేసిన ఐఒసి

మాస్కో: ప్రభుత్వమే డోపింగ్‌ను ప్రోత్సహించడంతో ప్యాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌లో నిషేధానికి గురైన రష్యాపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఒసి) బుధవారం నిషేధాన్ని ఎత్తేసింది. రష్యా ఒలింపిక్ కమిటీ హక్కులను పూర్తిగా పునరుద్ధరించారు' అని రష్యన్ ఒలింపిక్ కమిటీ(ఆర్‌ఒసి) అధ్యక్షుడు అలెగ్జాండర్ జుకోవ్ తెలిపారు. నిషేధం ఎత్తివేతకు సంబంధించిన లేఖ ఐఒసి నుంచి బుధవారం అందినట్లు ఆయన తెలిపారు. పెద్ద ఎత్తున డోపింగ్‌కు పాల్పడినందుకుగాను 2018 ఒలింపిక్స్‌లో పాల్గొనకుండా రష్యాను డిసెంబర్‌లో నిషేధించారు. అయితే 2018 ప్యాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌లో రష్యా క్రీడాకారులు తటస్థులుగా(న్యూట్రల్స్) పోటీచేశారు. డిసెంబర్ 5 నుంచి తాము నిషేధం కారణంగా కష్టకాలాన్ని ఎదుర్కొన్నామని, ప్యాంగ్‌చాంగ్‌లో ఒలింపిక్ పతాకం కింద తమ 168 అథెట్లు స్వచ్ఛంగా(క్లీన్) వెలుగుచూశారని జుకోవ్ చెప్పారు. ఐఒసి బుధవారం తీసుకున్న నిర్ణయం తమకు చాలా ముఖ్యంగా భావిస్తున్నామన్నారు.



షాజాబ్ హసన్‌పై ఏడాది నిషేధం



ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ఓపెనర్ షాజాబ్ హసన్‌పై ఆదేశ క్రికెట్ బోర్డు (పిసిబి) ఏడాది కాలం నిషేధంతో పాటు, పదిలక్షల రూపాయల జరిమాన విధించింది. గతేడాది దుబాయ్ వేదికగా జరిగిన పాకిస్తాన్ సూపర్ లీగ్ (పిఎస్‌ఎల్)లో షాజాబ్‌తో పాటు పలువురు పాక్ క్రికెటర్లు మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు ఎదుర్కొన్నారు. వీరిలో కొంతమందిపై ఇప్పటికే చర్యలు తీసుకున్న పిసిబి తాజాగా హసన్‌పై నిషేధం విధించింది. ఈ విషయాన్ని బోర్డు లీగల్ అడ్వైజర్ తఫ్ఫజుల్ రిజ్వీ ధ్రువీకరించారు. ఇతర క్రికెటర్లు మ్యాచ్ ఫిక్సింగ్‌ల పాల్పడకుండా హసన్‌పై మరిన్ని కఠిన చర్యలు తీసుకునేలా చార్జ్ షీట్ దాఖలు చేస్తామని ఆయన మీడియాకు వెల్లడించారు.



త్వరలో కోహ్లి సేనకు బిసిసిఐ వరాలు

ముంబయి: టీమిండియా ఆటగాళ్లు త్వరలో శుభవార్త విననున్నారు. అదేమిటంటే.. టీమిండియా ఆటగాళ్లందరికీ జీతాలు పెరగనున్నాయ్. పెంచిన వేతనాలు అందించేందుకు బిసిసిఐ ఆటగాళ్లను A+, A, Bగా విభజించింది. టెస్టు, వన్డే, టి20 మూడు ఫార్మాట్లు ఆడే ఆటగాళ్లు A+లో చోటు దక్కించుకోనున్నట్లు సమాచారం. ఇలా చేస్తే కోహ్లి, ధవన్, రోహిత్, పాండ్య, భువనేశ్వర్ తదితర ఆటగాళ్లు భారీగానే వేతనాలు అందుకుంటారు.మార్చి 3న లంక పర్యటన కోసం భారత ఆటగాళ్లు బయలుదేరనున్నారు. ఆటగాళ్లు ఈ పర్యటనకు బయలుదేరే ముందు బిసిసిఐ శుభవార్త ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ముంబయిలో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని సమాచారం. టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ గతంలో అగ్ర జాబితాలో ఉండటంపై పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏ ఆటగాళ్లు ఏ జాబితాలో చోటు దక్కించుకుని ఎంత మేర వేతనాలు అందుకుంటారో తెలియాలంటే బిసిసిఐ ప్రకటించే వరకు వేచి ఉండక తప్పదు. గత ఏడాది కోహ్లి, ధోని, రవిశాస్త్రి ఆటగాళ్ల జీతాలపై బిసిసిఐతో చర్చలు జరిపారు.

లలిత్ మోడీ కేసు క్రాస్ ఎగ్జామినేషన్‌లో బిసిసిఐకి బాంబే హైకోర్టు అనుమతి



ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) మాజీ కమిషనర్ లలిత్ మోడీ విదేశీ మారక నిర్వహణ చట్టం(ఫెమా) ఉల్లంఘించారన్న ఆరోపణ కేసులో కొందరు సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే సమయంలో భారత క్రికెట్ నియంత్రణ బోర్డు(బిసిసిఐ) సభ్యులు హాజరయ్యేందుకు బాంబే హైకోర్టు బుధవారం అనుమతించింది. న్యాయమూర్తులు ఎస్.సి. ధర్మాధికారి, పి.డి.నాయక్‌లతో కూడిన ధర్మాసనం ఈ అనుమతిని ఇచ్చింది. అయితే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కార్యాలయంలో జరిగే క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియకు బిసిసిఐ ప్రతినిధులు హాజరుకావొచ్చునే తప్ప పాల్గొనడం కానీ, కోర్టు వ్యవహారంలో జోక్యం చేసుకోవడం కానీ చేయకూడదని ఆంక్ష కూడా పెట్టింది. బిసిసిఐ దాఖలు చేసిన వినతిని ధర్మాసనం విచారించింది. బిసిసిఐ తరపు న్యాయవాది రఫీఖ్ దాదా వాదిస్తూ గతంలో కొందరు సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేయడానికి లలిత్ మోడీకి అనుమతించారని, వారంతా బిసిసిఐ మాజీ సభ్యులని, బిసిసిఐ ప్రతినిధులు కూడా క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో హాజరయ్యేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనుమతించేలా కోర్టు ఆదేశించాలన్నారు. సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసేందుకు బిసిసిఐకు అనుమతించాలని కూడా ఆయన కోరారు. 2009లో ఐపిఎల్ క్రికెట్ టోర్నమెంటు జరగడానికి ముందు దక్షిణాఫ్రికాలో బిసిసిఐ బ్యాంకు ఖాతా తెరవడంపై ఫెమా అంశాల కింద బిసిసిఐ, లలిత్ మోడీలకు 2011 జులై 20న ఇడి నోటీసులు జారీ చేసింది. నాటి బిసిసిఐ అధ్యక్షుడు శశాంక్ మనోహర్, కార్యదర్శి ఎన్. శ్రీనివాసన్, కోశాధికారి ఎం.పి. పాండవ్, సిఇఒ రత్నాకర్ శెట్టి, ఐపిఎల్ మేనేజర్ ప్రసన్న కన్నన్, సిఒఒ సుందర్ రమన్ తదితరులను సాక్షులుగా పిలిచేందుకు, వారికి సమన్లు జారీ చేసేందుకు ఇడికి హైకోర్టు అనుమతించింది. ఈ సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ మార్చి 1 నుంచి 13 వరకు జరగనుంది. ఈ సాక్షులు బిసిసిఐపై కొన్ని వ్యాఖ్యలు చేసే ఆస్కారం ఉన్నందున బిసిసిఐ ప్రతినిధులు కూడా దీనికి హాజరయ్యేందుకు అనుమతించాలని రఫీఖ్ దాదా వాదించారు. క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో హాజరయ్యేందుకు బిసిసిఐకు హక్కు ఉందని కూడా అన్నారు. 'వారు బిసిసిఐపై కొ న్ని ప్రతికూల వ్యాఖ్యలు చేయొచ్చని మేము భావిస్తున్నాం. సంస్థ పేరును పరిరక్షించేందుకు మేము కూడా హాజరయ్యేందుకు అనుమతించాలి. అంతేకాక వారిని క్రాస్ ఎగ్జామిన్ చేయడానికి కూడా అనుమతించాలి' అన్నారు. అయి తే ధర్మాసనం ఆ సమయంలో బిసిసిఐ ప్రతినిధులు హాజరయ్యేందుకు అనుమతించినప్పటికీ సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాన్ని తర్వాత వేరే తేదీలో ఇస్తామని అన్నది. 'ఏదిఏలా ఉన్నప్పటికీ క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ కు హాజరయ్యే బిసిసిఐ ప్రతినిధులు కోర్టు వ్యవహారంలో కలుగజేసుకోవరాదన్నది మనసులో ఉంచుకోవాలి. సలహా ఇవ్వడం, కోర్టు కార్యకలాపాల్లో కలుగజేసుకోవడం వంటి వి చేయకూడదు' అని ధర్మాసనం స్పష్టంగా పేర్కొంది.

ధోని చెప్పిందొకటి..రైనా చేసింది మరొకటి



- **మూల్యం చెల్లించుకోక తప్పలేదు**

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని మైదానంలో వికెట్ల వెనుక ఉండి బౌలర్లకు సలహాలిచ్చి మ్యాచ్‌లు గెలిపించిన సంఘటనలు ఎన్నో...తాజాగా ధోని–రైనాలకు సంబంధించిన ఓ విడియో ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతూ సంచలనం సృష్టిస్తోంది. ఆ విడియోలో ధోని ఒకటి చెబితే దానికి విరుద్ధంగా సురేశ్ రైనా మరోటి చేసినట్లు ఉంది. సురేశ్ రైనా ఏడాదిపాటు విరామం తర్వాత జట్టులోకి వచ్చాడు. కానీ ధోని సూచనకు భిన్నంగా ఆడి వార్తల్లో నిలిచాడు. విషయంలోకి వెళితే కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాకు వ్యతిరేకంగా తుది, మూడో అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో వికెట్‌కీపర్‌గా ఉన్న ధోని, బౌలర్ సురేశ్ రైనాకు సూచనలు చేశాడు. అక్షర్ పటేల్ తన మొదటి ఓవర్లో 16 పరుగులు ఇచ్చాక రైనా 14 ఓవర్ బౌలింగ్ చేశాడు. ఆ ఓవర్లో మూడు బంతులకు మూడు పరుగులు ఇచ్చిన రైనా తదుపరి బంతి వేసేందుకు సిద్ధమయ్యాడు. అప్పుడు ధోని, రైనాకు 'బంతిని వేగంగా వేయకు, అంతేకాక నేరుగా వికెట్ల మీదకు వచ్చేలా వేయకు' (దండేపే తేజ్ మత్ దాల్నా) అని ఒకటికి మూడుసార్లు చెప్పాడు. అది స్టంప్ మైక్ ద్వారా అందరికీ తెలిసింది. కానీ ఆఫ్‌స్పిన్నర్ రైనా మాత్రం అదేమి తలకెక్కించుకోకుండా బంతిని నేరుగా వికెట్ల మీదకు వెళ్ళేలా వేశాడు. దాంతో దక్షిణాఫ్రికా తరఫున తొలిసారిగా ఆడుతున్న(డెబుటెంట్) క్రిస్టియన్ జోంకర్ బ్యాక్–టు–బ్యాక్ బౌండరీలు దంచేశాడు. మూల్యం చెల్లించుకోక తప్పలేదు. అదృష్టవశాత్తు ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించి సిరీస్‌ను దక్కించుకుంది. భారత జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 172 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. తర్వాత 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. దక్షిణాఫ్రికాతో ఆడిన మూడు మ్యాచ్‌ల టి20లో టీమిండియా 2–1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.



యంగెస్ట్ కెప్టెన్‌గా రషీద్ ఖాన్ రికార్డు!

న్యూఢిల్లీ: అఫ్ఘానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మరో రికార్డును తన ఖాతాలో వేసుకోనున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత పిన్న వయస్కుడైన కెప్టెన్‌గా అతను చరిత్ర సృష్టించనున్నాడు. ఇప్పటికే ఐసిసి ర్యాంకింగ్స్‌లో ఏ ఫార్మాట్‌లో అయినా నెంబర్ వన్ ర్యాంక్ అందుకున్న పిన్న వయస్కుడిగా రికార్డుకెక్కిన 19 ఏళ్ల రషీద్ అఫ్ఘాన్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. అపెండిసైటిస్ కారణంగా రెగ్యులర్ కెప్టెన్ అయిన అస్గర్ స్టానిక్జాయ్ పది రోజులు జట్టుకు దూరం కావడంతో అతని స్థానంలో వైస్ కెప్టెన్ రషీద్‌ను తాత్కాలిక సారథిగా ఎంపిక చేసినట్టు అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు మంగళవారం ప్రకటించింది. 2019 ప్రపంచ కప్‌కు అర్హత పొందేందుకు అఫ్ఘాన్ జట్టు మార్చి 4న స్కాట్‌లాండ్‌తో తలపడనున్నది. లెగ్ స్పిన్నర్ అయిన రషీద్ ఇప్పటి వరకు 37 వన్డేల్లో 86 వికెట్లు, 29 టి20ల్లో 47 వికెట్లు తీసుకున్నాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, Editor: K. Sreenivas Reddy, RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.